www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 250

బుధవారం | 25-12-2024 | పేజీలు: 14

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా. 10.29 తదుపరి ఏకాదశి; నక్షత్రం: చిత్త మ. 3.22 తదుపరి స్వాతి; వర్జ్యం: రా. 9.36-11.24; దుర్ముహూర్తం: ఉ. 11.53-12.37; అమృతఘడియలు: ఉ. 8.08-9.57; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 5.44

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేడు క్రిస్మస్

వేడుకలకు ముస్తాబైన చర్చిలు



క్రిస్మస్ సందర్భంగా విద్యుత్ వెలుగుల్లో విజయవాడలోని సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి

రామాయపట్నంలో భారీ రిఫైనరీ

పెట్రో-కెమికల్ కాంప్లెక్స్ కూడా..

రూ.6,100 కోట్ల అంచనాతో ఏర్పాటు

- బీపీసీఎల్ బోర్డు సమావేశంలో నిర్ణయం
- తక్షణమే స్టాక్ ఎక్ఛేంజీలకు సమాచారం
- స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ కోసం ప్రతిపాదన
- ప్రీ-ప్రాజెక్టు పనులు ప్రారంభించామన్న సంస్థ
- బందరుకు తెచ్చేందుకు ఎంపీ బాలశౌరి యత్నాలు
- బీపీసీఎల్‌తో సీఎం స్థాయిలోనూ చర్చలు
- మచిలీపట్నం అనువైన ప్రాంతమని, అవసరమైన భూములిస్తామని బాబు హామీ
- తొలుత బీపీసీఎల్ అధికారులు సానుకూలం
- తర్వాత రామాయపట్నం మేలని తుది నిర్ణయం
- రాష్ట్రానికి రావడమే ముఖ్యమని సర్కారు ఓకే

విజయవాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మరో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ భారీ పెట్టుబడి పెట్టనుంది. నెల్లూరు జిల్లా రామాయపట్నంలో భారీ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ కమ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) నిర్ణయించింది. రూ.6,100 కోట్ల అంచనా వ్యయంతో తూర్పు తీరాన రామాయపట్నంలో దీనిని నెలకొల్పాలన్న ప్రతిపాదనను మంగళవారం జరిగిన బీపీసీఎల్ బోర్డు సమావేశం ఆమోదించింది. ఆ వెంటనే బీపీసీఎల్ ఈ సమాచారాన్ని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఈ), భారత్ స్టాక్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్ (బీఎస్ఈ)కు

మిగతా 3వ పేజీలో...



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రిఫెక్చర్ గవర్నర్ హచిరో నిట్టా, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్

రాష్ట్రంలో జపనీస్ జెన్ గార్డెన్!

- టోయామాతో ఒప్పందం పునరుద్ధరణ
- రాష్ట్రానికి వచ్చిన ప్రిఫెక్చర్ గవర్నర్
- కీలక రంగాల్లో పెట్టుబడులు, సహకారం
- ఏపీ-జపాన్ సంబంధాలు మరింత బలోపేతం

12



సంజయ్‌పై ఏసీబీ కేసు

- సీఐడీలో బద్దలైన భారీ కుంభకోణం
- ఆయన హయాంలో 'అగ్ని'కీ చెదలు
- ఎస్సీఎస్టీలకు అవగాహన పేరుతో రూ.1.16 కోట్లు స్వాహా చేసినట్లు అభియోగం
- ఖర్చు చేసింది 3.10 లక్షలు.. డ్రా చేసింది రూ.1.19 కోట్లని నిర్ధారణ
- 2 పైసలు ఖర్చు.. 98 పైసలు తినేసిన వైనం
- అగ్నిమాపక శాఖలోనూ 59 లక్షలు గోల్‌మాల్
- వెలికితీసిన విజిలెన్స్.. కేసు పెట్టిన ఏసీబీ
- ఐపీసీ 409, 420, 477ఏ, రెడ్‌విత్ 120తోపాటు పీసీ యాక్టు

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దళితులు, గిరిజనుల పేరుతో ప్రభుత్వ సొమ్ము స్వాహా చేసిన వ్యవహారంలో సీఐడీ మాజీ అధిపతి సంజయ్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది. అగ్నిమాపక శాఖ డీజీగా పనిచేసిన సమయంలోనూ అగ్ని పోర్టల్ కొనుగోలులో అక్రమాలకు పాల్పడ్డారని రెండో అభియోగం మోపింది. అవినీతి నిరోధక చట్టంతోపాటు ఐపీసీ సెక్షన్లతో ఆయనపై కేసు నమోదు చేసిన ఏసీబీ... సహ నిందితులుగా క్రిత్వాప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్,

మిగతా 13వ పేజీలో...

తప్పయిపోయింది

చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో అల్లు అర్జున్ కన్నీరు?

తొక్కిసలాట వీడియోలు చూసి.. భావోద్వేగం!



- న్యాయవాది సమక్షంలో పోలీసుల విచారణ
- ఉదయం 11:05 నుంచి మధ్యాహ్నం 2:45 వరకు
- మూడున్నర గంటలపాటు అల్లు అర్జున్‌కు ప్రశ్నల వర్షం

మంగళవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన నటుడు అల్లు అర్జున్

- సినిమాకు నేరుగా వెళ్లక రోడ్‌షో ఎందుకు చేశారు?
- అనుమతి లేనిదే రోడ్ షో చేయడం తప్పని తెలీదా?
- రేవతి చనిపోయిన విషయం మీకెప్పుడు తెలిసింది?
- వెళ్లిపోవాలని ఏసీపీ చెప్పినా.. ఎందుకు వెళ్లలేదు?
- దర్యాప్తు జరుగుతుండగా ప్రెస్‌మీట్ ఎలా పెట్టారు?
- దాదాపు 20 ప్రశ్నలు అడిగిన పోలీసులు.. వాటిలో ఒకటి, రెండు మినహా అన్నింటికీ బన్నీ సమాధానం
- న్యాయవాదుల సూచన మేరకు కొన్నిటికి దాటవేత
- ఎప్పుడు పిలిచినా విచారణకు వస్తానని స్పష్టీకరణ
- మూడుసార్లు విరామం.. బన్నీకి టీ ఇచ్చిన పోలీసులు
- ఠాణా వద్దకు అల్లు అరవింద్, అల్లు అర్జున్ మామ
- భారీగా ప్రజలు, అభిమానుల రాకతో స్వల్పఉద్రిక్తత

హైదరాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'తగ్గేదే లే' అని సినిమాలో డైలాగులు చెప్పిన నటుడు అల్లు అర్జున్.. నిజ జీవితంలో పోలీసుల విచారణలో కాస్తంత వెనక్కి తగ్గారా? తప్పు ఒప్పుకొని కన్నీరు కూడా పెట్టారా? అంటే.. విశ్వసనీయ వర్గాలు ఔననే సమాధానమే ఇస్తున్నాయి. ఆ వర్గాలు చెబుతున్నదాని ప్రకారం.. సంధ్య థియేటర్ వద్ద జరిగిన దుర్ఘటనకు తాను కారణం కాదని ఇన్నిరోజులుగా చెబుతున్న బన్నీ.. తనవల్ల పెద్ద తప్పు జరిగిపోయిందంటూ మంగళవారం పోలీసుల వద్ద విచారం వ్యక్తం చేశారు! తోపులాటలో కింద పడి అపస్మారకస్థితిలోకి వెళ్లిన రేవతి, శ్రీతేజ్‌ను బతికించడం కోసం పోలీసులు సీపీఆర్ చేసిన వీడియోను చూసి ఆయన కళ్లనీళ్లు పెట్టుకున్నారు!! తొక్కిసలాటకు సంబంధించి పోలీసులు చూపిన 10 నిమిషాల వీడియో చూసి ఆయన భావోద్వేగానికి గురైనట్టు సమాచారం. 'పుష్ప-2' ప్రీమియర్ షో సందర్భంగా

మిగతా 2వ పేజీలో...

జగన్ మీడియాకు దోచి పెట్టారు!

సమాచార మాజీ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డిపై ఏసీబీ కేసు



- ప్రకటనల రూపంలో జగన్ మీడియాకు వందల కోట్లు
- బకాయిలూ ఇవ్వకుండా ఇతర మీడియాకు వేధింపులు
- అడ్డగోలుగా వైసీపీ సోషల్ సైకోల నియామకం
- అర్హతలు, ఇంటర్వ్యూలతో సంబంధం లేదు
- ఇష్టానుసారం నియమించిన నాటి కమిషనర్
- వారికి వేతనాల రూపంలో రూ.కోట్ల చెల్లింపు
- కేసు నమోదు చేసిన గుంటూరు ఏసీబీ ఏఎస్పీ

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పత్రికల సర్క్యులేషన్ ఆయన పట్టించుకోలేదు... టీవీ చానళ్ల ప్రేక్షకాదరణ చూడలేదు.. నాటి అధికార పార్టీ పత్రిక, టీవీని మాత్రమే చదివారు.. చూశారు.. నిబంధనలన్నీ పక్కనబెట్టి అడ్డగోలుగా జగన్ రోత పత్రికకు, కూలి మీడియాకు వందల కోట్ల ప్రజాధనాన్ని దోచిపెట్టారు. అంతేకాదు.. జగన్

మిగతా 12వ పేజీలో...



13

ఫైబర్‌నెట్‌ను ముంచేశారు!

- గత ఐదేళ్లూ అరాచకం..అస్తవ్యస్తం
- కార్పొరేషన్‌లో వేతనాలు తీసుకుంటూ మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లలో పనులు
- ఫోన్ ఆదేశాలు, వాట్సాప్ మెసేజ్‌లతో కొలువులు.. నియామక పత్రాలూ లేవు
- 410 అనధికార ఉద్యోగులను తొలగించాం
- త్వరలో మరో 200 మందికీ ఉద్వాసన
- తిరుపతిలో మాజీ ఎండీ హోటల్ నిర్మాణంపై ఆరా: ఫైబర్‌నెట్ చైర్మన్ జీవీ రెడ్డి

సంక్రాంతికి 'సహకార' పోస్టుల భర్తీ!

- వ్యవసాయ మార్కెట్ కమిటీల పదవులు కూడా..
- ఏఎంసీ చైర్మన్ పదవుల్లో సగం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు
- క్షేత్ర స్థాయిలో 10 వేల పదవులు దక్కే అవకాశం

13

కూటమి నేతలకు కొత్త సంవత్సర బహుమతి

కోస్తాలో ముసురు

3

స్థిరంగా తీవ్ర అల్పపీడనం

బీఎల్‌వోలకు రూ.58 కోట్ల గౌరవ వేతనం విడుదల

- మూడేళ్లు నిర్లక్ష్యం చేసిన వైసీపీ సర్కార్
- కూటమి ప్రభుత్వం వచ్చాక సానుకూల చర్యలు

13



14

ఒడిశా గవర్నర్‌గా హరిబాబు

- మిజోరాంకు జనరల్ వీకే సింగ్
- కేరళ, బిహార్ గవర్నర్ల పరస్పర బదిలీ
- మొత్తం 5 రాష్ట్రాల్లో మార్పుచేర్పులు



మనాలీపై మంచు దుప్పటి

నిలిచిపోయిన వెయ్యికి పైగా వాహనాలు

14

700 మందిని కాపాడిన అధికారులు.. అటల్ టన్నెల్ దారిలో నో ఎంట్రీ

తదుపరి సీఎస్‌గా సాయి ప్రసాద్?

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎంపికపై ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు
- ఈ నెలాఖరుకు నీరబ్ పదవీ విరమణ
- సీనియారిటీ జాబితాలో శ్రీలక్ష్మి సీనియర్
- కానీ.. అవినీతి, జైలు, కేసులతో కళంకం
- ఈ నేపథ్యంలో సాయి వైపే సర్కారు మొగ్గు

2

పశువులకూ.. ఆధార్



అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మనుషులకు ఆధార్ గుర్తింపు నంబర్ ఉన్నట్టే.. పశువులకూ గుర్తింపు నంబరు (పశు ఆధార్) ఇవ్వనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు చెప్పారు. ఇన్ఫర్మేషన్ నెట్‌వర్క్ ఫర్ యానిమల్ ప్రొడక్టివిటీ అండ్ హెల్త్ అనే నెట్‌వర్క్ ద్వారా 12 అంకెల నంబరును చెవి పోగుపై ముద్రించి, పశువులకు వేయడానికి రూపొందించినట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఆవు, గేదె, దూడ, మేక, గొర్రెకు చెవి పోగులు వేస్తామన్నారు. బార్‌కోడింగ్‌తో పశు యజమాని పేరు, చిరునామా, పశువు వివరాలను ఐఎన్ఏపీహెచ్ అనే ఆన్‌లైన్ పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తామని చెప్పారు. దీనివల్ల పశువు ఆరోగ్య వివరాలతోపాటు, ప్రభుత్వ పథకాల లబ్ధి వివరాలు తెలుస్తాయని అన్నారు.

వందేళ్లుగా ఆ బావి నీరే దిక్కు!

- వందకుపైగా మోటార్లు.. నేరుగా ఇళ్లకు పైపులు
- బాపట్ల జిల్లాలో ఊరంతటినీ ఆదుకుంటున్న బావి

అద్దంకి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాతముత్తాతల కాలం నుంచీ ఆ గ్రామానికి ఊళ్లో ఉన్న ఒక్క బావి నీరే దిక్కు.. అప్పట్లో గిలకల ద్వారా బావి నీటిని తోడుకొని కావడి, బిందెలతో ఇంటికి మోసుకు పోయే వారు. కాలక్రమంలో ఆ పద్ధతి మారి పోయి విద్యుత్ మోటార్లు వచ్చాయి. దీంతో ఎవరికి వారే మోటార్లను ఏర్పాటు చేసుకొని ఇళ్ల వరకు మంచినీటి పైప్ లైన్లను వేసుకొని వినియోగించుకుంటున్నారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం మామిళ్లపల్లి పరిస్థితి ఇది. ఈగ్రామంలో ఎక్కడ బోరువేసినా ఉప్పునీరే వస్తోంది. కానీ ఆ ఒక్క బావి నీరు మాత్రం రుచిగా ఉంటుంది. తాగునీటి కోసం ఆ బావి నీరు ఆధారంగా ఆర్వో ప్లాంట్ నిర్వహిస్తున్నారు. ఇళ్లల్లో వాడుకునేందుకు కూడా బోర్ల నీరు ఉపయోగపడకపోవడంతో సుమారు 100 కుటుంబాలు ఆ బావి నీటిని వినియోగించుకునేలా నేరుగా బావి వరకు సర్వీస్ వైరు ఏర్పాటు చేసుకొని మోటార్లు బిగించుకున్నారు. సమీప ఇళ్లవారు నేరుగా ఇళ్ల వద్ద విద్యుత్ తోనే పైపులు ఏర్పాటు చేసుకోగా, దూరంగా ఉన్న వారంతా సమీపంలోని షెడ్‌లోనే విద్యుత్ మీటర్లు పెట్టి, మోటార్లను బావిలోకి దించారు. దీంతో బావి మొత్తం మోటార్లు, విద్యుత్ వైర్లు, వాటర్‌పైప్‌లతో నిండిపోయింది.




విద్యుత్ మోటారు వైర్లతో నిండిపోయిన బావి, బావి నుంచి ఇళ్ల వరకు ఏర్పాటు చేసుకున్న పైప్‌లు

లోకం తీరు



అల్లు అర్జున్.. రూ. 10లక్షల

డీడీ పంపారు

- ఆరోగ్యం కొంత మెరుగైంది: శ్రీతేజ్ తండ్రి భాస్కర్

రాంగోపాల్‌పేట్, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): శ్రీతేజ్ కళ్లు తెరిచి చూశాడు కానీ.. తనను గుర్తు పట్టడం లేదని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ తెలిపారు. కిమ్స్ ఆస్పత్రి వద్ద మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిలో కొద్దిగా మెరుగుదల కనిపిస్తుందని వివరించారు. ఇప్పటి వరకు మైత్రీ మూవీస్ తరఫున రూ.50లక్షలు అందగా, కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ తరఫున మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రూ.25లక్షలు అందించారని వెల్లడించారు. శ్రీతేజ్ వైద్యం కోసం అల్లు అర్జున్ రూ.10లక్షల డీడీ పంపినట్లు వివరించారు. మీడియా మద్దతు లభించిందని, అల్లు అర్జున్ సైతం సానుకూలంగా స్పందించడంతో కేసు వాపసు తీసుకుంటున్నానని చెప్పానన్నారు.

విచారణ తర్వాతే చర్యలు

- పోలీసు బందోబస్తుపై అనుమానాలు
- అల్లు అర్జున్ వివాదంపై పురందేశ్వరి వ్యాఖ్యలు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్లు అర్జున్ విషయంలో పూర్తిస్థాయి పోలీసు విచారణ తర్వాతే ఏవైనా చర్యలు ఉంటాయని అనుకుంటున్నానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు,ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. 'పెద్ద పేరున్న నటుడిగా సంధ్యా థియేటర్‌కు అల్లు అర్జున్ వచ్చే సమయంలో పోలీసులు తప్పనిసరిగా గట్టి భద్రత ఏర్పాటుచేసి ఉండాలి. అయితే ఆ స్థాయిలో బందోబస్తు లోపించిదేమోనని ప్రజల్లో అనుమానాలున్నాయి' అని వ్యాఖ్యానించారు. అంతకుముందు ఆమె మాట్లాడుతూ.. 'భారత రాజ్యాంగానికి 106 పర్యాయాలు సవరణలు చేస్తే అందులో చాలా వరకూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే చేశారు. రాజ్యాంగాన్ని బీజేపీ మారుస్తుందని సార్వత్రిక ఎన్నికల సమయంలో కాంగ్రెస్ దుష్ప్రచారం చేసింది. ఇది పూర్తిగా నిరాధారం. అంబేడ్కర్ రాజ్యాంగం కారణంగానే తాను ప్రధాని అయ్యానని మోదీ చెప్పారనేది గుర్తుంచుకోవాలి. కాంగ్రెస్ స్వలాభం కోసం రాజ్యాంగ సవరణలు చేసింది. ఒకే దేశం ఒకే ఎన్నిక అనేది బీజేపీ నినాదం. జేపీసీ నివేదిక తర్వాత బిల్లుపై చర్చించి ఆమోదించడానికి కసరత్తు జరుగుతుందని' అని పురందేశ్వరి అన్నారు.

తప్పయిపోయింది

(మొదటి పేజీ తరువాయి)

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసుకు సంబంధించి విచారణ కు రావాలంటూ చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌కు నోటీసులిచ్చిన సంగతి తెలిసిందే. ఈమేరకు.. మంగళవారం ఉదయం 10.30 గంటలకు.. భార్య కుమార్తె గేటుదాకా వచ్చి సాగనంప గా.. తండ్రి అల్లు అరవింద్, మామ చంద్రశేఖర్ రెడ్డి, బన్నీ వాసుతో కలిసి జూబ్లీహిల్స్‌లోని తన ఇంటి నుంచి బయల్దేరారు. సరిగ్గా 11.05 గంటలకు అల్లు అర్జున్ పోలీస్ స్టేషన్‌కు చేరుకోగానే గేట్లు మూసేశారు. అల్లు అరవింద్‌ను, చంద్రశేఖర్ రెడ్డిని, బన్నీ వాసు ను కిందే ఆపేసిన పోలీసులు.. బన్నీని రాణా మొదటి అంతస్తులోని ఏసీపీ కార్యాలయంలోకి తీసుకెళ్లారు. అక్కడ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఏసీపీ రమేశ్, ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ బృందం.. అల్లు అర్జున్ తరఫు న్యాయవాది సమక్షంలో విచారణ ప్రారంభించారు. మధ్యాహ్నం 2:45 వరకు.. విచారణ కొనసాగింది.

ప్రశ్నల వర్షం..: విచారణలో భాగంగా అల్లు అర్జున్‌పై పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల ప్రకారం.. "ప్రీమియర్ షోకి హీరో హీరోయిన్‌లను రానివ్వొద్దంటూ పోలీసులు థియేటర్ యాజమాన్యానికి లిఖిత పూ ర్వకంగా తెలిపిన విషయం మీ దృష్టికి వచ్చిందా? రాలేదా? ఒకవేళ యాజమాన్యం ఆ విషయాన్ని మీ దృష్టికి తీసుకురావడంలో విఫలమైతే.. మీరు కుటుంబంతో పాటు ప్రీమియర్ షోకు వచ్చినప్పుడు నేరుగా థియేటర్‌లోకి వెళ్లకుండా బయ ట నుంచే ఓపెన్ టాప్ వాహనంలో నిలబడి చేతులు ఊపు తూ రోడ్‌షో ఎందుకు చేశారు? అలా చేయడానికి మీకు ఎవరు అనుమతిచ్చారు? అనుమతి లేని రోడ్‌షో చేయడం తప్పని తెలియదా? జరిగిన ఘోరం గురించి మీ దృష్టికి తెచ్చి.. వెంటనే వెళ్లిపోవాలని సూచించినా ఎందుకు వెళ్లలేదు? అదే విషయాన్ని థియేటర్ యాజమాన్యంతో చెప్పించినా, స్వయంగా ఏసీపీ వచ్చి చెప్పినా మీరు ఎందుకు పట్టించుకోలేదు? మీ వల్ల జరిగిన తొక్కిసలాటలో ఒక మహి ళ ప్రాణాలు కోల్పోవడంతోపాటు ఆమె కుమారుడు అపస్మారక స్థితిలోకి వెళ్లిన విషయం మీకు ఎప్పు డు తెలిసింది? ఎలాంటి అనుమతు లూ లేకుండా పెద్ద ఎత్తున బౌన్సర్‌లను, ప్రైవేట్ సెక్యూరిటీని థియేటర్ వద్దకు ఎలా తీసుకొస్తారు? మీతో పాటు.. మీ కోసం వచ్చి ప్రైవేట్ సెక్యూరిటీ, బౌన్సర్‌ల అత్యుత్సాహం వల్ల, థియేటర్‌లో తొక్కిసలాటకు జరుగుతుంటే మీరు ఎందుకు స్పందించలేదు?" అంటూ డీసీపీ ప్రశ్నలు సంధించారు. రేవతి చనిపోయిన విషయం తనకు ఆరోజు తెలియదని, ఇంటికి వెళ్లిన తర్వాత తన ఫోన్ బయటపెట్టి, ఉదయం వరకూ లేపవద్దని చెప్పి తాను పడుకున్నానని, బన్నీవాస్‌కు ఆ రాత్రే ఈ విషయం తెలిసిందని, మర్నాడు ఉదయం అతని ద్వారా తమకూ తెలిసిందని అర్జున్ చెప్పినట్లు తెలుస్తోంది. విచారణ సందర్భంగా పోలీసులు ఒక్కొక్క ప్రశ్నా వేస్తూ.. దానికి అల్లు అర్జున్ చెప్పిన జవాబు విని, సంబంధిత వీడియోను ఆయనకు చూపించినట్లు సమాచారం. ఉదాహరణకు.. "పోలీసు అధికారులు థియేటర్‌లో ఉన్న మీ వద్దకు రాలేదని అన్నారుగా?" అనే ప్రశ్నకు.. రాలేదని బన్నీ సమాధానమివ్వగా, 'అయితే ఇదిగో ఈ వీడి యో చూడండి' అంటూ పోలీసు ఉన్నతాధికారులు థియేటర్ లోపలికి వస్తున్న వీడియోను ఆయనకు చూపించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే.. అల్లు అర్జున్ థియేటర్‌కు రావడానికి ముందు నుంచీ బౌన్సర్లు వ్యవహరించిన తీరును, ఆయన గేట్లు మూసివేయాలని బౌన్సర్లకు చెప్పిన దృశ్యాల ను పోలీసులు చూపించినప్పుడు.. తన వల్ల తప్పు జరిగిందని ఆయన అంగీకరించినట్లు తెలుస్తోంది. థియేటర్ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా కారు టాప్ నుంచి ఆయన అభిమానులకు అభివాదం చేసిన వీడియోలు, ట్రాఫిక్ జామ్ వీడియోలనూ పోలీసులు చూపించారు. అలాగే.. ఇటీవల పెట్టిన ప్రెస్ కాన్ఫరెన్స్ గురించి ప్రశ్నించినప్పుడు.. తనని తాను డిఫెండ్ చేసుకోవడానికి, తన న్యాయవాదుల బృందం ఇచ్చిన సూచనల మేరకే మాట్లాడానని వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. మొత్తమ్మీద పోలీసులు దాదాపు 20 ప్రశ్నలు సంధించగా.. వాటిలో ఒకటి రెండు మినహా మిగతా అన్ని ప్రశ్నలకూ ఆయన బదులిచ్చారని.. న్యాయవాదుల సూచనల మేరకు మిగతా ప్రశ్నలకు సమాధానం దాటవేశారని, పోలీసులు ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు హాజరవుతానని చెప్పారని విశ్వసనీయంగా తెలిసింది. ఈ విచారణ ప్రక్రియ మొత్తాన్నీ పోలీసులు వీడియో రికార్డింగ్ చేశారు. కాగా, విచారణ మధ్యలో మూడుసార్లు బ్రేక్ ఇచ్చినట్లు తెలిసింది. బ్రేక్ సమయంలో అర్జున్ బిస్కట్స్, డ్రైఫ్రూట్స్ తీసుకున్నారు.




ఇంటి నుంచి తండ్రి అరవింద్‌తో కలిసి కేసు విచారణకు వెళ్తున్న అల్లు అర్జున్, ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన పరదాలు

సీన్ రీకన్‌స్ట్రక్షన్ వదంతులు

అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి ఠాణాలో విచారిస్తున్న సమయంలో.. ఆ రోజు జరిగిన ఘటనకు సంబంధించి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తారన్న వదంతులు వ్యాపించాయి. దీంతో మీడియా ప్రతినిధులు, బన్నీ అభిమానులు సంధ్య థియేటర్ వద్దకు చేరుకున్నారు.

సీఎంను కలిసి మాట్లాడా

- శ్రీతేజ్ కుటుంబ బాధ్యతను తీసుకోవడంపై చర్చించా : దిల్ రాజు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో గాయపడి ఆస్పత్రిలో ఉన్న శ్రీతేజ్ కుటుంబ బాధ్యతను తీసుకోవడంపై తాను సీఎంతో చర్చించానని.. ఆయన ఓకే అన్నారని, ఆయన ఆదేశాల మేరకు బాలుణ్ని పరామర్శించడానికి వచ్చానని ఎఫ్‌డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు. అలాగే.. చిత్ర పరిశ్రమను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందంటూ కొందరు మాట్లాడుతున్నారని, అందులో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. "చిత్ర పరిశ్రమకు అన్ని రకాలుగా అండగా ఉంటామని, ఎఫ్‌డీసీ ద్వారా సహాయసహకారాలు అందిస్తామని సీఎం రేవంత్ చెప్పారు. ప్రభుత్వానికి, పరిశ్రమకు మధ్య అనుసంధానకర్తగా ఉంటూ ఎలాంటి సమస్యలూ లేకుండా చూసుకునే బాధ్యతను ముఖ్యమంత్రి నాకు అప్పగించారు. రేపు లేదా ఎల్లుండి సమయం ఇస్తానన్నారు. దీనిపై పలువురు సినీ పెద్దలతో మాట్లాడాను. ఇండస్ట్రీ తరఫున అందరం వెళ్లి సీఎంగారిని కలుస్తాం" అని దిల్ రాజు వెల్లడించారు. కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. శ్రీతేజ్ కోలుకుంటున్నాడని.. అతడి ఆరోగ్యం మెరుగైనట్లు వైద్యులు చెప్పారని వెల్లడించారు. తాను వేరే కార్యక్రమంలో పాల్గొనడానికి అమెరికాకు వెళ్లానని, తిరిగి రాగానే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని చెప్పారు. రేవతి కుటుంబాన్ని సినీ పరిశ్రమ, ప్రభుత్వం కలిసి అన్ని రకాలుగా ఆదుకుంటాయని తెలిపారు. ఎఫ్‌డీసీ చైర్మన్‌గా ఆ బాధ్యతను సీఎం తనకు అప్పగించారన్నారు. 'అల్లు అర్జున్ ద్వారా కూడా వారి కుటుంబానికి అందాల్సిన సాయం అందుతుంది. అల్లు అర్జున్‌ను కూడా కలిసి ఆయన స్పందన కూడా తెలియజేస్తాను. ఇండస్ట్రీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేస్తూ ఈ సమస్యలన్నీ త్వరలోనే సమసిపోయేందుకు కృషి చేస్తాను' అని దిల్ రాజు పేర్కొన్నారు. రేవతి భర్త భాస్కర్‌కు సినీ పరిశ్రమలో ఏదో ఒక ఉద్యోగం వచ్చే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

సీఐ ఖాకీ చొక్కా వలుస్తాం!

- మాజీ మంత్రి కాకాణి చిందులు

నెల్లూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటశేషయ్యపై సీఐ సుబ్బారావు, ఆర్ఐ రవి తప్పుడు కేసు పెట్టారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి రాకూడదని వీరిద్దరూ ప్రతినిత్యం దేవుడికి దండం పెట్టుకోవాలి. మేం అధికారంలోకి వచ్చాక సీఐ ఒంటి మీద ఉన్న ఖాకీ దుస్తులు వలిచి శాశ్వతంగా ఉద్యోగం తొలగించేలా చర్యలు తీసుకుంటాం' అంటూ మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి చిందులు తొక్కారు. నేడు అధికారులు చేస్తున్న పాపాలు వారికి శాపాలుగా మారతాయని హెచ్చరించారు. ఘటనా స్థలానికి ఆర్ఐ రాకుండానే రిపోర్టు ఇచ్చారని, ఆయన రాలేదనడానికి తానే ప్రత్యక్ష సాక్షినని చెప్పారు. కాగా, ఉద్యోగం ఆశ చూపి ఓ మహిళపై పలుమార్లు లైంగికదాడి కేసులో కాకాణి ముఖ్య అనుచరుడు మందల వెంకటశేషయ్యకు న్యాయస్థానం 14 రోజులపాటు రిమాండ్ విధించింది.

ఏమి చెప్పితిరి?!

- వైసీపీకి కక్ష సాధింపు రాజకీయాలు తెలియవట!
- గుంటూరు జైలు వద్ద సజ్జల రామకృష్ణారెడ్డి ఉవాచ



అమరావతి, గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అరాచక, విధ్వంసక, కక్ష సాధింపు రాజకీయాలను ఐదేళ్లు యథేచ్ఛగా నడిపించిన వైసీపీ పెద్దలకు, అధికారం పోగానే సంక్షేమ బాటలూ, అభివృద్ధి మాటలూ గుర్తుకు వస్తున్నట్టు ఉన్నాయి! తమ పాలన ప్రగతిపథంలో సాగితే.. అధికార కూటమి ప్రభుత్వం పగలు, ప్రతీకార రాజకీయాలు నడుపుతున్నట్టు వారికి అనిపిస్తున్నట్టు ఉంది! టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి, మరియమ్మ అనే మహిళ హత్య కేసులో అరెస్టు అయిన మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను పరామర్శించడానికి గుంటూరుకు వెళ్లిన వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి జైలు వద్ద చేసిన వ్యాఖ్యలు విన్నవారికి ఇప్పుడు ఇవే అనుమానాలు కలుగుతున్నాయి. నాడు వైసీపీ పాలన సంక్షేమం, అభివృద్ధిపైనే దృష్టిసారించిందని, ఏనాడూ కక్షపూరితంగా వ్యవహరించలేదని ఆయన చెప్పుకొన్నారు. తాము ఆనాడు కక్ష సాధింపు రాజకీయాలు చేస్తే విపక్షాలు ఉండేవా అని సజ్జల ప్రశ్నించారు. పులిపంజా దెబ్బ ఎలా ఉంటుందో రుచి చూపిస్తామని, తిరిగి అధికారంలోకి వస్తే వైసీపీ కార్యకర్తలను దాడులకు దిగకుండా నిలువరించలేమని వ్యాఖ్యానించారు. "కూటమి ప్రభుత్వం కక్షపూరిత పాలన చేస్తోంది. జైలులో మా నేతలకు కనీస సదుపాయాలు కూడా అందించడం లేదు. ముఖ్యమంత్రి కుమారుడు స్వయంగా పోలీసులకు ఫోన్లు చేసి మా నేతలను వేధింపులకు గురి చేయాలని ఆదేశిస్తున్నారు" అని సజ్జల విమర్శించారు. సీఎం చంద్రబాబు వ్యవహారం చూస్తుంటే ఎలా వేధించాలనేది తమకు నేర్పిస్తున్నట్లుగా ఉందన్న ఆయన, ఇలా అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురి చేయాలని శిక్షణ ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. "ఆరు నెలల్లోనే ప్రభుత్వం మీద ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైంది. కూటమి శిబిరంలో తగువులు పడుతున్నారు. ఇంకో ఆరు నెలలు ఆగితే రోడ్డున పడతారు. ఆపై రెండేళ్లాగితే ఎన్నికలొస్తాయి. ఇదంతా దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు, కూటమి నాయకులు విజ్ఞతతో ఆలోచించాలి" అని వ్యాఖ్యానించారు. తాడేపల్లి ప్యాలెస్ వేదికగా కుట్రలు, మాఫియా దందాలు.. బయటకు వస్తే పరదాలు.. హామీలను గుర్తుచేసిన టీచర్లు, ఉద్యోగులపై లాఠీల మోతలు.. విపక్షాలపై కేసులు.. అరెస్టులు.. జైళ్లు.. ఇలా భయపెట్టి, బెదిరించే పద్ధతుల్లో సాగిన వైసీపీ పాలన తెలిసినవాళ్లంతా సజ్జల వ్యాఖ్యలపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తనను సీఐడీతో కొట్టించి .. దానిని వీడియోలో వైసీపీ పెద్దలు చూశారంటూ అప్పట్లో వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం వారు గుర్తు చేస్తున్నారు. ప్రతిపక్షనేతగా చంద్రబాబు రాష్ట్ర పర్యటనకు అనుమతి ఇవ్వకుండా ఆనాడు ఇబ్బంది పెట్టారు. సోషల్ మీడియాలో తనపై అసభ్యంగా పోస్టులు పెడుతున్నారంటూ డీజీపీకి ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన వంగలపూడి అనితను అడ్డుకున్నారు. యువగళం పాదయాత్రను లోకేశ్ చేపట్టకుండా అడుగడుగునా సమస్యలు సృష్టించారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టుచేసి.. జైలులో ఉంచగా, ఆయనను చూడటానికి ప్రయత్నించిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర సరిహద్దుల్లోనే ఆపేశారు. ఇక.. సజ్జల విషయానికి వస్తే ఆయనో రాజ్యాంగేతర శక్తిగా ఆనాడు వ్యవహరించారని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు జైలు ఎదుట సజ్జల సుద్దులు విన్న వారంతా.. "ఏం చెప్పితిరి" అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

నన్ను నమ్మండి..

పార్టీని వీడకండి!

- క్యాడర్‌ను బుజ్జగిస్తున్న వైసీపీ అధినేత
- పులివెందుల కార్పొరేటర్లతో సుదీర్ఘ భేటీ

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): "నన్ను నమ్మండి.. పార్టీని వీడి వెళ్లకండి" అని వైసీపీ క్యాడర్‌ను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్ బుజ్జగిస్తున్నారు. ఎన్నికలకు ముందు 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ఉపముఖ్యమంత్రులు, మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో బృంద గీతాలు పాడించుకున్న జగన్‌కు అధికారం పోయిన ఆరు నెలల్లోనే తత్వం తెలిసివచ్చింది. అధికారంలో ఉండగా ఉపముఖ్యమంత్రులైనా, ఎంతటి సీనియర్ మంత్రులైనా, బలమైన ప్రజానాయకులైనా జగన్ లెక్క చేయలేదు. ఎంత పెద్ద నాయకుడైనా జగన్ రమ్మని పిలిస్తేనే తాడేపల్లి ప్యాలెస్‌కు రావాలి. ఒకవేళ వచ్చినా.. జగన్ మనసు మార్చుకుంటే.. సీఎంవో అధికారులను కలసి వెనుదిరిగిపోవాల్సిందే. నోరుతెరచి ప్రశ్నించే ధైర్యం ఎవరికీ ఉండేది కాదు. 2019లో వైసీపీ తరఫున గెలిచిన 150 మంది (జగన్ మినహా) ఎమ్మెల్యేలు.. 22 మంది లోక్‌సభ సభ్యులలో మెజారిటీ నేతలు తాడేపల్లి ప్యాలెస్ ప్రహరీకి పక్కగా ఉన్న సమావేశ మందిరాన్ని దాటి ప్యాలెస్ గడప దాటి లోపలకు వెళ్లలేదు. అలాంటి అవకాశమే వారికి రాలేదు. ఇది మెజారిటీ వైసీపీ ముఖ్యనేతల అనుభవం. అయితే, అధికారాన్ని కోల్పోయిన ఆరునెలల్లోనే సీనియర్లు కాదు.. చోటా మోటా నాయకులకు కూడా తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ రెడ్‌కార్పెట్ స్వాగతం పలుకుతున్నారు. ఇక, తన సొంత నియోజకవర్గం పులివెందులలోని ఇండుపులపాయ ఎస్టేట్‌లో కార్పొరేటర్లతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ తననే నమ్మాలని, తనతోనే ఉండాలని చేతిలో చేయి వేసి బాసలు తీసుకుంటున్నారు. సమస్యలు ఉన్నాయని అంగీకరిస్తూనే.. గతంలో తప్పులు జరిగాయని చెబుతూనే.. పార్టీ మారాల్సిన అవసరం లేదని వారిని బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, వారు జగన్ మాటలను విశ్వసించేందుకు సిద్ధంగా లేరని పార్టీలో చర్చ సాగుతుండడం గమనార్హం.

క్యూకట్టి వెళ్తుండటంతో..

నెల రోజుల ముందువరకు తనదైన పంథాలోనే జగన్ నడిచారు. సీనియర్ నేతలు జనసేన,టీడీపీల్లోకి వెళ్లిపోతున్నారంటూ మీడియా ప్రశ్నించినప్పుడు కూడా.. "ఎవరమ్మా.. ఏ నాయకుడమ్మా పోతున్నారు?" అంటూ ఎగతాళి చేశారు. కానీ, ఇప్పుడు క్యూ కట్టినట్టు నాయకులు వైసీపీని వీడుతుండడంతో చిన్నస్థాయి నేతను కూడా పిలిచి బుజ్జగిస్తున్నారు.



ఇడుపులపాయ ఆడిటోరియంలో క్రిస్మస్ ప్రార్థనల్లో జగన్, విజయలక్ష్మి

కేసుల చిక్కులు

వైసీపీ అధికారంలో ఉండగా నోటికి పనిచెప్పిన నేతలందరిపైనా కూటమి సర్కారు వచ్చాక కేసులు నమోదవుతున్నాయి. విచారణల నిమ్మిత్తం పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. అరెస్టయినవారు బెయిలు కోసం.. అరెస్టు కానివారు ముందస్తు బెయిల్ కోసం న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో వైసీపీ నేతలంతా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చి జగన్‌ను కలిసేందుకు విముఖత ప్రదర్శిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. తాను ఒంటరిగా మిగిలిపోవాల్సి వస్తుందో నన్న ఆందోళన జగన్‌లో స్పష్టంగా కనిపిస్తోందని వైసీపీ ముఖ్యనేత ఒకరు వెల్లడించారు. జగన్‌లో భవిష్యత్తు భయం నెలకొందనేందుకు మంగళవారం నాటి పులివెందుల పర్యటనే ప్రత్యక్ష ఉదాహరణగా చెబుతున్నారు. సొంత నియోజకవర్గానికి జగన్ రావడంతో.. ఆయనకు పార్టీ క్యాడర్ మొత్తం స్వాగతం పలుకుతుందని వైసీపీ నేతలు భావించారు. కానీ.. దీనికి భిన్నంగా పార్టీ ముఖ్యనేతలు అంతంత మాత్రంగానే వచ్చారు. పులివెందులలో వైసీపీ కార్పొరేటర్లు కూడా పూర్తిస్థాయిలో రాలేదు. మరోవైపు భారీ సంఖ్యలో వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీల్లోకి వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. ఫలితంగా పులివెందుల కార్పొరేషన్ వైసీపీ కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఇదే జరిగితే జగన్ మరింత బలహీనమవుతారు. రాజకీయ ప్రతిష్ఠ మసకబారిపోతుంది. ఈ నేపథ్యంలోనే ఇంకా వైసీపీని, జగన్‌ను విశ్వసిస్తున్న కొద్దిమంది కార్పొరేటర్లతో జగన్ సమావేశమయ్యారు. తనను నమ్మాలంటూ కార్పొరేటర్లకు విజ్ఞప్తి చేశారు. తనను విడిచి వెళ్లిపోవద్దంటూ బతిమలాడుకున్నారు. దీనిని ప్రత్యక్షంగా చూసిన కొందరు నేతలు.. జగన్ అధికారంలో ఉండగా తమకు తాడేపల్లి వద్ద.. పులివెందులలోనూ జరిగిన అవమానాలను గుర్తు చేసుకున్నారు.

మంచి రోజులు వస్తాయి

"ప్రతిపక్షంలో ఉండడం మనకు కొత్తకాదు. ఇబ్బందులు ఉంటాయి. ఎదుర్కొని పనిచేయండి. అధైర్యం వద్దు. అండగా నేనున్నా. నేను, అమ్మతో ప్రారంభమైన పార్టీతో రాష్ట్రానికి సీఎం అయ్యాను. అప్పట్లో పార్టీ 151సీట్లు సాధించింది. మళ్లీ మనకు మంచిరోజులు వస్తాయి" అని పార్టీ శ్రేణులకు జగన్ చెప్పారు. ఏసమస్య ఉన్నా అవినాశ్‌రెడ్డి దృష్టికి తీసుకువస్తే అండగా తాముంటామని భరోసా ఇచ్చారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కార్పొరేటర్లు అవకాశవాదులని వ్యాఖ్యానించారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలో జగన్

వేంపల్లె, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఇడుపులపాయలో మాజీ సీఎం జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. బెంగళూరు నుంచి మంగళవారం ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లో ఇడుపులపాయకు చేరుకున్నారు. నేరుగా తన తండ్రి రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్దకు వచ్చి ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి సతీష్‌రెడ్డి తదితర నాయకులు, కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాంతి భవనంలోకి వెళ్లి పలువురు నాయకులతో కాసేపు చర్చించారు. నెమళ్లపార్కు సమీపంలో ఉన్న ఆడిటోరియంలో తల్లి విజయలక్ష్మి, సతీమణి భారతి, కుమార్తెలు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ముందస్తు క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వేడుకలకు షర్మిల దూరం

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఇడుపులపాయలో కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకొనే క్రిస్మస్ వేడుకలకు దూరంగా ఉన్నారు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో ఈ వేడుకలకు ఆమె రాలేదని పలువురు వ్యాఖ్యానించారు. విదేశీ పర్యటనలో ఉన్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.


తదుపరి సీఎస్ సాయి ప్రసాద్?

- ఈ నెలాఖరుతో నీరబ్ పదవీ విరమణ

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ తదుపరి ప్రధాన కార్యదర్శి(సీఎస్) నియామకంపై కసరత్తు ప్రారంభమైంది. ప్రస్తుత సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్‌కు పొడిగించిన పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగుస్తోంది. మళ్లీ పొడిగింపునకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిపాదనా రాలేదు. దీంతో ఆయన పదవీ విరమణ ఖాయమైందన్న చర్చ సాగుతోంది. అనంతరం ఆయనకు మరో పదవి ఇచ్చే యోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియామకంపై సర్కారు దృష్టి పెట్టింది. పలు పేర్లు పరిశీలనకు వచ్చినప్పటికీ సీనియారిటీ ప్రాతిపదికన సాయి ప్రసాద్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. సీనియారిటీ జాబితాలో నీరబ్ కుమార్ ప్రసాద్ తర్వాత శ్రీలక్ష్మి ఉన్నారు. అయితే, ఆమెపై అనేక అవినీతి ఆరోపణలు, కేసులు ఉండటంతో ఇప్పటికీ ఆమెకు పోస్టింగ్ ఇవ్వలేదు. ఆ తర్వాత సీనియారిటీ జాబితాలో అనంత రాము ఉన్నారు. కానీ ఆయన సామర్థ్యంపై చంద్రబాబుకు సదభిప్రాయం లేదు. ఆయన తర్వాత సీనియారిటీలో సాయి ప్రసాద్ ఉన్నారు. ఈయన గతంలో చంద్రబాబు పేషీలో కార్యదర్శిగా కీలక భూమిక నిర్వహించారు. ఆ తర్వాత జగన్ హయాంలో కూడా సీసీఎల్ఏ, రెవెన్యూ స్పెషల్ సీఎస్‌గా రెండు బాధ్యతలూ నిర్వహించారు. జగన్ ప్రభుత్వంలో కీలక పాత్ర వహించిన సాయి ప్రసాద్‌కు చంద్రబాబు కీలక పోస్టు ఇవ్వరని మొదట్లో అనుకున్నప్పటికీ అలా చూసుకుంటూ పోతే ఎవరికీ అవకాశాలు ఇవ్వలేమని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు.

ఓఎంసీ కేసులో బెజవాడ కోర్టుకు టీడీపీ నేతలు

- 18 మందికి 17 మంది హాజరు.. జనవరి 8కి కేసు వాయిదా



కోర్టు ఆవరణలో అప్పటి టీడీపీ నేతలు నాగం జనార్దన్‌రెడ్డి, అచ్చెన్న, వైవీబీ రాజేంద్రప్రసాద్, అమరనాథ్‌రెడ్డి, దేవినేని ఉమా తదితరులు

విజయవాడ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగుదేశం పార్టీ నేతలపై నమోదైన ఓబులాపురం అక్రమ మైనింగ్ పరిశీలన కేసు విచారణ మంగళవారం విజయవాడలోని ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టులో జరిగింది. విచారణ అనంతరం జనవరి 8కి న్యాయాధికారి శ్రీదేవి కేసును వాయిదా వేశారు. 2007లో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నపుడు ఓబులాపురం అక్రమ మైనింగ్‌ను పరిశీలిచేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు 21 మంది నేతలతో నిజనిర్ధారణ కమిటీ వేశారు. ఈ కమిటీలో నాగం జనార్దనరెడ్డి, దేవినేని ఉమా, అచ్చెన్నాయుడు, నిమ్మకాయల చినరాజప్ప, ఎర్రబల్లి దయాకరరావు, అమరనాథ్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, మెట్టు గోవర్ధన్ రెడ్డి, పడాల అరుణ, కోళ్ల లలితకుమారి, బొవి్మడి నారాయణరావు, ఎం పద్మజ, యలమంచిలి రాజేంద్ర ప్రసాద్, చిన్నంబాబు రమేశ్, పూల నాగరాజు, ములగాని రామకృష్ణారెడ్డి, వీరంకి గురుమూర్తి, పన్నిశెట్టి రంగనాయకులు, కొప్పుల హరీశ్వరరెడ్డి, కే రమణ ఉన్నారు. వీరిలో పన్నిశెట్టి రంగనాయకులు, కొప్పుల హరీశ్వరరెడ్డి, కే రమణ చనిపోయారు. మిగిలిన 17 మందిపై కేసు విచారణ కొనసాగుతోంది. కిందటి నెలలో జరిగిన విచారణకు కొందరు నేతలు గైర్హాజరు కావడంతో న్యాయాధికారి శ్రీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. డిసెంబరు 24న అందరూ హాజరు కావాలని ఆదేశించారు.

మంగళవారం నాటి విచారణకు గోవిందప్ప ఒక్కరు మాత్రమే హాజరు కాలేదు. టీడీపీ నేతల తరఫున న్యాయవాదులు గూడపాటి లక్ష్మీనారాయణ, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, ఎంవీ సత్యనారాయణ తమ వాదనలను వినిపించారు. అనంతరం న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, గోవిందప్ప ఒక్కరు హాజరు కాకపోవటం వల్ల కేసు జనవరి 8కి వాయిదా పడింది' అని చెప్పారు. కాగా, మంగళవారం కోర్టుకు వచ్చిన వారంతా సుమారు నాలుగు గంటలపాటు కోర్టు ప్రాంగణంలో కలిసి గడిపారు. ఆత్మీయ ఆలింగనాల మధ్య ఉమ్మడి జ్ఞాపకాలను కలబోసుకున్నారు.

కోస్తాలో ముసురు

» స్థిరంగా తీవ్ర అల్పపీడనం

» నేడు ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు సమీపాన తీవ్ర అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ నైరుతిగా పయనించి దక్షిణ కోస్తా తీరం వైపు వచ్చే క్రమంలో బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో మంగళవారం కోస్తాలోని అనేక ప్రాంతాల్లో ముసురు వాతావరణం నెలకొంది. నెల్లూరు జిల్లా కావలి, ఆత్మకూరు, అల్లూరి జిల్లా చింతపల్లి, పాడేరు, విజయనగరం జిల్లా బొబ్బిలిలో భారీ వర్షాలు, మిగతా ప్రాంతాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. కోస్తాలో చలి తీవ్రత కొనసాగుతోంది. రానున్న 24 గంటల్లో కోస్తాలోని అనేక ప్రాంతాలు, రాయలసీమలోని పలుచోట్ల వర్షాలు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

సముద్రంలో చిక్కుకున్న నలుగురు మత్స్యకారులు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన నలుగురు మత్స్యకారులు సముద్రంలో చిక్కుకుపోయారు. కాకినాడ పర్లోవపేట నుంచి నలుగురు మత్స్యకారులు ఈ నెల 23వ తేదీన భైరవపాలెం మీదుగా చేపల వేటకు వెళ్లారు. భైరవపాలెం నుంచి 26 నాటికల్ మైళ్ల దూరంలో వారంతా సముద్రంలో చిక్కుకున్నారు. మత్స్యశాఖ అధికారులు వారిని రక్షించాలని ఇండియన్ కోస్ట్‌గార్డ్ అధికారులను కోరారు.



శ్రీవాణి టికెట్ల కోసం క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు

'శ్రీవాణి' టికెట్ల కోసం గంటల కొద్దీ నిరీక్షణ

ఇక్కడ క్యూలైన్లలో వేచి ఉన్న వారు సర్వ దర్శన భక్తులనుకుంటే పొరపాటే. రూ.10,500 చెల్లించి శ్రీవాణి టికెట్లు పొందిందుకు వీరంతా ఇలా క్యూలైన్లలో నిరీక్షిస్తున్నారు. తిరుమలలో కరెంట్ బుకింగ్ కౌంటర్లలో ఉదయం 8 గంటలకు టికెట్ల జారీ ప్రక్రియ మొదలవుతుంది. టికెట్ల కోసం భక్తులు వేకువజాము 4 గంటల నుంచే క్యూలైన్లోకి వస్తున్నారు. మంగళవారం కూడా కౌంటర్ నుంచి ఏటీసీ సర్కిల్ వరకు క్యూలైన్‌లో భక్తులు బారులుతీరి కనిపించారు. కనీసం కూర్చునేందుకు వసతులు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

– తిరుమల, ఆంధ్రజ్యోతి

30 నిమిషాల్లో 'వైకుంఠ' కోటా పూర్తి

తిరుమల శ్రీవారి వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా 30 నిమిషాల్లో పూర్తయింది. జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలు జరగనున్నాయి.

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల ఆలయం ముందు జస్టిస్ గుణరంజన్

తిరుమల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిట్టల్ దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గుణరంజన్, సిక్కిం హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి విజయ్‌కుమార్, భారత్ బయోటెక్ జేఎండీ, బోర్డు సభ్యురాలు సుచిత్ర ఎల్లా కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

రామాయపట్నంలో.. భారీ రిఫైనరీ

(మొదటి పేజీ తరువాయి)

తెలియపరచింది. స్టాక్ మార్కెట్‌లో బీపీసీఎల్ తరఫున లిస్టింగ్ కోసం ఈ మేరకు లేఖ రాసింది. ప్రీ-ప్రాజెక్టు కార్యకలాపాలకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించింది. ఈ కార్యకలాపాల్లో ప్రారంభ అధ్యయనాలు, అవసరమైన భూముల గుర్తింపు, భూసేకరణ, సమగ్ర సాధ్యాసాధ్యాల నివేదిక, పర్యావరణ మదింపు ప్రభావం, మౌలిక డిజైన్ ఇంజనీరింగ్ ప్యాకేజీ, ఫ్రంట్-ఎండ్ ఇంజనీరింగ్ డిజైన్ వంటివి ఉన్నట్లు తెలిపింది. కాగా.. బీపీసీఎల్ లేఖలో తూర్పు తీరం అని పేర్కొన్న నేపథ్యంలో ఎక్కడ ఏర్పాటు చేస్తారన్న దానిపై తొలుత ఆసక్తి నెలకొంది. ముందుగా అనుకున్నట్లుగా కృష్ణా జిల్లా మచిలీపట్నంలో మాత్రం ఏర్పాటు చేయడం లేదు. రామాయపట్నాన్ని ఎంచుకుంది. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆయిల్ రిఫైనరీని కృష్ణా జిల్లాకు తీసుకొచ్చేందుకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. బీపీసీఎల్ ప్రతినిధులతో పలు మార్లు భేటీ అయ్యారు కూడా. అటు సీఎం సైతం ప్రత్యేక చొరవ తీసుకుని బీపీసీఎల్ ఉన్నతాధికారులను కలిసి.. ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు చేయాలని.. దానికి మచిలీపట్నం అనువైన ప్రాంతమని, అవసరమైన భూములను కేటాయిస్తానని కూడా హామీ ఇచ్చారు. వారి నుంచి సానుకూల స్పందన వచ్చింది. అయితే ఆ తర్వాత రామాయపట్నంలో ఏర్పాటు చేయడం మేలన్న నిర్ణయానికి వచ్చింది. రాష్ట్రప్రభుత్వానికి ఇటీవ లే ఈ సమాచారం అందించింది. మచిలీపట్నం కాదని రామాయపట్నంలో ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపినా.. ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి రావడం ముఖ్యమన్న ఉద్దేశంతో బీపీసీఎల్ ప్రతిపాదనకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో ఆయిల్ రిఫైనరీ కమ్ పెట్రో-కెమికల్ కాంప్లెక్స్ ప్రాజెక్టు రాష్ట్రానికి దక్కింది.

పెట్టుబడులకు బారులు..

చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక.. రాష్ట్రానికి భారీ పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి, ఆర్థిక కార్యకలాపాలకు ఊతమివ్వడానికి ఎంతో కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే రిలయన్స్, టాటా వంటి ప్రముఖ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముఖ్యమంత్రిని కలిసి వెళ్లాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసు (టీసీఎస్), లులు గ్రూపు విశాఖకు వస్తున్నాయి. ఈ క్రమంలోనే రూ.6,100 కోట్ల విలువ చేసే బీపీసీఎల్ ఆయిల్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ప్రాజెక్టు సాకారం కాబోతోంది.

రిఫైనరీలో ఏం చేస్తారు?

బీపీసీఎల్‌కు ప్రస్తుతం ముంబై, బీనా (మధ్యప్రదేశ్), కోచి (కేరళ)ల్లో రిఫైనరీలు ఉన్నాయి. రామాయపట్నంలో ఏర్పాటు చేసేది నాలుగోది. ఈ రిఫైనరీల్లో ముడిచమురు ప్రాసెసింగ్ ద్వారా గ్యాసోలిన్, డీజిల్, పెట్రోల్, జెట్ ఫ్యూయల్, లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ) వంటి పెట్రోలియం ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తారు. బీపీసీఎల్ ప్రధానంగా పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బయిన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్), ఇంజన్ ఆయిల్స్, గేర్ ఆయిల్స్ గ్రీజు వంటి లూబ్రికెంట్లు, నాఫ్తా, ప్రొపేన్, బ్యూటేన్ వంటి పెట్రోకెమికల్ ఫీడ్‌స్టాక్‌లను కూడా ఉత్పత్తి చేస్తోంది. పెట్రో కెమికల్ కాంప్లెక్స్ విషయానికి వస్తే.. ఇథలీన్, ప్రొపలీన్, బ్యూటడైన్, బెంజీన్ వంటి పెట్రోకెమికల్స్‌ను, పాలిథిలీన్, పాలీప్రొపిలీన్, పాలీవినైల్ క్లోరైడ్ (పీవీసీ) వంటి పాలిమర్ ఉత్పత్తులను తయారుచేస్తోంది. యూరియా, అమ్మోనియం నైట్రేట్ వంటి ఎరువులను, సాల్వెంట్స్, సర్ఫాక్టంట్స్ , అడిటివ్స్ వంటి కెమికల్స్‌ను కూడా కూడా పెట్రో కాంప్లెక్స్ ద్వారా ఉత్పత్తి చేస్తున్నారు. రిఫైనరీ, పెట్రో-కెమికల్ కాంప్లెక్స్.. రెండింటి ద్వారా విద్యుదుత్పత్తి కూడా చేపడతారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానాలను చేపట్టడంతో పాటు పరిశోధనలను కూడా నిర్వహిస్తారు. దేశంలో ఇంధన భద్రత పెరుగుతుంది. ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది. ఉపాధి అవకాశాలు కూడా విస్తృతమవుతాయి.



ఎక్సైజ్ దాడుల్లో భారీగా స్వాధీనం చేసుకున్న సారా, బెల్లం ఊట, తయారీ సామగ్రి

సారాపై ఉక్కుపాదం

» ఏపీ, తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో సంయుక్త దాడులు

» ఎటపాక మండలంలో భారీగా బెల్లం ఊట, సారా ధ్వంసం

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు మంగళవారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా సరిహద్దులోని ఎటపాక మండలంలో రెండు గ్రామాల్లో సారా స్థావరాలపై ఆకస్మిక దాడి చేశారు. మొదట గుండువారిగూడెం గ్రామంలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 18,500 లీటర్ల బెల్లం ఊట, 200 లీటర్లను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే 100 డ్రమ్‌లు, ఇతర ఉపకరణాలనూ ధ్వంసం చేశారు. ఆ తర్వాత పిమ్మకులపాడు అనే గ్రామానికి వెళ్లగా, దాడుల సమాచారం ముందే తెలుసుకుని సారా దొరక్కుండా ఇతర ప్రాంతాలకు తరలించారు. అధికారులు రెండు గ్రామాల్లోనూ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎక్సైజ్ ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ గణేష్, విజయవాడ ఎస్‌టీఎఫ్ ఈఎస్ సింగంశెట్టి మధు, రంపచోడవరం ఏఈఎస్ నాగరాహుల్, కొత్తగూడెం ఏఈఎస్ కరమ్‌చంద్, ఎటపాట మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్రంలో సారాను పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ అన్నారు. సంయుక్త దాడులపై ఆయన స్పందిస్తూ... రెండు రాష్ట్రాల అధికారుల సమన్వయంతో ఈ దాడులు సాధ్యమైందన్నారు. సారాపై ఆధారపడి జీవిస్తున్న వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పిస్తామన్నారు.

డయాఫ్రం వాల్ నిర్మాణానికి అంతా రెడీ!

» జర్మనీ నుంచి యంత్రసామగ్రిని పోలవరం క్షేత్రానికి రప్పిస్తున్న బావర్

» అన్నీ సవ్యంగా జరిగితే 2న పనులకు శ్రీకారం

» 11న పోలవరానికి పార్లమెంటరీ కమిటీ

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మెయిన్ డ్యాం పనుల నిర్మాణానికి సర్వం సన్నద్ధమవుతోంది. వచ్చే నెల రెండో తేదీన నూతన డయాఫ్రం వాల్ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. రాష్ట్ర జలవనరుల శాఖ ఈ సమాచారాన్ని ఇప్పటికే కేంద్ర జలశక్తి శాఖకు, కేంద్ర జల సంఘానికి, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి తెలియజేసింది. వాల్ నిర్మాణ బాధ్యత జర్మన్ సంస్థ బావర్ చేపడుతోంది. దానికి కేంద్రం పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సర్ తదితర అంశాల్లో బావర్ కోరినంత మేరకే సహకరించాలని ప్రధాన కాంట్రాక్టు సంస్థ మేఘా ఇంజనీరింగ్‌కు జల సంఘం స్పష్టం చేసింది. బావర్ యంత్రసామగ్రిని జర్మనీ నుంచి ప్రాజెక్టు క్షేత్రానికి తరలిస్తోంది. వాల్ నిర్మాణంలో అత్యంత కీలకమైన ట్రెంచ్ కట్టర్లను ఇప్పటికే అందుబాటులో ఉంచింది. మంగళవారానికే క్రేన్లు కూడా సిద్ధమయ్యాయి. 28వ తేదీ నాటికి డీ-శాండింగ్ ప్లాంట్, పంపులు, కాంక్రీట్ సామగ్రిని కూడా సమకూర్చుకోనుంది. 30వ తేదీకల్లా లేబొరేటరీని కూడా సంసిద్ధం చేయనుంది. అంతకుముందు రోజే సమగ్ర కార్యాచరణ సమాచారాన్ని జలశక్తి శాఖ, జల సంఘం, పీపీఏలకు జల వనరుల శాఖ అందిస్తుంది. ఈ నివేదికను సంబంధిత కేంద్ర సంస్థలు పరిశీలించి.. 30న డయాఫ్రం వాల్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తాయని ఆశిస్తోంది. అన్నీ అనుకున్నట్లు సవ్యంగా జరిగితే జనవరి 2న వాల్ నిర్మాణ పనులను బావర్ ప్రారంభిస్తుంది. నిర్మాణం 600 మీటర్లకు చేరువ కాగానే.. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం పనులను మేఘా మొదలుపెడుతుంది.

పార్లమెంటరీ కమిటీ పరిశీలన..

డయాఫ్రం వాల్ పనులు జరుగుతున్న సమయంలోనే వచ్చే నెల 11న కేంద్ర జలశక్తి శాఖపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీసంఘం ప్రాజెక్టు క్షేత్రానికి రానుంది. ఈ కమిటీలో 25 మంది పార్లమెంటు సభ్యులు, లోక్‌సభ సెక్రటేరియేట్ అధికారులు ఉంటారు. 2021 నుంచి ఈ ప్రాజెక్టు కోసం చేసిన వ్యయాలను, ప్రస్తుతం జరుగుతున్న పనులను కమిటీ పరిశీలిస్తుంది. 2019 నాటికి ప్రాజెక్టు స్థితిగతులు.. జగన్ ప్రభుత్వంలో చోటు చేసుకున్న పరిణామాలు.. భూసేకరణ, సహాయ పునరావాసం కోసం చేసిన ఖర్చు, హెడ్‌వర్క్స్ తదితరాలపై 11, 12 తేదీల్లో సమగ్రంగా అధ్యయనం చేస్తుంది.

పటిష్ఠంగా సీసీటీఎన్ఎస్ అమలు

» పరికరాల కొనుగోలులో నిబంధనలు పాటించాలి

» పోలీస్ శాఖకు సీఎస్ ఆదేశం

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్)ను పటిష్ఠంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో సీసీటీఎన్ఎస్, ఇంటర్-ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్(ఐసీజేఎస్)లకు సంబంధించిన రాష్ట్రస్థాయి అపెక్స్ కమిటీ సమావేశాలు సీఎస్ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలకు లోబడి అవసరమైన సాఫ్ట్‌వేర్, ఇతర భద్రతాపరమైన పరికరాలను కొనుగోలు చేయాలని పోలీస్‌శాఖకు సూచించారు. జనవరి 31న జరిగే సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సీసీటీఎన్ఎస్ పటిష్ఠ అమలు, దానికి కేంద్రం నుంచి కావాల్సిన మరింత తోడ్పాటు తదితర అంశాలపై రాష్ట్రం తరఫున ప్రస్తావించాలని సీఎస్ చెప్పారు. ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించిన రాష్ట్ర కార్యాచరణ ప్రణాళికను కేంద్రానికి పంపాలన్నారు.

కేంద్రం నుంచి రూ. 88 కోట్లు మంజూరు

సీసీటీఎన్ఎస్ నోడల్ అధికారి, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్ ప్రాజెక్టుల అమలు గురించి వివరించారు. ఈ రెండు ప్రాజెక్టుల అమలుకు రాష్ట్రం నుంచి రూ. 238 కోట్ల అంచనాలతో రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను కేంద్ర హోంశాఖకు సమర్పించగా రూ.88 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకు సకాలంలో న్యాయం చేయాలి

» అవసరమైన చర్యలు తీసుకోండి.. అధికారులకు సీఎస్ ఆదేశం

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అగ్రి గోల్డ్ బాధితులకు సకాలంలో తగిన న్యాయం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో అగ్రి గోల్డ్ ఆస్తులపై అధికారులతో సీఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. అగ్రి గోల్డ్ బాధితులు పోగొట్టుకున్న ఆస్తులను వారికి తిరిగి చేర్చే విధంగా కేసుల సత్వరం పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ సీఐడీ, తదితర విభాగాల అధికారులను సీఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో సీఐడీ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అగ్రి గోల్డ్ మోసానికి సంబంధించి మొత్తం 23 జీవోలను విడుదల అయ్యాయని తెలిపారు. ఈ కేసు 9 రాష్ట్రాలతో ముడిపడి ఉందని, 19,18,865 మంది డిపాజిట్‌దారుల నుంచి మొత్తం రూ. 6,380 కోట్ల వరకు వసూలు చేశారని వివరించారు. ఈ కేసును వేగవంతంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఇద్దరు అటవీశాఖ అధికారుల బదిలీ

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బదిలీలపై నిషేధం సడలింపులో భాగంగా అటవీశాఖ రాష్ట్ర క్యాడర్‌లోని ఇద్దరు అధికారులను బదిలీ చేశారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్‌వో వినోద్‌కుమార్‌ను ప్రకాశం జిల్లా అటవీ అధికారిగా బదిలీ చేశారు. అటవీశాఖ రాష్ట్ర కార్యాలయ ప్రొడక్షన్ విభాగంలో ఉన్న డిప్యూటీ కన్జర్వేటర్ మంగమ్మను విశాఖలోని జూపార్క్ క్యూరేటర్‌గా బదిలీ చేశారు.



అంతర్జాతీయ ఒలింపియాడ్స్‌లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ(2024) ఒలింపియాడ్స్‌లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు సింధూర నారాయణ, శరణి నారాయణలు తెలిపారు. రొమేనియాలోని బుకారెస్ట్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక ఇంటర్నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్‌లో తమ సంస్థ విద్యార్థులు శ్వేతాంక్ అగర్వాల్, భవ్య గున్వాల్‌లు అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలను కైవసం చేసుకున్నారని వారు వెల్లడించారు. దాంతో పాటు ప్రపంచ చాంపియన్ టైటిల్‌ను ఖాయం చేసుకున్నట్టు చెప్పారు. ప్రతి సంవత్సరం 50 వేల మంది తెలివైన యువకులు భారత ప్రతినిధి బృందంలో స్థానం కోసం పోటీ పడుతుండగా, వారిలో కేవలం ఆరుగురు మాత్రమే భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని పొందారన్నారు. ఆ ఆరుగురిలో ఇద్దరు నారాయణ విద్యార్థులు బంగారు పతకాలను గెలుచుకోవడం విశేషమని పేర్కొన్నారు.

480 కోట్లతో పుంగనూరు బ్రాంచ్ కెనాల్ విస్తరణ


అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): హంద్రీ నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) రెండో దశలో రూ.480 కోట్లతో విస్తరణ పనులు చేపట్టడానికి జల వనరుల శాఖ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా పుంగనూరు బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులు చేపడతారు. దీని వల్ల 145 క్యూసెక్కుల నుంచి 282 క్యూసెక్కులు విడుదల చేసే అవకాశం ఉంటుంది. ఈ మేరకు మంగళవారం జల వనరుల శాఖ ఉత్తర్వు జారీ చేసింది. పుంగనూరు బ్రాంచి కెనాల్ విస్తరించాలని రాయలసీమ రైతులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు హామీ ఇచ్చారు. మంగళవారం జారీ చేసిన ఉత్తర్వులతో ఆ హామీ నెరవేర్చే దిశగా జల వనరుల శాఖ అడుగులు వేసింది.

ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయం

» స్విమ్స్ ఆస్పత్రికి జాతీయహోదాకు ప్రయత్నం

» టీటీడీలో ఆహార భద్రతా విభాగం ఏర్పాటు

» పాలకమండలి తీర్మానాలు వెల్లడించిన టీటీడీ చైర్మన్, ఈవో



టీటీడీ పాలకమండలి తీర్మానాలు వివరిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, పక్కన అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీటీడీ కార్యక్రమాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని, అందులో భాగంగా టీటీడీ ఆలయాలు, ఆస్తుల గ్లోబల్ విస్తరణకు అవసరమైన సూచనల కోసం నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు తెలిపారు. ఈమేరకు మంగళవారం టీటీడీ ధర్మకర్తలమండలి తీర్మానం చేసిందన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశ వివరాలను వారు మీడియాకు వెల్లడించారు. ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించేందుకు తీర్మానం చేసినట్టు తెలిపారు. తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో రోగులకు మరిన్ని మెరుగైన సేవలందించేందుకు జాతీయ హోదా ఇవ్వాలని కేంద్రాన్ని కోరాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఇందువల్ల కేంద్రం నుంచి అదనపు నిధులు కూడా వచ్చే అవకాశముందన్నారు. ఇక ఏఐ ద్వారా గంటలోపు దర్శనంపై అధ్యయనం చేస్తున్నామన్నారు. తిరుమలలోని హోటళ్ల ద్వారా నాణ్యమైన ఆహార పదార్థాలు అందించేందుకు దేశంలోని ప్రముఖ సంస్థలకు క్యాంటీన్ల నిర్వహణ లైసెన్సుల జారీలో నూతన విధానం అమలుకు ఆమోదం తెలిపామన్నారు. అక్రమణల అంశంలో తిరుమలలో ఓ మఠానికి ఇప్పటికే షోకాజ్ నోటీసులు ఇచ్చామని, వారి బదులుతో పాటు కోర్టు ఆదేశాలు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. చెన్నైలో లడ్డూల అక్రమ తరలింపుపై దర్యాప్తు చేస్తామన్నారు.

మరికొన్ని టీటీడీ నిర్ణయాలు..

» నడక మార్గంలో గుండెపోటు మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో తిరుమల అశ్విని ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది నియామకాలకు, అత్యాధునిక వైద్య పరికరాల ఏర్పాటుకు ఆమోదం

» ఏపీ డిజిటల్ కార్పొరేషన్ సహకారంతో భక్తులకు మెరుగైన సౌకర్యాల కోసం ఫీడ్ బ్యాక్ మేనేజ్మెంట్ సిస్టం ఏర్పాటు

» ఆహారపదార్థాల తనిఖీ కోసం టీటీడీలో ప్రత్యేకంగా ఫుడ్‌సేఫ్టీ విభాగం ఏర్పాటు

» అన్నప్రసాద కేంద్రంలో నాణ్యమైన అన్నప్రసాదాలు అందించేందుకు కార్పొరేషన్ ద్వారా వివిధ విభాగాల్లో 258 మంది సిబ్బందిని తీసుకునేందుకు నిర్ణయం

అన్నమయ్య విగ్రహానికి శాంతాక్లాజ్ టోపీ

» కేసు నమోదు చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అన్నమయ్య సర్కిల్‌లో అన్నమయ్య విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం 'శాంతాక్లాజ్ టోపీ' పెట్టారు. దీనిపై భజరంగ్ దళ్ సభ్యులు మంగళవారం ఉదయం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అన్నమయ్య సర్కిల్ వద్దనున్న సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. భిక్షగాడిలా కనిపిస్తున్న ఓ వ్యక్తి ఈ టోపీ విగ్రహానికి పెట్టినట్టు గుర్తించారు. నిందితుడిని త్వరలో అదుపులోకి తీసుకుంటామని ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బతుకు చిత్రాల స్రష్ట

'భారతీయ వెండితెరపై గ్రామీణ భారతదేశానికి సరైన ప్రాతినిధ్యం లభించలేదని నేను ఎప్పుడూ భావిస్తుంటాను' అని శ్యామ్ బెనగల్ ఒకసారి అన్నారు. సమాంతర చిత్రాలుగా సుప్రసిద్ధమైన కళాత్మక చిత్రాల సృష్టిని 1970, 80లలో సమున్నత స్థాయికి తీసుకువెళ్లిన ఆ అద్వితీయ సృజనశీలి అభిప్రాయం ఆయన తొలిచిత్రాల నవ్య పథాన్ని చెప్పకనే చెప్తుతుంది. అంకుర్ (1974), నిషాంత్ (1975) మంథన్ (1976)తో భారతీయ సినీ ప్రేక్షకులకు అవి ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేశాయి. భారతీయ సమాంతర సినిమాల చరిత్రలో అంకుర్ ఒక మైలురాయి. గ్రామాలలో కుల, జెండర్ అసమానతలను చూపిన చిత్రమది. భూస్వామ్య అణచివేతలపై తిరుగుబాటు అనివార్యమనే సత్యాన్ని నిషాంత్ స్పష్టం చేసింది. గుజరాత్‌లో వెల్లువెత్తిన శ్వేత విప్లవానికి కళాత్మక నివాళి మంథన్. ఐదు లక్షల మంది రైతులు తలా రెండు రూపాయలతో ఈ చిత్ర నిర్మాణానికి అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చారు. ఈ మూడు సినిమాలు స్వాతంత్ర్య తొలి దశాబ్దాలలో గ్రామీణ భారతంలోని పరిస్థితులకు అద్దం పట్టాయి. బెనగల్ సినిమాలు ఆనాటి పల్లెల్లో భూస్వామ్య అభిజాత్యాలు, అణగారిన బతుకులకు నిలువెత్తు దర్పణాలు. ఈ సినిమాలు, ఆ మాటకు వస్తే బెనగల్ చిత్రాలు ఏవైనా సరే చూసిన తరువాత భారత్ ఒకప్పుడు ఎలా ఉన్నది, ఇప్పుడు ఎలా ఉన్నది, ఎలా ఉండాలనే విషయమై మీ ఆలోచనల్లో మార్పు చోటుచేసుకోవచ్చు.

శ్యామ్ బెనగల్ తన సినిమాలలో మొదటి నుంచీ మహిళా పాత్రలను ప్రధానస్రవంతి సినిమాలకు విభిన్నంగా, నవ్య రీతులలో చూపించేందుకు నిబద్ధమయ్యారు. మహిళల స్వతస్సిద్ధ ఔన్నత్యాన్ని, పరిస్థితులకు తల వంచని చైతన్యాన్ని ఆ స్త్రీ పాత్రలు మూర్తీభవించి ఉంటాయి. 'బెనగల్ స్త్రీ వాది అయివుంటారని' ప్రగతిశీల విదుషీమణులు అభిప్రాయపడ్డారంటే ఆయన సినిమాలలోని స్త్రీ పాత్రలు ఎంత విలక్షణమైనవో అర్థం చేసుకోవచ్చు. కులం, వర్గం, మతం, జెండర్ అసమానతలు, అణచివేతలకు బలవుతున్న అభాగ్య జీవితాలను చిత్రించినప్పటికీ ప్రధానస్రవంతి సమాజంపై ఆయన ఆగ్రహావేశాలు వ్యక్తం చేయలేదు. ఆయన సినిమాలు ప్రశ్నలు లేవనెత్తుతాయికాని ఏ పక్షమూ వహించవు. 1974–2023 మధ్య 24 కళాత్మక సినిమాలతో పాటు ఎన్నో టెలివిజన్ సీరియల్స్, బయోపిక్‌లు, డాక్యుమెంటరీలు శ్యామ్ బెనగల్ నిర్మించారు. 'సినిమా స్రష్ట కావడం ఒక రచయిత లేదా చిత్రకారుడుగా ఉండడం లాంటిదే. సినిమా నిర్మాణ వ్యాసంగం మీకు స్పష్టతనే కాదు, ప్రపంచ దృక్పథాన్ని కూడా ఇస్తుంది. అది ఎంత స్థానికమో అంత విశ్వజనీనమైనది. మరే వృత్తి మీకు ఇలాంటి దృక్పథాన్ని భావ వైచిత్రిని ఇవ్వగలుగుతుంది? మీరు సినిమా సృజనలో ఉండడమంటే ఒక ప్రయోగశాలలో సూక్ష్మదర్శినితో పాటు దూరదర్శిని ద్వారా జగత్తును వీక్షిస్తున్న వైజ్ఞానికునిలా ఉండడమే' అని బెనగల్ అంటారు. భారతదేశ ఉత్కృష్ట నటీనటులు పలువురు బెనగల్ సినిమాలలో నటించడమో లేదా వాటి ద్వారా పరిచయమవ్వడమో జరిగింది. స్మితా పాటిల్, షబనా అజ్మీ, నసీరుద్దీన్ షా, ఓంపురి, అమ్రిష్‌పురి, అనంతనాగ్, నీనా గుప్త, మోహన్ అగాసె తదితరులు వారిలో కొందరు మాత్రమే. తెలుగు నటి వాణిశ్రీ ఆయన దర్శకత్వం వహించిన ఏకైక తెలుగు సినిమా 'అనుగ్రహం'లో నాయికగా జీవించారు.

శ్యామ్ బెనగల్ పూర్వీకులు కొంకణ్ ప్రాంతానికి చెందినవారు. ఆయన హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగారు, విద్యాభ్యాసమంతా ఈ నగరంలోనే జరిగింది. తెలంగాణతో ఆయనకు అనుబంధం ఉన్నది. తన సినిమాలలో దక్కనీ కవిత్వాన్ని ఆయన ఉపయోగించుకున్నారు. తొలి సినిమాలో సంభాషణలు దక్కనీ ఉర్దూలో ఉంటాయి. అంకుర్, నిషాంత్, మరికొన్ని సినిమాలను తెలంగాణ గడ్డపైనే ఆయన చిత్రీకరించారు. ఇక్కడి గంగా–యమున తెహజీబ్ సంస్కృతికి ఆయన వారసుడు. నెహ్రూ 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'ను భారత్ ఏక్ ఖోజ్ పేరిట 53 భాగాల టెలివిజన్ సిరీస్‌ను బెనగల్ నిర్మించారు. శ్యామ్ బెనగల్ కళా స్రష్టగానే కాదు, భారత పౌరుడుగా కూడా తన బాధ్యతలను భారత రాజ్యాంగ నైతికతా నిష్ఠతో నిర్వహించిన ఉదాత్తుడు. భారత రాజ్యాంగ నిర్మాణ ఇతిహాసంపై 'సంవిధాన్' పేరిట ఆయన ఒక టీవీ డాక్యుమెంటరీని నిర్మించారు. ఆ ఆధునిక భారతీయ ధర్మ గ్రంథం అమృతోత్సవం జరుపుకుంటున్న ప్రస్తుత సందర్భంలో బెనగల్ 'సంవిధాన్'ను పాఠశాల బాలలు, కళాశాల యువతకు ప్రత్యేకంగా ప్రదర్శించడమూ ఆయనకు సముచిత నివాళి అవుతుంది.



అటల్‌జీ శత జయంతి వేళ ఆయన ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చేందుకు మనల్ని మనం పునరంకితం చేసుకోవాలి. ఆయన అనుసరించిన సుపరిపాలన, ఐక్యత, ప్రగతి అనే నియమాలను ప్రతిబింబించే భారత్‌ను నిర్మించడానికి మనం కృషి చేద్దాం. మన దేశ సామర్థ్యంపై అటల్‌జీకి ఉన్న అచంచలమైన విశ్వాసం ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, కష్టపడి పనిచేసేలా మనల్ని ప్రేరేపిస్తుంది.


ఆయన రాజనీతిజ్ఞత జాతికి ప్రగతి బాట

ఈ రోజు, డిసెంబర్ 25–మనందరికీ ప్రత్యేకమైన రోజు. దేశ ప్రజలు ప్రియతమ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయీ జీ శతజయంతిని జరుపుకొంటున్న వేళ ఇది. ఆయన ఎంతో మందికి ప్రేరణను ఇస్తూ ఒక రాజనీతికోవిదుడుగా సమున్నత స్థానంలో నిలిచారు.

దేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపిన మహనీయునిగా అటల్ జీకి మన దేశ ప్రజలు ఎన్నటికీ రుణపడి ఉంటారు. ఆయన 1998లో ప్రధానిగా పదవీప్రమాణం స్వీకరించిన తరుణంలో.. మన దేశం రాజకీయ అస్థిరత్వంతో కొట్టుమిట్టాడుతోంది. దాదాపు తొమ్మిదేళ్లలో నాలుగుసార్లు లోక్‌సభకు ఎన్నికలు జరగడాన్ని మనం చూశాం. దేశ ప్రజానీకం సహనాన్ని కోల్పోతూ, ఈ ప్రభుత్వాలు వాటి బాధ్యతను సమర్థంగా నిర్వర్తించగలుగుతాయా? అనే అనుమానంలో పడిపోయారు. ఈ స్థితిని అటల్ జీ మార్చివేసి స్థిరమైన, ప్రభావవంతమైన పాలనను అందించారు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన అటల్‌జీ సామాన్య పౌరుల కష్టాలు అర్థం చేసుకున్నారు. ప్రభుత్వానికి దక్షత ఉంటే ఎంతటి పరివర్తనను తీసుకురావచ్చో ఆయన చేతల్లో చూపించారు.

అటల్ జీ నాయకత్వం ఎన్నో రంగాల్లో చాలాకాలం పాటు గణనీయ ప్రభావాన్ని చూపించింది. ఆయన పదవీ కాలంలో సమాచార సాంకేతిక విజ్ఞానం (ఐటీ), టెలికం, కమ్యూనికేషన్స్ రంగాల్లో గొప్ప పురోగతి చోటుచేసుకొంది. యువశక్తి అత్యంత చైతన్యవంతంగా ఉన్న భారత్ వంటి ఒక దేశానికి ఇది చాలా ముఖ్యం. అటల్ జీ నాయకత్వంలో ఏర్పాటైన ఎన్‌డీఏ ప్రభుత్వం టెక్నాలజీని సామాన్య పౌరులకు అందుబాటులోకి తేవడానికి చాలా శ్రద్ధ తీసుకుంది. అదే సమయంలో భారత్‌లో సంధాన సదుపాయాల కల్పన విషయంలోనూ ముందుచూపు కనిపించింది. స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్టును ఈనాటికీ చాలా మంది గుర్తు పెట్టుకుంటున్నారు. సామాజిక రంగం విషయానికి వస్తే, సర్వ శిక్షా అభియాన్ వంటి కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రజలకు, ముఖ్యంగా పేదలకూ, సమాజంలో ఆదరణకు నోచుకోకుండా ఉండిపోయిన వర్గాలవారికీ ఆధునిక విద్యను అందుబాటులోకి తేగలిగే ఒక భారత దేశాన్ని ఆవిష్కరించాలని అటల్ జీ కన్న కలను గురించి ప్రధానంగా చెబుతుంది. అలాగే, ఆశ్రిత పక్షపాతం, దశాబ్దాల పాటు ఎదుగూబొదుగూ లేని ఆర్థిక ఆలోచనా విధానాలతో సాగిన దేశంలో.. ఆర్థిక పురోగతికి బాటవేసి, అనేక ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టేందుకు ఆయన ఆధ్వర్యంలోని ప్రభుత్వం చొరవ తీసుకుంది.

వాజపేయీ అద్భుత నాయకత్వానికో చక్కటి ఉదాహరణ 1998 వేసవిలో జరిగిన ఒక సంఘటనే అందుకు తార్కాణం. ఆయన ప్రభుత్వం మే 11న పదవీ బాధ్యతలు చేపట్టింది. వెనువెంటనే పోఖ్రాన్‌లో అణు పరీక్షలను నిర్వహించింది, 'ఆపరేషన్ శక్తి' పేరిట ఈ పరీక్షలు ప్రసిద్ధమయ్యాయి. ఈ పరీక్షలు భారత్ శాస్త్రవేత్తల శక్తిని నిరూపించాయి. భారత్ ఈ రకమైన పరీక్షలను నిర్వహించడమా? అని ప్రపంచం విస్తుపోయింది. ప్రపంచ దేశాలు వాటి ఆగ్రహాన్ని చాలా స్పష్టంగా వ్యక్తం చేశాయి. ఆ సమయంలో ఏ సామాన్య నేత అయినా ఒత్తిడికి తలొగ్గేవారు. కానీ, అటల్ జీ భిన్నమైన వ్యక్తి. అప్పుడు జరిగిందేమిటి? భారత్ దృఢంగా నిలబడటమే కాక, మరో రెండు రోజుల తరువాత అంటే మే 13న రెండో దఫా పరీక్షలు నిర్వహించింది. 11వ తేదీ నాటి పరీక్షలు విజ్ఞానశాస్త్ర నైపుణ్యాన్ని చాటితే, 13వ తేదీన నిర్వహించిన పరీక్షలు సిసలైన నాయకత్వం అంటే ఏమిటో రుజువుచేశాయి. బెదిరింపులకో, ఒత్తిడికో లొంగిపోయే రోజులు గతించిపోయాయని ప్రపంచానికి ఆయన ఒక సందేశాన్ని పంపారు.



భారత ప్రజాస్వామ్య వ్యవస్థను, దాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని అటల్‌జీ అర్థం చేసుకున్నారు. దేశ రాజకీయాల్లో సంకీర్ణాలను పునర్నిర్వచించిన ఎన్‌డీయేకు అటల్‌జీ నాయకత్వం వహించారు. అందరినీ ఒక్కచోట చేర్చి అభివృద్ధి, జాతీయ ప్రగతి, ప్రాంతీయ ఆకాంక్షలను నెరవేర్చే శక్తిగా ఎన్డీయేను తయారుచేశారు. ఆయన రాజకీయ ప్రయాణంలో అడుగడుగునా రాజనీతిజ్ఞత కనిపిస్తుంది. గుప్పెడు మంది ఎంపీలున్న పార్టీకి చెందిన నాయకుడు అయినప్పటికీ ఆయన మాటలు ఆ సమయంలో శక్తిమంతమైన కాంగ్రెస్ పార్టీని గడగడలాడించేవి. ప్రధానమంత్రిగా తనదైన శైలిలో విపక్షాల విమర్శలను తిప్పికొట్టేవారు.

అధికారం కోసం ఏనాడూ ఆయన అవకాశవాద రాజకీయాలకు పాల్పడలేదు. 1996లో ప్రతికూల పరిస్థితుల్లో సైతం ఆయన రాజీనామా చేయడానికి మొగ్గు చూపారే తప్ప, ఎలాంటి నీచ రాజకీయాలకు, బేరసారాలకు పాల్పడలేదు.. 1999లో కేవలం ఒకే ఒక్క ఓటు తేడాతో ఆయన ప్రభుత్వం కూలిపోయింది. ఆ సమయంలో జరిగిన అనైతిక రాజకీయాలను సవాలు చేయమని చాలా మంది చెప్పినప్పటికీ ఆయన మాత్రం న్యాయబద్ధంగానే ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. చివరకు అద్భుతమైన ప్రజాతీర్పుతో తిరిగి అధికారాన్ని చేపట్టారు. రాజ్యాంగాన్ని పరిరక్షించే విషయంలో అటల్‌జీ ఉన్నత స్థానంలోనే ఉంటారు. డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదానం ఆయనను తీవ్రంగా ప్రభావితం చేసింది. కొన్నేళ్ల తర్వాత జరిగిన ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో ఆయన ప్రధాన భూమిక పోషించారు. అత్యయిక పరిస్థితి తర్వాత, 1977 ఎన్నికలకు ముందు తాను స్థాపించిన (జన్ సంఘ్) పార్టీని జనతా పార్టీలో విలీనం చేసేందుకు ఆయన అంగీకరించారు. ఇది ఆయనతో పాటు ఇతరులను సైతం బాధించిన నిర్ణయమని నేను భావిస్తున్నాను. కానీ రాజ్యాంగాన్ని పరిరక్షించడమే ఆయనకు ప్రధానం.

భారతీయ సంస్కృతితో అటల్‌జీ ఎంతగా మమేకమయ్యారో కూడా గమనించాల్సిందే. వాజపేయీజీ ఐక్యరాజ్యసమితిలో హిందీలో ప్రసంగించిన తొలి భారతీయ నేతగా నిలిచారు. భారతీయ వారసత్వం, గుర్తింపు పట్ల ఆయన ఎంత గర్వంగా ఉండేవారో అంతర్జాతీయ వేదికపై చెరగని ముద్ర వేసిన ఈ ఒక్క ఉదాహరణ చాలు. అటల్‌జీ వ్యక్తిత్వం అయస్కాంతం లాంటిది. ఆయన జీవితం సాహిత్యం, అభివ్యక్తి పట్ల ప్రేమతో నిండిపోయింది. ఆయన ఓ గొప్ప రచయిత, కవి. స్ఫూర్తి నింపేందుకు, ఆలోచనలను రేకెత్తించేందుకు, ఓదార్పును అందించేందుకు తన మాటలను ఉపయోగించేవారు. ఆయన అంతర్మథనానికి, దేశం పట్ల ఉన్న ఆకాంక్షలకు ఆయన కవిత్వం అద్దం పడుతుంది. వయసుతో నిమిత్తం లేకుండా ప్రజలందరినీ ఉత్తేజపరుస్తూనే ఉంటుంది.

అటల్‌జీ నుంచి నేర్చుకొనే, సంభాషించే అవకాశం దక్కడం నాలాంటి ఎంతో మంది భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు ఓ గొప్ప వరం. బీజేపీకి ఆయన అందించిన సేవలు వెలకట్టలేనివి. ఆ రోజుల్లో కాంగ్రెస్ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా నిలిచిన ఒక దీటైన నేత వాజపేయీజీ. పార్టీ తొలినాళ్ళ నుంచి ఎటువంటి సవాళ్లు ఎదురైనప్పటికీ ఎల్‌కే అద్వానీ, డా. మురళీ మనోహర్ జోషి లాంటి దిగ్గజాలతో కలసి వాటిని సమర్థంగా ఎదుర్కొంటూ పార్టీని విజయపథంలో నడిపించారు. సిద్ధాంతం, అధికారం మధ్య ఒకదాన్ని ఎంచుకోవాల్సిన సందర్భాలు ఎదురైతే ఆయన మొదటిదానినే ఎంచుకొనేవారు. కాంగ్రెస్ చూపిస్తున్న ప్రపంచాన్ని కాకుండా, మరో దృక్కోణంలో ప్రపంచాన్ని చూడటం సాధ్యమేనని ఆయన దేశాన్ని ఒప్పించగలిగారు.

అటల్‌జీ శత జయంతి వేళ ఆయన ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చేందుకు మనల్ని మనం పునరంకితం చేసుకోవాలి. ఆయన అనుసరించిన సుపరిపాలన, ఐక్యత, ప్రగతి అనే నియమాలను ప్రతిబింబించే భారత్‌ను నిర్మించడానికి మనం కృషి చేద్దాం. మన దేశ సామర్థ్యంపై అటల్‌జీకి ఉన్న అచంచలమైన విశ్వాసం ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, కష్టపడి పనిచేసేలా మనల్ని ప్రేరేపిస్తుంది.

• **నరేంద్ర మోదీ**
భారత ప్రధానమంత్రి


చరిత్రపై గెలిచిన అంబేడ్కర్

'నన్ను రాహుల్ గాంధీ తోసేశారు' అని బీజేపీ ఎంపీ ముఖేశ్ రాజపుత్ ఆరోపించారు. 'ముఖేశ్ రాజపుత్ నాపై పడితే నేను క్రింద పడ్డాను. నా తలకు గాయం తగిలింది' అని మరో బీజేపీ ఎంపీ ప్రతాప్ సారంగి చెప్పారు. 'నన్ను క్రింద పడేశారు. నేను లేచి కుంటుకుంటూ సభలోకి వెళ్లాను' అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. 'రాహుల్ నాకు చాలా సమీపంగా వచ్చాడు. దానితో నాకెంతో భయం వేసింది.' అని మరో మహిళా ఎంపీ అన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఇంత ఘోరమైన ఆరోపణల మధ్య ముగుస్తాయని ఏనాడు ఎవరూ ఊహించలేదు. ఒకప్పుడు అసెంబ్లీల పనితీరును విమర్శించేవారు. కాని ఇప్పుడు పార్లమెంట్ సమావేశాలు అసెంబ్లీ సమావేశాల కన్నా దారుణంగా తయారయ్యాయి. పార్లమెంట్ ఆవరణలో ఎంపీలు ఒకర్నొకరు తోసేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో ఉభయ సభల్లో కూడా జరిగే అవకాశాలు లేకపోలేదు.

బాబా సాహెబ్ అంబేడ్కర్ సారథ్యంలో రూపొందించిన రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇలాంటి ఘటనలు దేశంలోని జాతీయ చట్ట సభల్లో సంభవించడం దేశ రాజకీయాలలో విలువలు, ప్రమాణాలు ఎంత దిగజారాయో స్పష్టం చేస్తున్నాయి. పట్టుమని 10–12 రోజులు కూడా జరగని ఈ శీతాకాల సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య బాహాబాహీ జరగడం తప్ప సాధించింది ఏమున్నది? కొన్ని ఆర్థిక బిల్లులతో పాటు ప్రధానంగా జమిలి ఎన్నికలపై బిల్లును ప్రవేశపెట్టి సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపడం తప్ప ఈ సమావేశాల గురించి చెప్పుకోవడానికి పెద్దగా ఏమీ లేదు. 2014లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఈ జమిలి ఎన్నికల గురించి ఉధృత ప్రచారం జరుగుతూనే ఉన్నది. తీరా ఈ బిల్లు ప్రవేశపెట్టిన తర్వాత చూస్తే అందులో అత్యంత కీలకమైన స్థానిక ఎన్నికలను పక్కన పెట్టారు. దేశంలో క్రింది స్థాయిలో అధికార వికేంద్రీకరణకు ఎంతో అవసరమైన పంచాయతీ, మునిసిపల్ ఎన్నికలు జరగడం. అయితే గుజరాత్‌తో సహా చాలా రాష్ట్రాల్లో స్థానిక ఎన్నికలు జరగడం లేదు సరికదా అధికారాలు, నిధుల పంపిణీ కూడా చట్ట ప్రకారం జరగడం లేదు! అంతేకాదు, లోక్‌సభ, అసెంబ్లీలకు సంబంధించి కూడా ఈ జమిలి ఎన్నికలు వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత జరుగుతాయని బిల్లులో పేర్కొన్నారు. అంటే ఇప్పట్లో జమిలి ఎన్నికలు జరిగే అవకాశాలు కనపడడం లేదు.

లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిషా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు గత జూన్‌లో జరిగాయి. జమిలి ఎన్నికలు జరపడం ద్వారా ఖర్చు తగ్గుతుందని నిజంగా ఆలోచించినట్లయితే 2018లోనూ, 2019 చివరిలో జరిగిన అనేక అసెంబ్లీల ఎన్నికలను వీటితో పాటు కలిపి జరిపించే అవకాశం ఉండేది. ఇంతెందుకు? ఇటీవల జమ్ముకశ్మీర్, హరియాణా ఎన్నికలను, మహారాష్ట్ర జార్ఖండ్ ఎన్నికలను కూడా ఒకేసారి నిర్వహించలేదు. ఉప ఎన్నికలను కూడా వాటితో పాటు కలపలేదు. తమ రాజకీయ సౌలభ్యం కోసం వేరువేరుగా జరిపారన్నది జగమెరిగిన సత్యం. అలాంటప్పుడు జమిలి ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము సిద్ధంగా ఉన్నామని ఎన్నికల కమిషన్ ప్రగల్భాలు పలకడం దేనికి?

1990లో గోస్వామి కమిషన్ నుంచి 2008లో పరిపాలనా సంస్కరణల కమిషన్ వరకు పలు ఎన్నికల సంస్కరణలను సూచించాయి. ఎన్నికల ఖర్చును ప్రభుత్వమే భరించడం నుంచి అయిదేళ్లకు మించి శిక్షపడే అభ్యర్థులను ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా ప్రకటించడం వరకు అనేక సిఫారసులు ప్రభుత్వం పరిశీలనలో ఉన్నాయి. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు వేల కోట్లు ఖర్చుపెడుతున్నట్లు తెలిసినా ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేదు. గత ఎన్నికల్లో లక్షా 35వేల కోట్లు ఖర్చయ్యాయని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ తెలిపింది. ఇక ఒకే నాయకుడు రెండు స్థానాల్లో పోటీ చేయడం వల్ల భారీ ఎత్తున డబ్బు వృథా అవుతుందని తెలిసినా ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో సహా అనేకమంది రెండు స్థానాల్లో పోటీ చేసేందుకు అనుమతిస్తున్నారు. ఎమ్మెల్యేలు ఎంపీలుగా మారేందుకు, ఎంపీలు ఎమ్మెల్యేలుగా మారేందుకు అనుమతించడం వల్ల కూడా ఉప ఎన్నికలు జరిగి అత్యధిక మొత్తం వృథా అవుతోంది. ఒక పార్టీలో ఉండి మరో పార్టీ తరఫున పోటీ చేయడం, చివరి నిమిషంలో ఫిరాయింపులు జరగడం, అభ్యర్థులను, ఏజెంట్లను కొనుగోలు చేయడం కూడా ఎవరూ నివారించలేకపోతున్నారు. బ్యాంకులకు వేల కోట్లు ఎగ్గొట్టినవారు, నేరచరితులు, కళంకితులు కూడా పోటీ చేసేందుకు మన ఎన్నికల వ్యవస్థ అనుమతిస్తోంది. వీటన్నింటినీ సంస్కరించి పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించడంపై దృష్టి కేంద్రీకరించకుండా జమిలి ఎన్నికల గురించి ఆలోచించడంలో అర్థం ఏమైనా ఉన్నదా?



అంబేడ్కర్‌ను అమిత్ షా అవమానించారని నిరసన ప్రదర్శనలు చేయడం వల్ల తమను అణగారిన వర్గాలు అక్కున చేర్చుకుంటాయని కాంగ్రెస్ భావిస్తే అమాయకత్వమే అవుతుంది. అసలు ఈ వర్గాలు తమ నుంచి ఎందుకు చేజారిపోయాయి, బీజేపీ వైపు ఎందుకు మొగ్గు చూపుతున్నాయి వారిలో మళ్లీ విశ్వాసం ఎలా కల్పించగలం అన్న ప్రశ్నలపై ఆత్మవిమర్శ చేసుకున్నప్పుడే భారతదేశ పురాతన రాజకీయపక్షం నిలదొక్కుకోగలుగుతుంది.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

అదానీ గ్రూప్ కొన్ని రాష్ట్రాలకు ముడుపులు ఇచ్చి సోలార్ కాంట్రాక్టులను పొందిందని అమెరికాలో కేసు దాఖలు కావడం శీతాకాల సమావేశాలకు ముందు ప్రతిపక్షాలకు కొత్త ఉత్సాహాన్ని అందించినప్పటికీ ఈ అంశంపై సభలో మాట్లాడేందుకు ప్రభుత్వం ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదు. ఎంతో ప్రామాణికంగా జరగాల్సిన రాజ్యాంగ చర్చ కూడా చివరగా హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలతో వివాదాస్పదం కావడం, ప్రతిపక్షాలు ఆయన క్షమాపణ కోరుతూ తీవ్ర నిరసన తెలుపడంతో ఉభయ సభలు రసాభాసగా ముగిసాయి. అయినప్పటికీ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను ఇరుపక్షాలు తలుచుకోవడం, ప్రతిపక్షాలు 'జై భీమ్' అని నినాదాలు చేయడం ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగమైనప్పటికీ దేశంలో అంబేడ్కర్ ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతున్నదే కాని తగ్గడం లేదని స్పష్టం అవుతోంది.

అస్పృశ్యులుగా సమాజం పరిగణించిన దళితులకు విద్యా, ఉపాధి రంగాల్లో అవకాశాలతో పాటు అందరితో పాటు సమానంగా, గౌరవంగా జీవించే హక్కుకోసం తన జీవితాంతం పోరాడిన అంబేడ్కర్ ప్రాసంగికతను ఎవరూ విస్మరించలేరు. అగ్రవర్ణ సంస్కర్తల దయాదాక్షిణ్యాలపై కాకుండా అణగారిన వర్గాలు తమ స్వంత నాయకుల ఆధ్వర్యంలో తమ హక్కులను స్వయంగా పొందాలని ఆయన ఆశించారు. వారిని హిందువులకు భిన్నంగా ప్రత్యేక మైనారిటీ వర్గంగా పరిగణించాలని వాదించారు. వారికి చట్టసభల్లో అత్యధిక ప్రాతినిధ్యాన్ని సాధించారు. అస్పృశ్యత అనే దుర్మార్గాన్ని ప్రపంచం దృష్టికి తీసుకువచ్చి దళితుల పౌర, సామాజిక, రాజకీయ హక్కుల్ని, స్వేచ్ఛను కాపాడేందుకు అంబేడ్కర్ ఏ విధంగా అడుగడుగునా పోరాడారో ధనుంజయ్ కీర్ రాసిన అంబేడ్కర్ జీవిత చరిత్ర చదివితే అర్థమవుతుంది.

'రాజ్యాంగ నైతికత అనేదాన్ని మనం పెంపొందించాలే కాని అది సహజంగా జరగదు. మనం దాన్ని ఇంకా నేర్చుకోవాల్సి ఉన్నది. భారతదేశంలో ప్రజాస్వామ్యం అనేది ఒక అప్రజాస్వామిక సమాజంపై అద్దిన పై మెరుగు మాత్రమే..' అని అంబేడ్కర్ ముసాయిదా రాజ్యాంగంపై రాజ్యాంగ అసెంబ్లీలో మాట్లాడుతూ అన్నారు. ప్రతి వ్యక్తికీ ఓటు హక్కు కన్నా, ప్రతి వ్యక్తికీ ఒకే రకమైన విలువ లభించడమే రాజ్యాంగ నైతికత. సమానత్వం లేని స్వేచ్ఛ కొద్ది మందికే ఉపయోగపడుతుందని చెప్పారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన 75 సంవత్సరాల తర్వాత కూడా స్వేచ్ఛ, సమానత్వం, హుందాగా జీవించే పరిస్థితుల్లో భారతీయులు ఉన్నారా? కులమత లింగ వివక్షలకు తావు లేదని, అంటరాని తనం అమలు కాకూడదని, భావ ప్రకటనా స్వేచ్ఛ ఉండాలని, జీవించేందుకు ప్రతి ఒక్కరికీ హక్కు ఉన్నదని చెప్పే 15, 17, 19, 21 అధికరణలు అమలు అవుతున్నాయా? రాజ్యాంగం ప్రకారమే రాజ్యాంగం అమలు అవుతున్నదా? అన్న ప్రశ్నలకు జవాబులు లేవు.

అంబేడ్కర్ గురించి చర్చ జరిగినప్పుడల్లా కొందరికి తమ ఎజెండా అమలు కావడం లేదనే ఆగ్రహం కలుగుతుంది. అదే సమయంలో అంబేడ్కర్ వారసులం తామేనని చెప్పుకునేందుకు ప్రయత్నించేవారు, అంబేడ్కర్‌ను అవమానించారని ప్రత్యర్థులను వేలెత్తి చూపేవారు ఎల్లెడలా కనిపిస్తారు. అక్కడే అంబేడ్కర్ విజయం మనకు అర్థమవుతుంది. జైళ్లలో 51 శాతం పైగా దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు ఉన్నారని తెలిసినప్పుడు, గర్బా డాన్స్‌లో పాల్గొన్నందుకు తనను కొట్టారని ఒక దళిత మహిళ ఆక్రోశించినప్పుడు, దళితులు ఇంకా అవమానాలకు గురి అవుతున్నారని తేలినప్పుడు అంబేడ్కర్ చారిత్రక ఆవశ్యకత సమసిపోలేదని అర్థమవుతుంది.

అయినప్పటికీ భారత రాజకీయాల అంతర్గత స్వభావం మారుతోంది. సంప్రదాయంగా బలంగా ఉన్న కులాల ఆధిపత్యం సమసిపోతూ అణగారిన వర్గాల కేంద్రంగా రాజకీయాలు మారడం క్రమంగా కనపడుతోంది. తమంతట తాము విజయం సాధించలేమని, ఇతర వర్గాలను మెప్పించడం అవసరమని రాజకీయ పార్టీలు గుర్తిస్తున్నాయి. బలహీన కులాలు బలమైన కులాల చుట్టూ చేరడం క్రమంగా మారిపోతూ, బలమైన కులాలను తామే ప్రభావితం చేసేందుకు సమీకృతం కాగల పరిస్థితి ఏర్పడుతోంది. సంప్రదాయిక రాజకీయ నిర్మాణం విచ్ఛిన్నమయ్యే పరిణామం తీవ్రతరమైంది. ఏ ఎన్నికలు జరిగినా, దళితులు, వెనుకబడిన వర్గాలవారు ఎవరికి ఓటు వేస్తారన్న విషయం చర్చ జరుగుతోంది. హరియాణాలో జాట్ రాజకీయాలను వెనుకబడిన, దళిత వర్గాలు విఫలం చేశాయి. మహారాష్ట్రలో మరాఠా రాజకీయాలను వెనుకబడిన వర్గాలు చిత్తు చేశాయి. బిహార్‌లో భూమిహార్, రాజపుత్, బ్రాహ్మణ వర్గాలు తమంతట తామే అధికారం చేజిక్కించుకునే పరిస్థితి ఏనాడో కోల్పోయాయి. ఉత్తర ప్రదేశ్‌లో బీఎస్‌పీని బలహీనం చేయడం ద్వారా బీజేపీ బలపడితే, కేవలం యాదవులు, ముస్లింల ఓట్లతో విజయం సాధించలేమని సమాజ్‌వాది పార్టీ గ్రహించి, యాదవేతరులకు ఎక్కువ సీట్లు ఇచ్చినందుకే గత లోక్‌సభ ఎన్నికల్లో అధిక సీట్లు సాధించగలిగింది. అంబేడ్కర్‌ను అమిత్ షా అవమానించారని నిరసన ప్రదర్శనలు చేయడం వల్ల తమను అణగారిన వర్గాలు అక్కున చేర్చుకుంటాయని కాంగ్రెస్ భావిస్తే అమాయకత్వమే అవుతుంది. అసలు ఈ వర్గాలు తమ నుంచి ఎందుకు చేజారిపోయాయి, బీజేపీ వైపు ఎందుకు మొగ్గు చూపుతున్నాయి వారిలో మళ్లీ విశ్వాసం ఎలా కల్పించగలం అన్న ప్రశ్నలపై ఆత్మవిమర్శ చేసుకున్నప్పుడే ఆ పార్టీ నిలదొక్కుకోగలుగుతుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

కువైత్‌కు తెలుగు రాష్ట్రాల సేద్య ఉత్పత్తులు

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ పనితీరు వివిధ రంగాలలో ఏ విధంగా ఉన్నప్పటికీ జాతి ప్రయోజనాల దృష్ట్యా కీలకమైన గల్ఫ్ అరబ్బు దేశాలతో మైత్రీ పటిష్ఠత విషయంలో మాత్రం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. మోదీ ఇటీవల జరిపిన కువైత్ పర్యటనతో, గల్ఫ్ కూటమిలోని ఆరు దేశాలనూ పర్యటించిన భారతీయ నేతగా నిలిచారు.

విశిష్ట స్వభావం కల్గిన ఎడారి అరబ్బులతో మైత్రి లేదా శత్రుత్వం రెండు కూడ అంత సులువు కాదు. పైగా కఠోర వహాబీ ఇస్లామిక్ ధార్మిక విధానాన్ని అనుసరించే ఎడారి అరబ్బు దేశాలలో సనాతన హిందూ ధర్మాన్ని ప్రోత్సహిస్తున్న మోదీ సర్కారు బలీయమైన మైత్రీ విధానాన్ని అనుసరిస్తూ ముందుకు సాగుతోంది. గల్ఫ్‌లోని అన్ని దేశాలతోనూ ఈ రోజు భారతదేశ సంబంధాలు సంప్రదాయక ద్వైపాక్షిక స్థాయిని దాటి వ్యూహాత్మక ఆర్థిక, భద్రత అంశాల వైపు విజయవంతంగా పురోగమిస్తున్నాయి. ఈ పరిణామాన్ని గతంలో అయితే ఊహించడం కూడా కష్టతరంగా ఉండేది. ఇది కేవలం నరేంద్ర మోదీ వ్యక్తిగత శ్రద్ధతో మాత్రమే సాధ్యమయింది అంటే అతిశయోక్తి కాదు. కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ సుదీర్ఘ కాలంలో అరబ్బు దేశాలలో సాధించని దౌత్య విజయాన్ని మోదీ తన దశాబ్ద కాలంలో సాధించారు.

గల్ఫ్ లేఖ



ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన పథకం కింద ఫుడ్ పార్కులు ఉన్నాయి. వాటిలోని వ్యవసాయోత్పత్తులను కువైత్, తదితర దేశాలకు ఎగుమతి చేసే విధంగా ప్రయత్నిస్తే రైతులూ విశేషంగా లబ్ధి పొందుతారు.

భారతీయ విదేశాంగ విధాన రూపకల్పనలో సంబంధిత మంత్రి కంటే ప్రధానమంత్రి, జాతీయ భద్రత సలహాదారు అయిన అజిత్ దోవల్ కీలక పాత్ర వహిస్తారు. ప్రస్తుతం కువైత్ పర్యటనలో గానీ అంతకు ముందు గానీ గల్ఫ్‌లోని ఏ రాజుతోనైనా మోదీ సమావేశమైతే మోదీ ప్రక్కన ఉండేది అజిత్ దోవల్ మాత్రమే.

గల్ఫ్ ప్రాంతంలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో పని చేస్తూ ప్రజాగళం వినిపించే పార్లమెంటు ఉన్న దేశం కువైత్. ఈ కారణాన కువైత్ ప్రజాప్రతినిధులు భారతదేశంలోని మోదీ సర్కారు తీసకున్న కొన్ని నిర్ణయాలు, చేసిన వ్యాఖ్యలను గతంలో తీవ్రంగా విమర్శించారు. కువైత్ పార్లమెంటేరియన్ల కారణాన కొన్నిసార్లు భారత విదేశాంగ శాఖ సంకట పరిస్థితిని ఎదుర్కొన్నది. ఈ నేపథ్యంలో కువైత్ అత్యున్నత పురస్కారమైన ముబారక్ అల్ కబీర్‌ను ప్రధాని మోదీకి ప్రదానం చేయడం మామూలు విషయం కాదు. ఇది నిస్సందేహంగా భారత్‌కు దౌత్యపరమైన విజయం.

కువైత్‌ను ఇరాక్ దురాక్రమణ చేయడాన్ని భారత్ ఖండించకపోవడంతో ఈ గల్ఫ్ దేశం భారత్‌పై అసంతృప్తి వ్యక్తం చేసింది. అంతటితో ఆగక కువైత్ సిటీలో అక్రమంగా నిర్మించిన గురుద్వారాను సిక్కు ధార్మిక వ్యక్తి భారతీయ రాయబారిగా ఉన్న హయాంలోనే కూల్చివేసింది. భారతీయ ఇంజినీర్ల విద్యార్హతల గుర్తింపును ప్రశ్నించింది. కువైత్‌లో నివసిస్తున్న విదేశీయుల సంఖ్యపై జాతుల వారిగా పరిమితి విధించే ప్రతిపాదన తదితర అంశాలకు తోడుగా హిజాబ్ వివాదం, ప్రవక్త మొహమ్మద్‌పై అనుచిత వ్యాఖ్యల విషయమై కువైత్ పార్లమెంటు సభ్యుల ఆక్షేపణ మొదలైన సున్నిత అంశాల కారణాన ఇరు దేశాల మధ్య కొంతవరకు అగాధం ఏర్పడింది.

సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్ దేశాలతో పోల్చితే కువైత్‌లో వాణిజ్య రంగ అభివృద్ధి అంతగా లేదు. కీలకమైన నిర్మాణ రంగంలో సైతం మిగిలిన మూడు దేశాల కంటే కూడా వెనుకబడి ఉంది. ప్రవాసుల సంఖ్య పరంగా పరిశీలిస్తే, కువైత్‌లో నివసిస్తున్న జనాభాలో కువైతీల తర్వాయి స్థానంలో భారతీయులు ఉన్నారు. కువైత్‌లో నివసిస్తున్న విదేశీయులు అందరిలోనూ భారతీయులు సంఖ్యాపరంగా అగ్రగాములు. పది లక్షల మంది భారతీయులు కువైత్‌లో నివసిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, కువైత్‌లోని భారతీయులలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాలకు చెందిన వారు ప్రభావదాయక సంఖ్యలో ఉన్నారు. కువైతీ దీనారు ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల సామాజిక, ఆర్థిక జీవన స్రవంతిలో ముఖ్యపాత్ర వహిస్తోంది మరి.

సాధారణంగా రెండు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకై ఇరు దేశాల ఉన్నతాధికారులతో కూడిన సంయుక్త బృందాలు నిరంతరం పని చేస్తుంటాయి. ఆ విధంగా కువైత్ – భారత్ దేశాల మధ్య ఇప్పటి వరకు కార్మిక, ఉద్యోగ నియామకాలు, చమురు, ఆరోగ్య రంగాలకు సంబంధించి మూడు సంయుక్త కార్యాచరణ బృందాలు మాత్రమే ఉండగా, వాణిజ్యం, పెట్టుబడులు, విద్య నైపుణ్యాభివృద్ధి, శాస్త్ర సాంకేతికాభివృద్ధి, వ్యవసాయం, సాంస్కృతిక రంగాలతో పాటు భద్రత, కౌంటర్ టెర్రరిజం మొదలైన కీలకంశాలపై కూడా ఉభయ దేశాల మధ్య సంయుక్త కార్యాచరణ బృందాలను నెలకొల్పడానికి తాజాగా మోదీ జరిపిన పర్యటనలో నిర్ణయించారు.

స్వీయ ఆహార భద్రతకై భారత్‌లో తాము సంకల్పించిన పెట్టుబడులకు అనుమతించాలని ప్రధాని మోదీని కువైత్ ప్రభుత్వం కోరింది. ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన పథకం క్రింద ఫుడ్ పార్కులు ఉన్నాయి. వాటిలోని వ్యవసాయోత్పత్తులను కువైత్ తదితర దేశాలకు ఎగుమతి చేసే విధంగా ప్రయత్నిస్తే రైతులు కూడా విశేషంగా లబ్ధి పొందుతారు. అలాగే భారత్, కువైత్ దేశాల మధ్య పెండింగ్‌లో ఉన్న విమాన సీట్ల సంఖ్య పెంపుదల అంశాన్ని సాధ్యమైనంత వరకు పరిష్కరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. దీనికి పరిష్కారం లభిస్తే ప్రతిపాదిత తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం స్వప్నం ఫలిస్తుంది. అదే విధంగా విజయవాడ, విశాఖపట్టణం విమానాశ్రయాలకు అంతర్జాతీయ అనుసంధానం పెరుగుతుంది. ప్రధాని లేదా కేంద్రమంత్రులు అధికారికంగా విదేశీ పర్యటనలు చేసినప్పుడల్లా ఆ పర్యటనలలో తమ రాష్ట్రాలకు గరిష్ఠ ప్రయోజనం లభించే విధంగా తెలుగు రాష్ట్రాలు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి.

■ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

'బాబాసాహెబ్'ను పార్టీలు గౌరవించడం ఎలా?

బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించింది మీరంటే మీరంటూ వైరిపక్షాలు జాతీయ స్థాయిలో తలపడుతున్నాయి. ఎన్నడూ లేనిది పార్లమెంటు ప్రాంగణంలో సభ్యుల మధ్య తోపులాట, ఇద్దరు గాయపడడం, పోలీసు కేసులు నమోదయ్యాయి. అన్ని రాజకీయ పార్టీలూ ఆ మహనీయుడిని తమ వాణ్ణి చేసుకుని, ఎదుటి వారి పట్ల అసహనం చూపించడం వారి అవ్యాజప్రేమకు చిహ్నం. అయితే ఆయన్ని ఇలా గౌరవించవచ్చని సూచన. పాలక పక్షమైతే అమలు చెయ్యడం ద్వారా, ప్రతిపక్షమైతే అమలు చేయమని పోరాడడం ద్వారా.. 1. అన్ని ఊళ్లలో గ్రంథాలయాలు నెలకొల్పాలి. అధ్యయనం ఎంత అవసరమో ఆయన చెప్పినందుకు. 2. ఉచిత, నాణ్యమైన విద్య అందరికీ అందించాలి. విద్య ఒక్కటే అసలైన ఆయుధమని అన్నందుకు. 3. బ్యాక్‌లాగ్ పోస్టులు అన్నీ భర్తీ చెయ్యాలి. కోట్లాది మంది అర్హులైన నిరుద్యోగులు ఉన్నప్పుడు, లక్షలాది ఉద్యోగాలు భర్తీ కాకపోవడం నేరం. 4. ఆహార భద్రత అందరికీ అందించాలి. దేశంలో సరిపడా ఆహారం ఉన్నా, కాలే కడుపులు గణనీయంగా ఉండడం సిగ్గుచేటు. పిల్లల ఎదుగుదల లోపాలు దేశంలో ఎక్కువే. 5. సంపద పంపిణీలో న్యాయం ఉండాలి. ఆదాయం, సంపద అతి తక్కువ మంది చేతిలో పడి, అత్యధిక శాతం జనాలు పేదరికంలో మగ్గుతున్నారు. ప్రజానీకం ఆత్మగౌరవంతో ఆర్థికంగా బలపడేలా విధానాలు ఉండాలి. 6. చట్టం ముందు అందరూ సమానులే అన్నది పాటించాలి. తప్పు చేసింది తమవాడైనా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ముఖ్యంగా మహిళలు, అణగారిన వర్గాల హక్కులు కాపాడే విషయంలో. 7. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతోనే సామాజిక న్యాయం. కుల రహిత సమాజం కల సాకారమయ్యే రోజు కనుచూపు మేరలో లేదు. కులాలు, మతాల మధ్య దూరాలు పెరగకుండా, సాన్నిహిత్యం పెరిగేలా చూడాలి. 8. న్యాయ వ్యవస్థలో అందరికీ ప్రాతినిధ్యం ఉండేలా న్యాయ సంస్కరణలు, రాజకీయ స్వాతంత్ర్యం పట్టాలు తప్పకుండా చూసే ఎన్నికల సంస్కరణలు, అత్యధిక శాతం ప్రజలు తమ కాళ్లపై తాము నిలబడేలాగా ఆర్థిక విధానాల కల్పన చేయాలి.

ప్రస్తుతానికి భిన్నాభిప్రాయాలు ఉండక్కర్లేని, ఈ ఎనిమిది విషయాలపై రాజకీయ పార్టీలు చిత్తశుద్ధి చూపిస్తే అది అంబేడ్కర్ మార్గం అవుతుంది. ఆయనపై గౌరవం చూపడమే కాకుండా సమాజానికి మేలు చేస్తుంది. 'అధ్యయనం, ఆత్మగౌరవం, శీలం... ఈ మూడు నాకు ముఖ్యం' అన్నారాయన. శీలం ఉంటేనే మిగతా రెండూ సాధ్యమయ్యేవి... వ్యక్తికైనా, వ్యవస్థకైనా.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ





వర్షంలో తడుస్తూ ఇంద్రకీలాద్రికి వస్తున్న భవానీలు

జై భవానీ

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు



వన్‌టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఉత్సవాలు మంగళవారం నాలుగో రోజు కూడా ఘనంగా జరిగాయి. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సుదూర ప్రాంతాల నుంచి భవానీలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భవానీలు గిరిప్రదక్షిణ చేసి దుర్గమ్మ దర్శనానికి వెళ్తున్నారు. అనంతరం దీక్షను విరమిస్తున్నారు. కాగా, మంగళవారం సాయంత్రం వరకు దుర్గమ్మ 59,200 మంది దర్శించుకున్నారు. 2,66,731 లడ్డూ ప్రసాదాన్ని విక్రయించారు. దీక్ష విరమణకు బుధవారం చివరి రోజు కావడంతో ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించనున్నారు.



ప్రత్యేక కౌంటర్ల వద్ద ఇరుముడులు సమర్పిస్తున్న భవానీలు

క్రిస్మస్ సందడి

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని చర్చిల్లో మంగళవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు జననంతో పండుగ వాతావరణం నెలకొంది. క్రీస్తును స్తుతిస్తూ గీతాలను ఆలపించారు. పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. చర్చిలను విద్యుత్ దీపాలు, కొవ్వొత్తులతో విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు చర్చిలకు హాజరయ్యారు.



విజయవాడ సెయింట్ పాల్ కెథడ్రల్ చర్చిలో..



విజయవాడ సెయింట్ పీటర్ చర్చి



గుణదల మేరీమాత చర్చి

ఉపాధికి ఊతం పీఎంఈజీపీ

6

టిడ్కో గృహాలు ఇంకెప్పుడు?

గత టీడీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన టిడ్కో ఇళ్ల నిర్మాణ ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వంలో గాలికొదిలేసింది. పేదోడి సొంతింటి కలను నాశనం చేసేలా అనేక నిర్ణయాలను జగన్ సర్కారు తీసుకుంది. రివర్స్ టెండరింగ్, లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు అంటూ వివిధ కారణాలు చూపి పనులు, కాంట్రాక్టర్లకు బిల్లులు నిలిపివేసింది. దీంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే ఆగిపోయాయి. దీంతో ఇళ్లు అందక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.



- జిల్లాలో 11,525 గృహాల నిర్మాణం చేపట్టిన గత టీడీపీ ప్రభుత్వం
- వైసీపీ ప్రభుత్వం రాకతో ఎక్కడి పనులు అక్కడే నిలుపుదల
- కాంట్రాక్టర్లకు నిలిచిపోయిన రూ.100 కోట్ల బిల్లులు
- జక్కంపూడి, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరులో ఆగిన పనులు
- ఇల్లు పూర్తికాకుండానే లబ్ధిదారులకు అలాట్‌మెంట్ లెటర్లు
- కూటమి ప్రభుత్వంపైనే లబ్ధిదారుల ఆశలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ):

ఎన్టీఆర్ జిల్లాలో టీడీపీ ప్రభుత్వంలో మొత్తం 11,525 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. జక్కంపూడి, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరులో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీపీ), ఎల్‌అండ్‌టీ సంస్థలు చేపట్టాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్ల నిర్మాణంపై తీవ్ర నిర్లక్ష్యం అలుముకుంది. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు నిలిపివేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. జక్కంపూడిలో ఇళ్లు 70 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఇక్కడ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 10,624 ఇళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టగా, 6,576 ఇళ్ల పనులు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 60 శాతం మేర పనులు జరగ్గా, వైసీపీ ప్రభుత్వ హయాం ఐదేళ్లలో కేవలం 10 శాతం మాత్రమే పనులు చేశారు. తిరువూరు పట్టణంలో 1,536 ఇళ్లకు శ్రీకారం చుట్టగా, 74 శాతం మాత్రమే ఇళ్లు పూర్తయ్యాయి. జగ్గయ్యపేట పట్టణంలో 3,168 ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి 85 శాతం పురోగతి సాధించింది. నందిగామ పట్టణంలో 245 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టగా.. 72 శాతం పనులు పూర్తి చేశారు. విజయవాడ నగరంతో పాటు, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు పట్టణాల పరిధిలో 20 నుంచి 30 శాతం పనులు ఇంకా పూర్తి చేయాల్సి ఉంది. పూర్తికాని ఇళ్ల అలాట్‌మెంట్ పత్రాలు లబ్ధిదారులకు ఇచ్చి బ్యాంకుల నుంచి నోటీసులు అందుకునే పరిస్థితిని తీసుకువచ్చింది.

కాంట్రాక్టర్లకు బకాయిలు ఇలా :

ఎన్టీఆర్ జిల్లాలో కాంట్రాక్టర్లు పనులు చేపట్టలేమని చేతులెత్తేశారు. జిల్లాలో జక్కంపూడిలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు చేపడుతున్న నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీపీ), నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరులో ఇళ్లు నిర్మిస్తున్న ఎల్‌అండ్‌టీ సంస్థలు బిల్లు చెల్లింపులకు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నాయి. బకాయి బిల్లులు చెల్లించే వరకు పనులు చేపట్టలేమని చెబుతున్నాయి. కాంట్రాక్టర్లకు ఎన్టీఆర్ జిల్లాలో రూ.100 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఎల్‌అండ్‌టీ సంస్థకు రూ.50 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తప్పితే కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క బిల్లును కూడా ఎల్‌అండ్‌టీకి చెల్లించలేదు. 2020లో ఎల్‌అండ్‌టీకి సంబంధించి రూ.20 కోట్ల బిల్లును పెడితే మిగతా 6లో..



కొణిజర్లలో పురుగు మందుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

రూ.36 లక్షల పురుగు మందులు సీజ్

గంపలగూడెం, డిసెంబరు 24, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉటుకూరు, తునికిపాడు, కొణిజర్ల, దుందిరాలపాడు గ్రామాల్లో పురుగు మందులు, విత్తనాల షాపులను రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ పరిధిలోని స్క్వాడ్ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. ఉటుకూరులోని రెండు షాపుల యజమానులు అధికారులకు స్పందించకపోవడంతో వాటిని సీజ్ చేశారు. కొణిర్ల, దుందిరాలపాడు, తునికిపాడులోని షాపులను తనిఖీ చేసి రూ.36లక్షల విలువ చేసే పురుగు మందులను సీజ్ చేశారు. సంబంధిత

పురుగు మందుల కంపెనీలు కేంద్ర ప్రభుత్వం అందజేసే జీ-3లైసెన్స్ చూపి విక్రయాలు జరుపుకోవాలని అధికారులు షాపు యజమానులకు తెలిపారు. కార్యక్రమంలో ఏవో సాయిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ టెర్రర్..!

'ఈ'జీగా ఇరుక్కుంటున్నారు..!

- ఆన్‌లైన్ లావాదేవీలతో చిక్కులు
- 'సైబర్' నుంచి రూపాయి వచ్చినా అకౌంట్ ఫ్రీజ్

8లో

అవగాహనతోనే మోసాలకు అడ్డుకట్ట

- జాతీయ వినియోగదారుల దినోత్సవంలో మంత్రి నాదెండ్ల మనోహర్

8లో

మామిడికి అకాల కష్టం!

ప్రతికూల వాతావరణంతో పూతకు నష్టం 6లో

ఎన్‌హెచ్ ఆర్‌వోపై

ఎంపీ కేశినేని ఫైర్!

- ఎమ్మెల్యేలు వసంత కృష్ణ ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావులూ ఆగ్రహం
- హాట్ హాట్‌గా విజయవాడ బైపాస్ టవర్ల మార్పిడి కమిటీ విచారణ
- ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, కలెక్టర్ లక్ష్మీశల సమక్షంలో ..
- నోరెత్తని ఎన్‌హెచ్ ఆర్‌వో సింగ్
- కలెక్టర్ లక్ష్మీశ చొరవతో సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ): "ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారు. మూతపడి విద్యుత్ ఉత్పత్తి చేయని కంపెనీ లైన్లు మార్చుతారా.. లైసెన్సే లేని సంస్థ టవర్లను మార్చుతారా.. మూత పడిన కంపెనీ ఓనరెవరో తెలియదా.. రూ.కోట్ల ప్రజాధనాన్ని ఓ ప్రైవేటు సంస్థ ప్రయోజనాల కోసం అక్రమంగా ఎలా ఖర్చు పెడతారు. దౌర్జన్యంగా పనులు చేయిస్తారా.. రైతులను అరెస్టు చేయిస్తారా.. చేసింది తప్పుడు పని.. రైతులను నష్టపరుస్తారా.. ఎవరి ప్రయోజనం కోసం మీరు ఈ పని చేస్తున్నారు" అంటూ విజయవాడ వెస్ట్ బైపాస్ ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల అడ్డగోలు అలైన్‌మెంట్ మార్పిడిపై ప్రజాప్రతినిధులు భగ్గుమన్నారు. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, మైలవరం, గన్నవరం ఎమ్మెల్యేలు వసంత కృష్ణ ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు జాతీయ రహదారుల సంస్థ ఆర్‌వో సింగ్, ల్యాంకో ప్రతినిధులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఈ అంశంపై విచారణ కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశలతో పాటు రైతుల తరఫున ప్రతినిధిగా శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభం కాగానే.. ప్రజా ప్రతినిధులు ఎన్‌హెచ్ ఆర్‌వో సింగ్‌పై విరుచుకుపడ్డారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఉగ్రరూపం ప్రదర్శించారు. ల్యాంకో కొండపల్లి పవర్ ప్రాజెక్టు మూతపడిందని, అది రన్నింగ్‌లో ఉన్నపుడు ఇచ్చిన ప్రతిపాదన ఆధారంగా ఇప్పుడు అప్పటి అలైన్ మెంట్ ప్రకారం టెండర్లు పిలవటమేమిటని ప్రశ్నించారు. అసలు విద్యుదుత్పత్తే చేయని సంస్థ కోసం అలైన్‌మెంట్ ఎందుకు మార్చారని నిలదీశారు. మూత పడిన సంస్థకు యజమాని ఎవరో తెలియదని, అలాంటపుడు రూ.32.58 కోట్ల పని చేయడంతో పాటు రూ.45 లక్షలు ఏ సంస్థకు డబ్బులు చెల్లించారని ప్రశ్నించారు. స్క్రాప్‌కు యూనిట్‌ను కొనుక్కున్న సంస్థ విద్యుదుత్పత్తే చేయకపోయినా అంతరాయం పేరుతో రూ.14 కోట్లు ఎలా డబ్బులు దండుకుందని కడిగిపారేశారు. భారీ అవినీతికి పాల్పడి రైతులను నష్టపరుస్తారా అని ప్రశ్నించారు. వసంత కృష్ణ ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావులు కూడా ల్యాంకో ప్రతినిధులపై ఫైర్ అయ్యారు. మీ సంస్థ మూత పడింది కదా ! దానికి ఇప్పుడు ఎవరు యజమానులో తెలియదు ! మీరొచ్చి ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. ల్యాంకో గతంలో టవర్ల కింద కొనుగోలు చేసిన నాలుగు ఎకరాల మిగతా 6లో..

- విజయవాడలో రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్
- పండగ రద్దీ, ప్రైవేటు బస్సుల పార్కింగ్‌తో తంటాలు
- సీఎం కాన్వాయ్ కూడా తోడు కావటంతో మరింత తీవ్రం
- రెండు గంటల పాటు రోడ్లపై ప్రయాణికులు నరకయాతన

అష్టదిగ్బంధం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ):

విజయవాడ నగరం ఒక్కసారిగా మంగళవారం సాయంత్రం అష్టదిగ్బంధనమైంది. ట్రాఫిక్ స్తంభించటంతో రెండు గంటల పాటు ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్రిస్మస్ కావడంతో వాహనాల రాకపోకలతో రోడ్లపై రద్దీ పెరిగింది. క్రిస్మస్ ప్రయాణాలను ఎన్‌క్యాష్ చేసుకోవటానికి ప్రైవేటు బస్ ఆపరేటర్లు సాయంత్రం నుంచే బస్సులను ప్రధాన రోడ్ల మీద నిలిపి ఉంచటం ట్రాఫిక్ తిప్పలను తెచ్చి పెట్టింది. దీనికి తోడు సీఎం కాన్వాయ్ కూడా ఇదే సందర్భంలో వెళ్లాల్సి ఉండటంతో ట్రాఫిక్ నిలుపుదల వంటి కారణాలతో నగరం అష్టదిగ్బంధనమైంది. ఎక్కడ వాళ్లు అక్కడే రోడ్లపై చిక్కుకుపోయారు. ముందుకు, వెనక్కి కదలటానికి లేకుండా రెండు గంటలపాటు విలవిల్లాడారు. ప్రైవేటు బస్సులను నిబంధనలకు విరుద్ధంగా సాయంత్రం నాలుగు గంటల నుంచే రోడ్ల మీద నిలుపుదల చేయడంతో ఈ సమస్య మొదలైంది. రెండు వరసల రోడ్లలో ఒక వరసలో ప్రైవేటు బస్సులు నిలిపారు. పీఎన్‌బీఎస్, కంట్రోల్ రూమ్, ఎన్టీఆర్ సర్కిల్, కృష్ణవేణి రోడ్డు, బెంజిసర్కిల్, రామవరప్పాడు దగ్గర ఒక వరుసలో బస్సులు ఆగిపోయాయి. ఈ కారణంగా మిగిలిన ఒక వరుసలో వాహనాలు నిదానంగా ముందుకు సాగటం వల్ల ట్రాఫిక్ స్తంభించింది. జాతీయ రహదారుల మీదనే కాకుండా బందరు, ఏలూరు రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు, సర్వీసు రోడ్లు, అంతర్గత రోడ్లు ఇలా అన్నీ నిలిచిపోయాయి.





బందరు రోడ్డులో ట్రాఫిక్‌లో భారీగా నిలిచిన వాహనాలు







దుర్గమ్మను దర్శించి తరిస్తున్న భక్తులు



అమ్మపైనే.. భారం

» జోరు వానలోనూ సడలని భక్తి

భవానీపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భవానీ దీక్షల విరమణకు నాలుగోరోజు ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. ఒకవైపు వణికించే చలి.. మరోవైపు భక్తి పారవశ్యం.. భవానీ మాలధారులు ఇబ్బంది పడుతూనే దీక్ష పూర్తిచేసుకున్నారు. మంగళ వారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు ప్రారంభమై సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో గిరి ప్రదక్షిణలో భక్తులు తడిసి ముద్దయ్యారు. అక్కడక్కడ ఆగుతూ దారి పొడవునా స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంఘాల ప్రతినిధులు అందించిన ఫలహారాలతో దీక్షల విరమణ కొనసాగింది. గిరి ప్రదక్షిణలో కొన్నిచోట్ల మరుగుదొడ్లు లేక భక్తులు ఇబ్బందులు పడ్డారు.

పలు సంఘాల ప్రతినిధులు భవానీ భక్తుల ఆకలి తీర్చడానికి ఉత్సాహంగా భోజనాలతో పాటు పండ్లు, బిస్కెట్లు, పాలు కాఫీ, టీలు అందిస్తూ తమ భక్తి భావాన్ని చాటారు. చెరువుసెంటర్ చౌకడిపోల సంఘ నాయకులు కోట గురునాథం ఆధ్వర్యంలో పలువురు డీలర్లు రెండోరోజూ ప్రసాదాలను అందజేశారు. టీడీపీ నాయకులు, నాగేంద్రస్వామి భక్త సమాజం సభ్యులు నాలుగుస్తంభాల సెంటర్‌లో అన్నప్రసాద వితరణ చేశారు. దారిపొడవునా దేవుడి ప్రతిమలతో కుమ్మరి పాలెం నుంచి సితార వరకు భక్తులు జై భవానీ అంటూ ముందుకు సాగారు.



ఓ వైపు చలి.. మరోవైపు వాన.. అమ్మపై భక్తితో ముందుకే అడుగు



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ బాలాజీ

కూచిపూడి పతాక స్వర్ణోత్సవ వేడుకలు విజయవంతం చేయండి

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

కూచిపూడి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి హెరిటేజ్ సొసైటీ ఆధ్వర్యంలో కేంద్ర సాంస్కృతికశాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సహకారంతో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు నిర్వహించే కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలు విజయవంతం కావటానికి తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డికె.బాలాజీ అధికారులను ఆదేశించారు. కూచిపూడి శ్రీ సిద్దేంద్రయోగి నాట్య కళాపీఠంలో ఈ వేడుకలకు సంబంధించి జిల్లా, మండలస్థాయి అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కళాకారులకు, అతిథులకు, వీక్షకులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖర్, ఇంచార్జ్ డీపీవో కన్నమనాయుడు, నేషనల్ కల్చరల్ రీసెర్చ్ ట్రైనింగ్ సెంటర్ సీఈవో డాక్టర్ తాడేపల్లి, ఉత్సవ కమిటీ కన్వీనర్ డాక్టర్ వేదాంతం వెంకట నాగ చలపతిరావు, కళాపీఠం వైస్‌ప్రిన్సిపాల్ చింతా రవిబాలకృష్ణ, టూరిజంశాఖ మేనేజర్ రామలక్ష్మణ్, మండల ప్రత్యేకాధికారి శేషకుమారి, తహసీల్దార్ మస్తాన్, ఎంఈవో శ్రీలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కేఎస్ఆర్.ప్రసాద్, ఈవోపీఆర్డీ కె.పరమాత్మ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేసీ గీతాంజలి శర్మ

హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం

» జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం టౌన్ : ప్రతి పౌరుడు వినియోగదారుడేనని, వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జేసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వినియోగదారుల హక్కులపై అవగాహన పోస్టర్లు, మేలుకొలుపు పుస్తకాన్ని జేసీ ఆవిష్కరించారు. అనంతరం వివిధ శాఖల ప్రదర్శన స్టాల్స్‌ను తిలకించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జేసీ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి పార్వతి, గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ పి.రాజేంద్రప్రసాద్, సేఫ్టీ ఆఫీసర్ గోపాలకృష్ణ, వినియోగదారుల హక్కుల స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి వేము కోటేశ్వరరావు తదితరులు మాట్లాడారు.



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ

28న వికసిత్ భారత్ మెగా జాబ్‌మేళా

వన్‌టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 28న వికసిత్ భారత్ మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడ కలెక్టరేట్‌లో మంగళవారం జాబ్‌మేళా పోస్టర్లను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, వచ్చే శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5వరకు విజయవాడ మొగల్రాజపురంలోని వీరమాచినేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తిచేసిన వారు అర్హులని, మేళాలో వివిధ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. 50కి పైగా సంస్థల్లో మూడువేల వరకు ఖాళీలు ఉన్నాయన్నారు. ఔత్సాహిక అభ్యర్థులు వికాస్‌జాబ్స్‌కామ్‌లో జాబ్‌మేళా లింక్‌లో తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7799376111, 9381530964 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఇందుకు ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేదని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

పీఎంఈజీపీ ఉపాధికి ఊతం

» జనవరిలో కార్యక్రమంపై స్పెషల్ డ్రైవ్
» నియోజకవర్గాల వారీగా విస్తృత అవగాహన కార్యక్రమాలు
» వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర -2047 దిశగా సమష్టిగా అడుగులు వేద్దాం
» ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు

కృష్ణలంక, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధితో పాటు మరో పదిమందికి ఉపాధి చూపేందుకు, జీవితంలో ఉన్నతికి ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) ఉపయోగపడుతుందని, కార్యక్రమంపై రానున్న జనవరిలో నియోజకవర్గాల వారీగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంపీ శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ, పీఎంఈజీపీపై పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి, డీఆర్‌డీఏ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రా, వికసిత్ ఎన్టీఆర్ జిల్లా కోసం సమష్టిగా అడుగులు వేద్దామని పేర్కొన్నారు. యువత ఆసక్తికి అనుగుణంగా స్వయం ఉపాధి మార్గాలను చూపడం ద్వారా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ క్రమంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రెడిట్ లింక్డ్ రాయితీ పథకమైన పీఎంఈజీపీపై పెద్దఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. ముఖ్యమంత్రి దార్శనికత అయిన వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్ సాకారం దిశగా వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం జరుగుతుందన్నారు. అన్ని రంగాల్లో ఎన్టీఆర్ జిల్లా ఆదర్శవంతంగా నిలిచేలా కృషి చేస్తున్నట్టు ఎంపీ తెలిపారు.

చేయిపట్టి నడిపించాలి : కలెక్టర్ లక్ష్మీశ

పారిశ్రామికంగా, ఉపాధి కల్పనపరంగా జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్వయం ఉపాధి పథకాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకొనేలా చేయిపట్టి నడిపించాలని అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. జిల్లాలో దాదాపు 40 వేల ఎంఎస్ఎంఈలు ఉన్నాయని, ఒకవైపు వృద్ధికి చోదక శక్తి అయిన ఎంఎస్ఎంఈల అభివృద్ధిపై దృష్టి సారిస్తూనే మరోవైపు యువతను పరిశ్రమల ఏర్పాటు దిశగా ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. పీఎంఈజీపీపై ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించి బిజినెస్ ఆలోచన మొదలు, ప్రాజెక్టు రూపకల్పన, దరఖాస్తు విధానం, రాయితీ, రుణసదుపాయం, మార్కెటింగ్ అవకాశాలు, యూనిట్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళిక, ఇలా ప్రతి అంశంపైనా అవగాహన కల్పించనున్నట్టు వెల్లడించారు. పీఎంఈజీపీ ద్వారా సుమారు 1,056 రకాలకు సంబంధించిన యూనిట్లు ఏర్పాటు చేసుకొనేందుకు అవకాశముందని వివరించారు. స్వర్ణాంధ్ర 2047 సాధన దిశగా వివిధ శాఖల అధికారులు నిబద్ధతతో పనిచేసి జిల్లాను ముందంజలో నిలుపుదామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఈవీఎంల గోదాముకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

» కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈవీఎంల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ తెలిపారు. సాధారణ తనిఖీలో భాగంగా గొల్లపూడి మార్కెట్ యార్డులో ఈవీఎంలను భద్రపరిచే గోదామును మంగళవారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. ఈవీఎంల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. సీసీ టీవీ కెమేరాల వ్యవస్థను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును క్షుణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను ఎన్నికల సంఘానికి అందచేయడం జరుగుతుందన్నారు. ఈవీఎం గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వుంటూ పటిష్ట పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలన్నారు.



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

ఎక్సైజ్ దాడులు

» 334 మద్యం బాటిళ్లు, 60 లీటర్ల నాటుసారా స్వాధీనం
» పలువురిపై కేసులు నమోదు

తిరువూరు/విస్సన్నపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు సర్కిల్ పరిధిలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇన్‌చార్జి సీఐ జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 23 బెల్టుషాపులపై దాడులు చేసి 24 మందిని అదుపులోకి తీసుకున్నారు. 334 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. 10 సారా కేసులు నమోదు చేసి, ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారినుంచి 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి తండాలో 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసంచేసి, ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. సారాను పూర్తిగా నిర్మూలించే దిశగా ప్రభుత్వం 'నవోదయం' కార్యక్రమం చేపట్టిందని, ఎవరైనా సారా తయారు చేసినా, తోటల్లో, పొలాల్లో బెల్లం ఊట ఉంచినా సంబంధిత భూమి యాజమానిపైనా కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



శర్మిష్ఠకు స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

డీఎంహెచ్‌వో శర్మిష్ఠ బాధ్యతల స్వీకారం

మచిలీపట్నం టౌన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ శర్మిష్ఠ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా నుంచి ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ గీతాబాయిని ఎన్టీఆర్ జిల్లాకు బదిలీచేశారు.

ఎన్‌హెచ్ ఆర్వోపై ఎంపీ కేశినేని ఫైర్!

(5వ పేజీ తరువాయి)

భూములు, 25 ప్లాట్లను ఆక్షన్‌కు పెట్టారని, వాటిలోని టవర్లను మార్చేందుకు రైతులను నష్టపరుస్తారా అని ప్రశ్నించారు.

ఒక్క ప్రశ్నకు సమాధానం చెప్పని ఎన్‌హెచ్ ఆర్వో

ప్రజా ప్రతినిధుల ఉగ్రరూపంతో ఈ వ్యవహారంలో కీలక పాత్ర ధారి అయినటువంటి ఎన్‌హెచ్ ఆర్వో సింగ్ మారు మాట్లాడలేదు. ప్రజా ప్రతినిధులు అడిగిన ఒక్క ప్రశ్నకు కూడా ఆయన సమాధానం చెప్పలేదు. ఈ దశలో ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే జోక్యం చేసుకుని రోడ్డు సమస్యకు త్వరగా పరిష్కారం చూపాలని, ఇదే సందర్భంలో రైతుల సమస్యను కూడా తేల్చాలని చెప్పారు. ఎన్‌హెచ్ ఆర్వో సింగ్ ఏమీ మాట్లాడకుండా ఉండటంపై ప్రజా ప్రతినిధులంతా మరో మారు విరుచుకుపడ్డారు. మేఘా సంస్థతో కలిసి రైతులను పోలీసులతో అరెస్టులు చేయిస్తారా ? ఇంత ధైర్యం మీకెక్కడనుంచి వచ్చిందని నిలదీశారు. కోర్టు స్టేలు ఇచ్చిందని చెప్పినా కూడా ఖాతరు చేయరా అంటూ ప్రశ్నించారు. ఈ దశలో కలెక్టర్ లక్ష్మీశ జోక్యం చేసుకుని.. రోడ్డు సమస్య, రైతుల సమస్యను పరిష్కరించటానికి ప్రస్తుత అలైన్‌మెంట్‌లోనే రైతులు నిర్దేశించిన విధంగా టవర్లను మార్చితే సరిపోతుందిగా అని ఎన్‌హెచ్, ల్యాంకో ప్రతినిధులకు సూచించారు. ప్రజా ప్రతినిధులు, రైతు ప్రతినిధులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో అన్యమనస్కంగానే ఎన్‌హెచ్ ఆర్వో సింగ్, ల్యాంకో ప్రతినిధులు అంగీకరించారు. దీంతో తాత్కాలికంగా వివాదం సద్దుమణిగింది.

మంత్రి నిమ్మలను కలిసిన ప్రాజెక్టు కమిటీ పాలకవర్గం



మంత్రి నిమ్మలను కలిసిన ప్రాజెక్టు చైర్మన్ వీరబాబు, వైస్‌చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, పాలకవర్గం

నందిగామ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ ఇటీవల ఎన్నికైన పాలకవర్గం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాలువల అభివృద్ధి తదితర అంశాలపై సహకరించాలని కోరారు. నూతన పాలకవర్గాన్ని అభినందించి ప్రాజెక్ట్ ఆయకట్టుకు తనవంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

సజ్జలకు సిగ్గు లేదు : బ్రహ్మం చౌదరి

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సజ్జల రామకృష్ణారెడ్డి సిగ్గు లేకుండా మాట్లాడుతున్నాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం చౌదరి మండిపడ్డారు. మంగళవారం ఓ ప్రకటన చేస్తూ.. 'రాష్ట్రంలో రాజకీయాలు అసహ్యంగా మారడానికి సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కొడుకు భార్గవ్‌రెడ్డి ఒక కారణం. గత ఐదేళ్లు వైసీపీ నేతలు ప్రజల్ని హింసించినట్లు దేశంలో ఏ పార్టీ హింసించలేదు. అందుకే వైసీపీని ప్రజలు ఛీ కొట్టారు' అని బ్రహ్మం చౌదరి అన్నారు.

టిడ్కో గృహాలు ఇంకెప్పుడు?

(5వ పేజీ తరువాయి)

పక్కన పడేసింది. బిల్లులు ఇస్తే తప్ప పనులు ప్రారంభించలేమని ఆ సంస్థ చేతులెత్తేసింది. జక్కంపూడిలో ఇళ్ల నిర్మాణం చేస్తున్న ఎన్‌సీసీ సంస్థకు రూ. 25 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది. కిందటి ప్రభుత్వంలోనే దీనికి సంబంధించి బిల్లులు పెడితే ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. ఇక మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి చేపట్టిన పనులకు మరో రూ. 25 కోట్ల మేరకు డబ్బులు చెల్లించాల్సి ఉంది.

కనీస మౌలిక సదుపాయాలు కరువు

టిడ్కో ఇళ్ల వద్ద కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడంతో ఆ ఇళ్లను చూసుకోవటానికి కూడా లబ్ధిదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. జక్కంపూడిలో కొండ చుట్టూ టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ ఇళ్లకు చేరుకోవటానికి ప్రధాన రహదారి లేదు. గట్టు కింద ఎగుడు దిగుడు మార్గాల్లో వెళ్లాల్సి ఉంది. ఎలాగోలా ధైర్యం చేసి వెళ్లినా టిడ్కో ఇళ్ల దగ్గర కూడా నడిచే పరిస్థితి లేదు. టిడ్కో ఇళ్ల దగ్గర రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సదుపాయాలు వంటివి మచ్చుకు కూడా కనిపించవు. ఒక్క జక్కంపూడిలో మాత్రమే ఎస్‌టీపీ పనులు చేపట్టారు. రిజర్వాయర్ పనులు చేస్తున్నారు. మిగిలిన చోట్ల ఈ పనులు కూడా జరగటం లేదు.

బ్యాంకుల నుంచి అందని రూ.107 కోట్ల రుణం

టిడ్కో ఇళ్లకు లబ్ధిదారుని వాటా ఎప్పుడో చెల్లించారు. లబ్ధిదారుడి మీద భారం పడకుండా ఉండటానికి లబ్ధిదారుని వాటాలో కొంత మేర బ్యాంకు రుణాలు ఇప్పించేలా పట్టణ స్థానిక సంస్థలు నిర్ణయించాయి. కానీ బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదు. దీంతో ఎన్టీఆర్ జిల్లాలో రూ.107 కోట్ల మేర బ్యాంకు రుణాలు నిలిచిపోయాయి. మొత్తంగా రూ.189 కోట్ల రుణాలను బ్యాంకులు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం రూ.82 కోట్ల మేర మాత్రమే రుణాలు ఇచ్చాయి. గడువు లోపు ఇళ్లను పూర్తి చేయకపోవటం వల్ల ఇచ్చిన రుణాలకు సంబంధించి చెల్లింపులు జరపాల్సిందిగా లబ్ధిదారులకు బ్యాంకర్లు నోటీసులు ఇస్తున్నారు. ఇళ్లు తమకు అప్పగించకుండా వాయిదాలు ఎలా కడతామని లబ్ధిదారులు ప్రశ్నించారు. కిందటి ప్రభుత్వం చేసిన జాప్యానికి లబ్ధిదారులు బ్యాంకు నోటీసులను అందుకోవాల్సి వచ్చింది. టిడ్కో ఇళ్లు పూర్తయ్యే వరకు మిగులు రుణం ఇచ్చేది లేదని బ్యాంకర్లు కూడా మొండికేసి కూర్చున్నాయి.



రెడ్డిగూడెంలో విరగపూసిన మామిడి తోట


మామిడికి అకాల కష్టం!

» ప్రతికూల వాతారణంతో పూతకు తీవ్ర నష్టం
» వెంటాడుతున్న తుపానులు
» దిక్కుతోచని స్థితిలో రైతులు



ఆంధ్రజ్యోతి-రెడ్డిగూడెం : ప్రతికూల వాతావరణ పరిస్థితులతో మామిడి రైతులు విలవిల్లాడుతున్నారు. మూడేళ్లుగా ప్రతికూల వాతారణంతో మామిడి సాగు రైతుకు నష్టాలే మిగులుతున్నాయి. కనీసం ఈఏడాదైనా లాభాలు చూద్దామనుకుంటే వర్షాలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని మామిడి రైతులు దిగాలు పడుతున్నారు. నిండారుగా పూసిన మామిడి తోటలు చూసి మురిసిపోయిన రైతులకు వర్షం కారణంగా పూత మాడిపోతుంటే గుండెలు గుబేలవుతున్నాయి. వారం క్రితం ఒక తుఫాన్ తప్పిందిలే అనుకుంటే ఇప్పుడు మరో తుఫాన్ వెంటాడుతోంది. మంగళవారం కురిసిన చిరు జల్లులు మామిడి పూతకు మరింత నష్టం చేకూర్చుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి పూత నల్లబారి పిందె దశలోనే మాడిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు మండలాల్లో సుమారు 50 వేల ఎకరాలకు పైగానే మామిడి సాగవుతుంది.

వర్షంతో తీవ్ర నష్టం



- దాసరి రాంబాబు, రైతు రెడ్డిగూడెం

అకాల వర్షాలతో మామిడికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వర్షం వల్ల తెల్లపూత నల్లబారి పిందె తయారు కాదు. పైగా చీడ పీడల ఉధృతి పెరుగుతుంది. గత మూడేళ్ల నుంచి గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

ఇప్పటికే బోలెడు పెట్టుబడి పెట్టాం



- పోతురాజు బాలకృష్ణ, రైతు

ఇప్పటికే బోలెడు పెట్టుబడి పెట్టాం. మూడుసార్లు పురుగు మందులు పిచికారి చేశాం. తుఫాన్ల కారణంగా వర్షాలు పడటంతో నష్టపోతున్నాం. మావిడికి మంచి రోజులు కోసం ఎదురు చూస్తున్నాం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105,113, 124
చికెన్ విత్ స్కిన్	204
చికెన్ స్కిన్‌లెస్	214

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

పోస్టర్ ఆవిష్కరణ

చిట్టినగర్ : నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం తన చాంబర్‌లో అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అధికారులతో కలసి సంజా ఉత్సవ్ (ఎస్‌హెచ్‌జీ) మేళా-2024 పోస్టర్‌ను ఆవిష్కరించారు. 26 నుంచి 30వ తేదీ వరకు ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నగరాభివృద్ధికి డీపీఆర్ సిద్ధం

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)


రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరాభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేశామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. 8వ డివిజన్ టిక్కిల్ రోడ్డు, గీతాంజలి అపార్టుమెంట్ వీధిలో తొమ్మిది లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ యూజీడీ పనులను చేపట్టడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, వైసీపీ 5 సంవత్సరాల పాలనలో ఒక్కసారి కూడా జిల్లా అభివృద్ధి సమావేశం నిర్వహించలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదునెలలోనే ఈ సమావేశం నిర్వహించి జిల్లా అభివృద్ధి మీద చర్చించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు చెన్నుపాటి ఉషారాణి, ముమ్మనేని ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు సోంగా సంజయ్ వర్మ, డివిజన్ కార్యదర్శి మల్లె రామకృష్ణ, కృపారావు, కర్రి సురేష్, అరుణ, గిరిబాబు, నాగేశ్వరరావు, పొన్నం అనిల్, శేషగిరిరావు, సుభాషిణి, కొగంటి రామారావు, కొమటి శ్రీధర్, మల్లెల కృష్ణ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల మంజూరునకు కృషి : ఎమ్మెల్యే గద్దె

గుణదల : నిబంధనల మేర ఇంటి పట్టాలు మంజూరు చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 2వ డివిజన్‌లోని యారం వారి వీధిలోగల అంబేడ్కర్ కమ్యునిటీ హాల్లో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఇళ్ల పట్టాల అంశాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ , దాసరి గాబ్రియేల్, పడాల గంగాధర్, ముత్యాల కృష్ణ, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

భారతీనగర్ : తోటివారికి సహాయం చేయడంతో పాటు అందరితో కలిసి జీవించాలని ఆయుష్ ఆసుపత్రి చైర్మన్ యార్లగడ్డ రమేష్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గురునానక్ రోడ్డులోని న్యాక్ కల్యాణమండపంలో ఆయుష్ ఆసుపత్రి సీఎస్ఆర్ (సేవకార్యక్రమంలో) కార్యచరణలో భాగంగా 100 మంది మహిళలకు కుట్టు మిషన్ల మంగళ వారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని మహిళల జీవనోపాధికి ఇప్పటి వరకు 400 కుట్టుమిషన్లు ఉచితంగా అందజేశామన్నారు. ఆసుపత్రి ఆధ్వర్యంలో 200మంది రజకులకు ఇస్త్రీ పెట్టెలను గతంలో అందజేశామన్నారు ఆయుష్ ఆసుపత్రి చైర్మన్ యార్లగడ్డ రమేష్ మాట్లాడుతూ, గద్దె రామ్మోహన్ రాజకీయ నాయకుడు కాదని ప్రజలకు సేవ చేసే మంచి మనస్సు ఉన్న సేవకుడు అని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, ఆయుష్ హాస్పిటల్ సీఈవో డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ శ్రీమ న్నారాయణ, డాక్టర్. కె.ఎల్.వి. ప్రసాద్, కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, వేమల దుర్గారావు, రాయి రంగమ్మ, దాసరి గాబ్రియేలు, తాడి బాబురావు, గద్దె రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గద్దెను కలిసిన లయోలా వాకర్స్ సభ్యులు

లయోలా గ్రౌండ్‌లో నడవటానికి అనుమతి కోసం లయోలా వాకర్లు చేస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తమ కార్యాలయంలో కలిసి తమ సమస్యను తెలియజేశారు. వాకర్స్ సభ్యులు మాట్లాడుతూ ఇటీవల నగరంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనటానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును, ఉప సభాపతి రఘురామ రాజును కూడా కలిసి తమ సమస్యను తెలియజేశామన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ సీహెచ్ దివాకర్‌బాబు

వినియోగదారుల చట్టాలపై అవగాహన

లబ్బీపేట, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు తమ హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.దివాకర్ బాబు అన్నారు. కళాశాలలో మంగళవారం నేషనల్ కన్స్యూమర్ డే సందర్భంగా కళాశాల వాణిజ్య, మేనేజ్ మేంట్ విభాగం ఆధ్వర్యంలో కన్స్యూమర్ ప్రొటెక్షన్ లా అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారుల చట్టాలు, దోపిడీ నుంచి రక్షించడానికి, న్యాయమైన మార్కెట్ ను నిర్ధారించడానికి అమలులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి, వి.సంధ్యాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్ ధ్యానచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు

సమస్యలు పరిష్కరించాలి

నగర కమిషనర్‌కు నాలుగో డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు వినతి

భారతీనగర్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి) : నాలుగో డివిజన్‌లోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు మంగళవారం నగర కమిషనర్ ధ్యానచంద్రను తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో వివిధ కాలనీ రోడ్లు వేయాలని, ఏసీబీసీ కాలనీలోని నగర పాలక సంస్థ పాఠశాల ను ఉన్నత పాఠశాలగా కౌన్సిల్ తీర్మానం ప్రకారం అప్ గ్రేడ్ చేయాలన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

మునిసిపల్ కమిషనర్‌కు తాడిగడప ఎస్టీబీఎల్ కాలనీ వాసుల వినతి

పెనమలూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తమ కాలనీలో అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటూ తాడిగడప ఎస్టీబీఎల్ కాలనీ వాసులు మునిసిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. తమ కాలనీకి సమీపంలోనే ఉన్న కృష్ణానది నీటిని సరఫరా చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ప్రెసిడెంటు మునీశ్వరరెడ్డి, సెక్రటరీ భారతీప్రసాద్ ట్రెజరర్ మధుసూదనరావు, వైస్‌ప్రెసిడెంటు బాలకృష్ణ, జాయింట్ సెక్రటరీ స్వరూప్, టీడీపీ నాయకురాలు రత్నకుమారి ఉన్నారు.

బాక్సింగ్ క్రీడను భ్రష్టుపట్టిస్తున్నారు

ఏపీవోఏ అధ్యక్షుడికి ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఫిర్యాదు

విజయవాడస్పోర్ట్సు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో ఈ నెల 19, 20 తేదీల్లో బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరి గిన పోటీల్లో ఏపీ సెక్రటరీ లక్ష్మణ్‌దేవ్ అనుకూలమైన రౌడీషీటర్ రత్నహేమంత్ కుమార్‌ను ఆడించి బాక్సింగ్ క్రీడను భ్రష్టు పట్టించారని ఎన్టీఆర్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ వైవీఎస్ ఉమా మహేశ్వరరావు, ఏపీవోఏ అధ్యక్షుడు ఆర్కే పురుషోత్తమ్‌కు ఫిర్యాదు చేశారు. హేమంత్‌పై శ్రీకాకుళం జిల్లాలో పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్నా రన్నారు. అద్భుతంగా ఆడినా వినయ్‌ను పక్కన పెట్టి హేమంత్‌ను విజేతగా ప్రకటించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంలో చర్యలు తీసుకుని బాక్సింగ్ క్రీడను బతికించాలని ఉమామహేశ్వరరావు కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాయకాపురం: పైపుల రోడ్డు ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురైన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. హైదరాబాద్‌కు చెందిన మోర్ల స్వాతి(30)కి నున్నలో బంధువులు ఉన్నారు. నగరంలోని రైల్వే స్టేషన్‌లో దిగి అక్కడి నుంచి ఆటోలో నున్న వెళ్తుండగా మార్గ మధ్యంలో ఆటోను టిప్పర్ ఢీకొనింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం బంధువులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న పటమట లంక వాకర్స్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు

సీఎంఆర్‌ఎఫ్‌కు వాకర్స్ క్లబ్ 5 లక్షల విరాళం

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధికి విజయవాడ పటమట లంక వాకర్స్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు రూ.5 లక్షల విరాళాన్ని సీఎం చంద్రబాబుకు అందించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును అసోసియేషన్ సభ్యులు గద్దం బుచ్చారావు, మన్నెం శ్రీనివాసరావు, కడియాల మురళికృష్ణ, ద్రోణవల్లి సుధాకర్, కాట్రగడ్డ రామకోటేశ్వరరావు, కంచర్ల కోటేశ్వరరావు, ధూళిపాళ్ల కృష్ణమూర్తి కలిసి విరాళం చెక్కును అందజేశారు.



కోర్టుల వద్ద న్యాయవాదుల నిరసన ప్రదర్శన

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

న్యాయవాదుల డిమాండ్

విజయవాడ లీగల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బెజవాడ బార్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. సిటీ సివిల్ కోర్టుల వద్ద ఐదో నెంబరు రోడ్డులో న్యాయవాదులు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బెజవాడ బార్ ప్రధాన కార్యదర్శి అరిగెల శివరాంప్రసాద్ (రాజా), బార్ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం పోరాడిన మహానాయకుడైన అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా అమిత్‌షా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య భారతదేశంలో వివాదాలకు తావిచ్చే విధంగా కేంద్ర హోం మంత్రి పార్లమెంట్‌లో వాఖ్యానించడం న్యాయవాదులంతా ఖండిస్తున్నట్లు తెలిపారు. అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ కార్యవర్గసభ్యుడు కలతోటి క్రాంతి కుమార్, మాజీ బార్ అధ్యక్షుడు సంపర శ్రీనివాసరావు, బసవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోటారు కార్మికుల ప్రయోజనాలను ప్రభుత్వాలు కాపాడాలి

సత్యనారాయణపురం, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : ఆటో మోటారు వాహనాలకు లైసెన్స్‌లు, బ్రేక్ చేసే విధానాన్ని ప్రభుత్వ ఆధీనంలో ఉంచాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్రకోశాధికారి కె.దుర్గారావు అన్నారు. సిటీ ఆటో వర్కర్స్ యూనియన్, సీఐటీయూ రైల్వేస్టేషన్ పార్శిల్ ఆఫీసు ఆటోస్టాండ్ మహాసభ మంగళవారం బీఆర్‌టీఎస్ రోడ్డులోని నందూరి ప్రసాదరావు భవన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఈ నెల 27న కేంద్ర,రాష్ట్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే కార్యక్రమంలో ఆటో కార్మికులు పెద్దెత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటీ ఆటోవర్కర్స్‌యూనియన్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.హనుమంతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ , ఎస్కే దుర్గా వలి, బి.రూబెన్, ఎస్.డి. కరీముల్లా, డి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధికారులు పనిచేయాలి

గవర్నర్‌పేట: నగరపాలక సంస్థ చేపట్టిన జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా 23వ డివిజన్ కార్పొరేటర్ ఎన్.బాలస్వామి మంగళవారం డివిజన్ పరిధిలోని బీసెంట్‌రోడ్డు, మ్యూజియంరోడ్డు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 98వ వార్డు సచివాలయం పరిధిలోని హెల్ప్ ఆసుపత్రి రోడ్డు, ఆకులవారి వీధి, బీసెంట్‌రోడ్డు, ఎల్ఐసీ కార్యాల యం, మహంతి చేపల మార్కెట్ ఏరియాల్లో పర్యటించి, ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని సమస్యలు పరిష్కారమయ్యేలా అధికారులతో చర్చించి పరిష్కరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు రాజుబాబు

విద్యాసాగర్‌కు రవాణా శాఖ ఉద్యోగుల మద్దతు

కృష్ణలంక, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎన్జీఓస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యేందుకు రవాణా శాఖ ఉద్యోగుల సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నామని ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోన్-2 అధ్యక్షుడు ఎం.రాజుబాబు తెలిపారు. బందరురోడ్డులోని డీటీసీ కార్యాలయంలో మంగళవారం ఎన్టీఆర్ జిల్లా రవాణా శాఖ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో .రాజుబాబు మాట్లాడుతూ, జిల్లా ఎన్జీఓస్ సంఘంలో సుదీర్ఘకాలం పాటు పనిచేసిన అనుభవం విద్యాసాగర్‌కు వుందన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ సంఘం నాయకులు జి.ఉషాసుందరి, జోనల్ కమిటీ నాయకులు సత్యనారాయణ, రామచంద్రరాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

పటమట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : పటమటలోని సెయింట్‌పాల్ కథెడ్రల్ చర్చిలో క్రిస్మస్ వేడుకుల అంబరాన్ని అంటాయి. బిషప్ తెలగతోటి రాజారావు, మోన్సీమ్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ ఆధ్వర్యంలో సమస్త మానవాళికి ఏసుక్రీస్తు ప్రేమించి ప్రపంచానికి జ్యోతిగా నిలిచారన్నారు. చర్చిలో ప్రత్యేకంగా అలంకరించిన పూజా పీఠం రాజారావు, మువ్వల ప్రసాద్, ఉపేంద్రలో సమిష్టి దివ్య బలిపూజ సమర్పించారు. భక్తులకు దివ్యసత్ప్రసాదం అందజేశారు. చర్చి ప్రాంగణంలో బాలఏసు జననంకు సంబంధించి చిన్న కుటీరం ఏర్పాటు చేసి ఏసుప్రభువు స్వరూపాన్ని ఏర్పాటు చేశారు. పశువుల పాకలోని బాలయేసుని సందర్శించి భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బిషప్ రాజారావు, ప్రసాద్ శుభాకాంక్షలను తెలిపారు.


కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాలలో

మొగల్రాజపురం : కొమ్మారెడ్డి సీతారామయ్య సిద్ధార్థ ఫార్మశీకళాశాలలో మంగళవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రాఫ్ట్ మేకింగ్, డ్రాయింగ్, సింగింగ్ పోటీలు నిర్వహించారు. క్రీస్తు జననం నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.సునీత, నిర్వాహకురాలు టి. శారదమృణాళి తదితరులు పాల్గొన్నారు.


క్రీస్తు జననం రూపకం ప్రదర్శిస్తున్న కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ విద్యార్థులు


క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన మెస్సీయ ఫెలోషిప్ చర్చి

ఆటోనగర్ : ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్ చర్చ్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చర్చ్ ఆవరణలో క్రీస్తు పాకలో జనన సందర్భంలో నెలకొల్పిన ఏసుక్రీస్తు బొమ్మల కొలువు ఆకట్టుకుంది. సజ్జా రత్నకుమార్, డైరెక్టర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వెలిగిపోతున్న వన్‌టౌన్ చర్చి



గుణదలమాత పుణ్యక్షేత్రం



క్రిస్మస్ నైట్

విజయవాడ నగరం క్రిస్మస్ పండుగ కళను సంతరించుకుంది. పలు చర్చిలు విద్యుద్దీపాల వెలుగులో శోభాయమానంగా వెలుగొందుతున్నాయి. క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవులు చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. నగరంలో పలు చర్చిలు ముస్తాబై వేడుకలకు సిద్ధమయ్యాయి. ఆయా చర్చిల్లో అర్ధరాత్రి 1గంటల వరకు ప్రార్థనలు నిర్వహించిన తరువాత క్రైస్తవులంతా ఒకరినొకరు హ్యాపీ క్రిస్మస్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకుని వేడుకలు నిర్వహించుకున్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు.






సెయింట్ పాల్ లూథరన్ చర్చి



సెయింట్ పాల్ కథేడ్రల్ చర్చి



సెయింట్ పాల్ బెసిలికా చర్చి

గన్నవరం పీఎస్‌లో వైసీపీ నేత హల్‌చల్

● పోలీసులను దుర్భాషలాడి విధులకు ఆటంకం.. కేసు నమోదు



గన్నవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌కి వెళ్లిన ఓ వైసీపీ నేత హల్‌చల్ చేశాడు. విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిపై విరుచుకుపడ్డాడు. నోటికొచ్చినట్లు దుర్భాషలాడటమే కాక వారి విధులకు ఆటంకం కలిగించాడు. సీఐ బీవీ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం బీబీగూడెంలో ఫ్లెక్సీ వివాదం నెలకొంది. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానితులను పోలీస్ స్టేషన్‌కు పిలిచి విచారణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ నేత జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. స్టేషన్ లోపలకు వెళ్లడంతోనే ఎదురుగా ఉన్న పోలీస్ సిబ్బందిని చూసి నోటికొచ్చినట్టు దుర్భాషలాడాడు. సెంట్రీ విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ ఉందని కూడా చూడకుండా దుర్భాషలాడుతుండగా ఎస్సై శివ ప్రసాద్ కలుగజేసుకుని ఏం జరిగింది.. ఎందుకలా దుర్భాషలాడుతున్నారని ప్రశ్నించారు. దీనికి ఆయన మీకు తెలియదా అంటూ పెద్ద పెద్దగా అరుపులు, కేకలతో హల్‌చల్ చేశాడు. స్టేషన్‌లో కూర్చోపెట్టగా వైసీపీ జిందాబాద్, వైఎస్ జగన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ గందరగోళం సృష్టించాడు. విధులకు ఆటంకంతో పాటు అసభ్యంగా మాట్లాడటంపై ఎస్సై ఫిర్యాదు మేరకు పోలీసులు 79, 132 సెక్షన్లపై కేసు నమోదు చేసి విజయవాడ కోర్టుకు తరలించారు.

సకల పాపాలకు కారకుడు సజ్జల

● టీడీపీ నేత గన్నే ప్రసాద్

వన్‌టౌన్,డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సకలపాపాలకు మూల కారకుడు సజ్జల రామకృష్ణారెడ్డి అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కరోనా సమయంలో టీడీపీ కార్యకర్తలపై అక్రమంగా సోషల్ మీడియా కేసులు పెట్టారన్నారు. వైద్య పరీక్షల పేరిట కరోనా వార్డుల్లో తిప్పడం వైసీపీ నేతల రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. సజ్జల దర్శకత్వంలోనే నాడు టీడీపీ కార్యాలయంపై సంఘ విద్రోహశక్తులు దాడి చేశారన్నారు. జగన్ సైకో మనస్తత్వానికి అతడి తల్లి, చెల్లి కూడా బాధితులేనన్నారు. ప్రొద్దుటూరులో బీసీ నేత నందం సుబ్బయ్య, మాచర్లలో తోట చంద్రయ్య ఘటనలు వైసీపీ నడిపిన రక్తచరిత్రకు సాక్ష్యమన్నారు. జగన్ మోహనరెడ్డి వన్‌టైం సీఎంగా చరిత్రలో మిగిలిపోతాడని, కూటమి ప్రభుత్వం రావడంతో రాష్ట్రంలో శాంతి భద్రతలు నెలకొన్నాయన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు చట్టబద్ధంగా వ్యవహరిస్తారు గనుకనే సోషల్ మీడియాలో సైకో సైన్యాన్ని నడిపిన రామకృష్ణారెడ్డి, అతడి కుమారుడు భార్గవ్ బయట తిరగగలుతున్నారన్నారు. అధికారమదంతో విచ్చలవిడిగా చేసిన పాపాలకు చట్టబద్ధంగానే శిక్ష అనుభవించక తప్పదన్నారు.

శంకరన్ నాలెడ్జ్ సెంటర్ల ప్రకటనపై హర్షం

ధర్నాచౌక్, డిసెంబర్ 24: రాష్ట్రంలోని 104 బీసీ వసతిగృహాల్లో ఎస్.ఆర్.శంకరన్ నాలెడ్జ్ సెంటర్స్ ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడంపై ఎస్.ఆర్.శంకరన్ మోమోరియల్ కమిటీ కన్వీనర్ జల్లి విల్సన్ హర్షం వ్యక్తం చేశారు. నైపుణ్య విద్యలో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్, సోషల్ ఎమోషనల్ స్కిల్స్, నైతిక విలువలు, నీతిశాస్త్రం, డిజిటల్ లిటరెచర్ న్యాయ అవగాహన, క్రమశిక్షణ వంటి అంశాలను ఈ సెంటర్ల ద్వారా విద్యార్థులకు బోధించడం జరుగుతుందని ప్రకటించడాన్ని స్వాగతించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. నాలెడ్జ్ సెంటర్ల ప్రకటనపై కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. సాంఘిక, ఆర్థిక, సామాజిక వివక్షతకు గురవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు తదితర వర్గాలను పరిగణలోకి తీసుకుని సంక్షేమాన్ని సమగ్రంగా విస్తరించి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నేతలు విజ్ఞప్తి చేశారు. దళిత, బహుజన ఫ్రంట్ (డీబీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మేళం భాగ్యారావు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, ఇన్సాఫ్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ అప్సర్, డీబీపీఎస్ అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ నేతలు గురునాథం, పరిశపోగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు సంసిద్ధత తెలపండి

● ఏపీవోఏ అధ్యక్షుడు పురుషోత్తమ్

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 24: ఉత్తరాఖండ్‌లో వచ్చే నెల 27న ప్రారంభమయ్యే జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ క్రీడా జట్లను తీసుకెళ్లేందుకు రూ.31.50 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వానికి, శాప్ ఎండీ, ఛైర్మన్లకు వివరాలు సమర్పించినా స్పందించకపోవడం బాధాకరమని, సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే పురుషోత్తమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ నుంచి వచ్చిన ప్రతి సమాచారాన్ని వారికి ఎప్పటికప్పుడు లెటర్లు, ఇతర రూపాల్లో వివరిస్తున్నామన్నారు. శాప్‌లోని గిరిజన క్రీడాధికారి తమ అసోసియేషన్లకు ఫోన్లు చేసి వివరాలు ఇవ్వాలని అడగటం సమంజసంగా లేదన్నారు. ఐవోఏ ప్రతి సమాచారం ఏపీవోఏ ద్వారానే స్వీకరిస్తుందని, ఈ విషయంలో అధికారి అత్యుత్సాహం తగదని ఖండించారు. తాము గేమ్స్ టెక్నికల్ కండక్ట్ కమిటీ (జీటీసీసీ)కి పంపుతామని పురుషోత్తమ్ వివరించారు. నెల రోజులే ఉన్నందున సీఎం, శాప్ స్పందించాలని ఆశిస్తున్నామన్నారు. దీనిపై శాప్ వీసీ, ఎండీకి అవగాహన ఉందో.. లేదో.. అర్థం కావడం లేదన్నారు. ప్రతిసారి మమ్మల్ని తీవ్రవాదుల కన్నా ఘోరంగా చూస్తున్నారని, చివరి వరకు కిట్లు, జెర్సీలు, అవసరమైన కోచింగ్‌ల విషయంలోనూ నిర్లక్ష్యమే రాజ్యమేలుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

సైబర్ టెర్రర్..!

'ఈ'జీగా ఇరుక్కుంటున్నారు..!

● ఆన్‌లైన్ లావాదేవీలతో చిక్కులు ● 'సైబర్' నుంచి రూపాయి వచ్చినా అకౌంట్ ఫ్రీజ్
● లావాదేవీలతో ఇరుక్కుపోతున్న నగర వాసులు ● సైబర్ క్రైం పీఎస్‌కు బాధితుల క్యూ

రాంప్రసాద్ అనే ఓ ఉద్యోగికి డబ్బులు అవసరమై సహోద్యోయి వెంకట్రావును అడిగాడు. దీంతో ఆయన తన గూగుల్ పే నుంచి రూ.5వేలను రాంప్రసాద్ అకౌంట్‌కు బదిలీ చేశాడు. రెండ్రోజుల తరువాత ఇద్దరి ఖాతాలు నిలిచి పోయాయి. దీంతో వారు బ్యాంకుకు వెళ్లారు. వీరి ఖాతాలను ఉత్తరప్రదేశ్ (యూపీ) పోలీసులు స్తంభిపజేసినట్టు తెలిసింది. దీంతో వారిద్దరూ సైబర్ క్రైం పోలీసులను సంప్రదించగా వారు యూపీ పోలీసులతో మాట్లాడి అక్కడ ఓ సైబర్ నేరానికి సంబంధించిన డబ్బులు వీరి ఖాతాలకు వెళ్లాయని అందుకే ఖాతాలను నిలిపివేసినట్టు చెప్పారు. వాస్తవానికి వీరికి ఆ లావాదేవీలకు సంబంధం లేదు. ఒకసారి ఓ వ్యక్తి డబ్బులిచ్చి ఆ మొత్తాన్ని గూగుల్ పే నుంచి బదిలీ చేయించుకున్నాడు. ఆ డబ్బులు పంపిన వ్యక్తి ఖాతాలోకి సైబర్ నేరానికి చెందిన డబ్బులు జమయ్యాయి. దీంతో యూపీ పోలీసులు అతడి ఖాతాతో పాటు అతడు లావాదేవీలు జరిపిన అన్ని ఖాతాలను నిలిపివేశారు. కొద్ది రోజుల క్రితమే ఈ ఘటన జరిగింది.

ఇజ్రాయెల్‌లో ఉండే ఓ మహిళ విజయవాడలోని కుటుంబ సభ్యులకు డబ్బులు పంపించింది. ఇజ్రాయెల్ కరెన్సీని అక్కడున్న ఓ ఏజెంట్‌కు ఇచ్చి ఇండియన్ కరెన్సీలో పంపమని అకౌంట్ నంబరు ఇచ్చింది. ఆ ఏజెంట్ డబ్బులు తీసుకుని ఒక అకౌంట్ నుంచి డబ్బులు పంపాడు. కొద్దిరోజులకు ఆమె తండ్రి అకౌంట్‌తోపాటు ఆయన అకౌంట్ నుంచి డబ్బులు వెళ్లిన అన్ని అకౌంట్ల లావాదేవీలను రాజస్థాన్ పోలీసులు స్తంభింపచేశారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ



విద్యుత్‌ను ముట్టుకున్నవాడికే కాదు పక్కనున్న వాడికీ షాక్ తగులుతుంది. ఇది ఓ చిత్రంలోని డైలాగ్. డబ్బులు జమ చేయించుకున్న వారికే కాకుండా, డబ్బులు పంపిన వారికీ పోలీసులు ఫ్రీజ్ షాక్ ఇస్తున్నారు. ముక్కుముఖం తెలియని వారికి గూగుల్, ఫోన్‌పే ఉంచి డబ్బులు పంపడం, రప్పించుకోవడం చేసిన కొంతమంది ఇలాగే ఇరుక్కుపోతున్నారు. గుగూల్, ఫోన్ పేలు అందుబాటులోకి వచ్చాక నగదు చెల్లింపులు ఎక్కువగా డిజిటల్‌గా జరుగుతున్నాయి. టీస్టాల్‌లో టీ తాగినా, హోటల్‌లో టిఫిన్ చేసినా, మార్కెట్లో కూరగాయలు కొన్నా, సెలూన్ షాపు, కిరాణా షాపునకు వెళ్లినా డబ్బు చెల్లింపులు చాలా సులువుగా జరుగుతున్నాయి. వీటికి సంబంధించి గూగుల్, ఫోన్‌పేతోపాటు బీహెచ్ఐఎం, సూపర్ మనీ వంటి యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. వాట్సాప్‌లో చెల్లింపుల విధానం కూడా అందుబాటులోకి వచ్చింది. 'ఈ' చెల్లింపుల విధానం వినియోగదారులకు మంచి సులభంగా మారింది. మరోపక్క వ్యాపారులకు చిల్లర సమస్యలను తగ్గించింది. ఇదంతా నాణేనికి ఒక వైపు మాత్రమే. ఈ యాప్‌ల నుంచి విచ్చలవిడిగా ఏమాత్రం పరిచయం లేని వ్యక్తులకు డబ్బులు పంపి, వారి నుంచి స్వీకరించి ఇరకాటంలో పడుతున్నారు. వివిధ రాష్ట్రాల పోలీసులు బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేయడంతో విలవిలలాడుతున్నారు.

ఏమిటీ లేయర్స్..?

ఆన్‌లైన్ చెల్లింపుల విధానం అందుబాటులోకి వచ్చాక నగదు ఇచ్చిపుచ్చుకోవడాలు మరింత సులువుగా జరుగుతున్నాయి. బస్టాండ్లు, బ్యాంకులు, ఏటీఎంల వద్ద కొంతమంది ఎదుట వ్యక్తుల నుంచి ఎంతో కొంత అడిగి తీసుకుంటున్నారు. ఆ మొత్తాన్ని యాప్‌ల నుంచి చెల్లిస్తున్నారు. ఆ వ్యక్తి ఎవరో తెలియకపోయినా అతడి అవసరాన్ని గ్రహించి డబ్బులిస్తున్నారు. ఆ వ్యక్తి గురించిన అతడి బ్యాంక్ అకౌంట్ గురించి తెలియకపోయినా డబ్బులు సర్దుబాటు చేస్తున్నారు. అవతలి వ్యక్తుల ఖాతాలకు తగిలిన షాక్ వాటితో లావాదేవీలను నిర్వహించిన అన్ని ఖాతాలకు తగులుతోంది. సైబర్ నేరాల్లో అసలు ముఠా ఎక్కడ ఉంటుందో ఎవరికీ తెలియదు. ఎక్కడెక్కడి నుంచో వ్యవహారాలను నడిపిస్తుంటుంది. ఈ ముఠా టాస్క్ ప్రకారం కథను నడిపించడానికి ఒక వ్యవస్థ ఉంటుంది. ఇందులో ఉన్నవాళ్లంతా వివిధ వ్యక్తుల పేర్లతో బ్యాంక్ అకౌంట్లు తెరిపిస్తారు. ఇలా ఒక్కో వ్యక్తి పేరుతో వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తీసుకుంటారు. తర్వాత సైబర్ నేరగాళ్లు ఫోన్ల ద్వారా టార్గెట్ చేసుకున్న వ్యక్తుల నుంచి తీసుకునే డబ్బులను ఈ ఖాతాల్లో జమ చేయించుకుంటారు. ఈ మొత్తం ప్రక్రియను లేయర్లుగా పోలీసులు వ్యవహరిస్తున్నారు. బాధితులు జమ చేసిన డబ్బులు ఖాతాలు లేయర్-1గా ఉంటారు. ఈ ఖాతాల నుంచి డబ్బులు ఏ ఖాతాల్లోకి వెళ్తాయో వాటిని లేయర్-2గా పరిగణిస్తారు. వాటి నుంచి ఎన్ని ఖాతాలకు వెళ్తే వాటిని లేయర్-3గా చూస్తారు. ఇలా ఈ లేయర్లు ఎన్ని ఉంటాయో లెక్క ఉండదు. ఇలా సైబర్ ఛాయలున్న ఖాతాల నుంచి డబ్బులు జమ చేయించుకుంటే ఆ ఖాతాలపై ఆశలు వదలుకోవాల్సిందే. అందులో ఉన్న మొత్తం నిల్వను పోలీసులు స్తంభింపజేస్తున్నారు. విజయవాడకు చెందిన చాలామంది బ్యాంకు ఖాతాలను ముంబై, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్ పోలీసులు స్తంభింపజేశారు. మనఖాతాలో రూ.20వేలు ఉంటే, అవతలి వ్యక్తి రూ.10వేలు పంపితే ఆ నిల్వ రూ.30వేలకు చేరుతుంది. ఇలా వచ్చిన రూ.10వేలలో సైబర్ నేరానికి సంబంధించిన డబ్బులుంటే మొత్తం నగదును స్తంభింపచేస్తారు. వివిధ ప్రదేశాల్లో తెలియని వ్యక్తుల నుంచి యాప్‌ల ద్వారా డబ్బులు లావాదేవీలు జరిపిన వ్యక్తుల ఖాతాలు ఆగిపోవడంతో సైబర్ క్రైం పోలీసుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ కేసులకు సంబంధించి రోజుకు నలుగురైదుగురు సైబర్ పీఎస్‌కు వస్తున్నారు.

పరిమితంగా ఉంటే మంచిది

పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

ఆన్‌లైన్‌లో పని చాలా సులభతరం ఉంటుంది. అలాగని అన్నింటినీ విశ్వసించడం ప్రమాదం. గూగుల్‌పే, ఫోన్‌పే వంటి యాప్‌ల నుంచి డబ్బులు పంపినా, తీసుకున్నా జాగ్రత్తగా ఉండాలి. సైబర్ నేరంలో ఒక ఖాతాను ఫ్రీజ్ చేశారంటే ఆ నేరానికి సంబంధించి జమైన మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిందే. అప్పుడు మాత్రమే అకౌంట్‌ను అన్‌ఫ్రీజ్‌ను చేయాలని బ్యాంక్‌కు లేఖ రాస్తారు. మొదటి మూడు లేయర్లలోని అకౌంట్లను కచ్చితంగా ఫ్రీజ్ చేస్తారు. నాలుగో లేయర్ నుంచి ఉన్న అకౌంట్లను లీన్‌మార్క్‌గా చూస్తారు. ఈ ఖాతాలో ఎంత మొత్తంలో సైబర్ నేరాలకు సంబంధించిన డబ్బులు జమయ్యాయో ఆ మొత్తాన్ని మాత్రమే ఫ్రీజ్ చేస్తారు. ఎదుట వ్యక్తుల నుంచి డబ్బులను బదిలీ చేయించుకునేటప్పుడు ఆచితూచి వ్యవహరించడం మంచిది.

అవగాహనతోనే మోసాలకు అడ్డుకట్ట

● జాతీయ వినియోగదారుల దినోత్సవంలో మంత్రి నాదెండ్ల మనోహర్



సదస్సునుద్దేశించి ప్రసంగిస్తున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

వన్‌టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన ఉంటే మోసాలను అరికట్టవచ్చునని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల హక్కులతో పాటు సౌకర్యాల గురించి అవగాహన తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. చట్టంలో ప్రతి ఏడాది అనేక మార్పులు వస్తున్నాయన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో చట్టంపై అవగాహన లేదని, కూటమి ప్రభుత్వం అవగాహన కల్పించేందుకు అనేక చర్యలు తీసుకుంటోన్నదన్నారు. గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. చట్టాలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెస్తున్నామన్నారు. వాట్సాప్ ద్వారా రైతుల నుంచి 22.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. అయితే 24 గంటల్లోనే రూ.5,300 కోట్లు జమ చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం 75 లక్షల మందికి ఉచిత ఎల్పీజీ అందజేస్తున్నామన్నారు. ప్రధానంగా వినియోగదారుల హక్కుల గురించి మరచిపోతున్నామని వీటిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలన్నారు. మహిళల అవగాహనకు సంబంధించి కమిటీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మకాలు బాగా జరగాలని వ్యాపారస్థులు రకరకాల తప్పుడు ప్రచారాలు చేస్తారని, ఇలాంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాల్లో ఫుడ్‌ల్యాబ్‌ల ఏర్పాటుకు ముఖ్యమంత్రితో చర్చించి చర్యలు చేపడతామన్నారు. ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలకు మేలు కలిగేలా చట్టంలో మార్పులు చేశారన్నారు. పన్నుల చెల్లింపులో నిర్లక్ష్యం వద్దన్నారు. పౌరసరఫరాల కమిషనర్ వీరపాండ్యన్ అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు. జిల్లా వినియోగదారుల ఫోరమ్ ఛైర్మన్ చిరంజీవి మాట్లాడుతూ రెండున్నరేళ్లలో ఎన్టీఆర్ జిల్లాలో రూ.7 కోట్లను పరిహారం చెల్లించామన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వినియోగదారుల స్వచ్ఛంద సంస్థ సభ్యులకు మంత్రి మెమెంటోలిచ్చి సత్కరించారు. జాయింట్ కలెక్టర్ నిధి మీనా, బీఐఎస్ జేడీ రమాకాంత్, సివిల్ సప్లయిస్ అధికారులు ప్రసాద్, పాపారావు, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి

● ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

భారతీనగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ సహకారంతో శిథిలావస్థలో ఉన్న క్రిషి బాయ్స్ స్పోర్ట్స్ హాస్టల్ స్థానంలో అత్యాధునిక ఇండోర్‌స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 4వ డివిజన్‌లోని వెటర్నరీ కాలనీలో ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం పర్యటించారు. ఇందులో భాగంగా కాలనీలోని శిథిలావస్థలో ఉన్న క్రిషి బాయ్స్ స్పోర్ట్స్ హాస్టల్‌ను ఎంపీ కేశినేని శివనాథ్, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు పరిశీలించారు. కొన్నేళ్లుగా హాస్టల్ బిల్డింగ్ ఖాళీగా ఉండి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, శిథిలావస్థకు చేరిన ఈ బిల్డింగ్ ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని కార్పొరేటర్ సాంబశివరావు ఎంపీ కేశినేని శివనాథ్‌కు వివరించారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్, కాలనీ వాసులతో మాట్లాడారు. ఎవరికీ ఉపయోగం లేకుండా నిరుపయోగంగా ఉన్న ఈ హాస్టల్ స్థానంలో కాలనీవాసులతోపాటు ప్రజలందరికీ ఉపయోగపడేలా ఇండోర్ స్టేడియం నిర్మించాలని వెటర్నరీ కాలనీవాసులు ఎంపీ కేశినేని శివనాథ్‌కు విజ్ఞప్తి చేశారు. ఎంపీ కేశినేని శివనాథ్ సానుకూలంగా స్పందించి కేంద్రంతో మాట్లాడి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అలాగే వెటర్నరీ కాలనీలో కమ్యూనిటీహాల్ దగ్గర సెల్‌టవర్ నిర్మించిన బీఎస్ఎన్ఎల్ కాలనీకి నామమాత్రపు అద్దె కూడా చెల్లించడం లేదని కాలనీవాసులు ఎంపీ కేశినేని శివనాథ్‌కు తెలపగా, ఆయన బీఎస్ఎన్ఎల్ జీఎంతో మాట్లాడతానన్నారు. టౌన్‌ప్లానింగ్ సీపీ ప్రసాద్, కాలనీవాసులు నల్లూరి సుబ్బారావు, జాస్తి కృష్ణారావు, పొలసాని కృష్ణ, తుమ్మల కృష్ణారావు, యెర్నేని వేదవ్యాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ జీవనానికి క్రీస్తు బోధనలు: మాజీ మంత్రి నెట్టెం

వన్‌టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు బోధనలు ఆదర్శ జీవనానికి మార్గమని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో కేక్ కటింగ్ నిర్వహించారు.టీడీపీ ఎస్సీ సెల్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివనాథ్, నాగుల్‌మీరా ఎంఎస్ బేగ్‌తో కలిసి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ శాంతి, సౌభ్రాతృత్వాలు నెలకొనాలంటే ఎలాంటి జీవనం గడపాలన్నది క్రీస్తు బోధనలు తెలియజేస్తాయన్నారు. న్యాయం, స్వేచ్ఛ విలువలపై ఆధారపడిన సమాజ నిర్మాణానికి మనమందరం సంకల్పించాలన్నారు. క్రీస్తు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పశ్చిమ నుంచి ముస్లిం పెద్దలు టీడీపీ చేరిక

నీతి, నిజాయితీ, నమ్మకానికి ముస్లింలు మారుపేరని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పలువురు ముస్లిం పెద్దలు, స్థానికులు టీడీపీలో చేరారు. 41వ డివిజన్‌కు చెందిన గాలిబ్ షహీద్ దర్గా ప్రెసిడెంట్ మహ్మద్ ముస్తాక్ అహ్మద్ తన మద్దతు దారులు 200 మందితో కలిసి గురునానక్‌నగర్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీలో చేరారు. వీరందరినీ టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, నాగుల్‌మీరాతో కలిసి పార్టీలోకి ఆహ్వానించిన శివనాథ్ మాట్లాడుతూ ఆటోమొబైల్ రంగంలో పనిచేసిన తన కుటుంబానికి ముస్లిం సోదరులతో మంచి అనుబంధం ఉందన్నారు. పార్టీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా మాట్లాడుతూ 200 మందికి పైగా టీడీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాపుల్లా, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆషా, పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శులు బొమ్మసాని సుబ్బారావు, ఎంఎస్ బేగ్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, సీనియర్ నేత బొప్పన భవకుమార్ పాల్గొన్నారు.



ఎంపీ శివనాథ్ సమక్షంలో టీడీపీ చేరి ముస్లిం మత పెద్దలు, స్థానికులు



కలర్‌ఫుల్ కో ఆర్డ్ సెట్స్

సౌకర్యం ప్రధానంగా దుస్తులను ఎంచుకునేవాళ్లకు అత్యంత అనుకూలమైన దుస్తులు...'కో ఆర్డ్ సెట్స్'. కాలానికి తగ్గట్టు రకరకాల మెటీరియల్స్‌తో తయారయ్యే కో ఆర్డ్ సెట్స్, పిల్లలు, పెద్దలు... ఇద్దరికీ అనువైనవే! తాజాగా ట్రెండ్ అవుతున్న కొన్ని సెట్స్ మీద ఓ లుక్కేద్దాం!



కో ఆర్డినేట్ అనే పదాన్నే కురచగా కో ఆర్డ్ అని పలుకుతూ ఉంటాం. సమన్వయాన్ని దుస్తులకూ వర్తింపచేయొచ్చనే ఆలోచనతో రూపొందిన ఫ్యాషన్ ఇది. టాప్, బాటమ్ రెండిటినీ జోడిస్తూ, సరికొత్త స్టైల్‌తో రూపొందిన కొ ఆర్డ్ సెట్ అనే పోకడ ఇటీవల విపరీతంగా ఊపందుకుంది. ఈ సెట్స్ క్యాజువల్ వేర్‌గా అన్ని వయసుల వారినీ ఆకట్టుకుంటూ ఉండడం విశేషం.

కాటన్, క్రేప్, రెయాన్.. ఇలా రకరకాల మెటీరియల్స్‌లో రూపొందుతున్న కొ ఆర్డ్ సెట్స్ అన్ని కాలాలకూ అనుకూలంగా ఉంటాయి. సౌకర్యం కోసం నైట్ డ్రెస్‌లకు బదులుగా ప్రత్యామ్నాయాల కోసం వెతికే వాళ్లకు కూడా ఈ సెట్స్ ఎంతో అనువుగా ఉంటాయి.



నచ్చిన మోడల్‌లో...

ప్రింటెడ్ కొ ఆర్డ్ సెట్స్, డెనిమ్ కొ ఆర్డ్ సెట్స్, స్లీవ్‌లెస్, లాంగ్ స్లీవ్స్... ఇలా కొ ఆర్డ్ సెట్స్ ఎన్నో రకాల మోడల్స్‌లో రూపొందుతున్నాయి. వాటికి తగిన సింపుల్ జ్యువెలరీ, సాదాసీదా ఫుట్‌వేర్‌తో మ్యాచ్ చేస్తే ఆకర్షణీయమైన కొ ఆర్డ్ సెట్ లుక్‌ను సొంతం చేసుకోవచ్చు.

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

ముత్యాల ముగ్గు

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్,
జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.

ఈ-మెయిల్:
features@andhrajyothy.com

పబ్‌కు వెళతాం... క్లబ్‌కు వెళతాం... అక్కడ హోరెత్తే సంగీతానికి అలసిపోయేంతగా ఆడేస్తాం. ఆడేది మనమే అయినా ఆడించేది వేరే. అదే డీజే... డిస్క్ జాకీ. మరి డీజే అనగానే కళ్లలో మెదిలేది..! మగవారే... కదా..! కానీ ఒక అమ్మాయి... ఏరికోరి... అదీ ఎయిర్‌హోస్టెస్ ఉద్యోగం వదిలి... డిస్క్ జాకీగా దుమ్ము రేపుతోంది. రీమిక్స్‌లు... వీడియో ఆల్బమ్‌లు... దేశమంతటా ప్రదర్శనలు... ఒకటేమిటి... అన్నింట్లో అదరగొట్టేస్తోంది. డీజే పరోమా... ఉరఫ్ పరోమా చటర్జీతో 'నవ్య' ప్రత్యేక ఇంటర్వ్యూ.





దుమ్ము రేపుతోంది

"సరిగ్గా పద్నాలుగేళ్ల కిందట... కోరి సంపాదించుకున్న ఎయిర్‌హోస్టెస్ ఉద్యోగం వదిలేశాను. చదువుకొనే రోజుల్లో దాని కోసం ఎన్నో కలలు కన్నాను. పన్నెండో తరగతి తరువాత శిక్షణ తీసుకున్నాను. 2005లో జెట్ ఎయిర్‌వేస్‌లో ఎయిర్‌హోస్టెస్‌గా గగనతలంలో నా ప్రయాణం ప్రారంభమైంది. అయితే ఆ ఉద్యోగం చేస్తున్నన్ని రోజులూ ఏదో వెలితి. అందుకు కారణం... కొత్తగా ఏదో చేయాలనే తపన. అది నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. నేను కాస్త భిన్నం. సంపాదనే ధ్యేయంగా కెరీర్‌ను వెతుక్కొంటూ పరుగెత్తలేదు. నాకు సంతృప్తిగా అనిపిస్తేనే ఎందులోనైనా కాలు పెడతాను. కొనసాగుతాను. ఎయిర్‌హోస్టెస్‌గా వద్దనుకున్నాక... రెండు మూడు ఉద్యోగాలు ప్రయత్నించాను. అవీ నచ్చలేదు. చిన్నప్పటి నుంచి నాకు పాటలంటే చాలా ఇష్టం. శ్రావ్యమైన సంగీతమే కాదు... రీమిక్స్‌లవంటివి కూడా బాగా ఆస్వాదించేదాన్ని. ఆ అభిరుచినే వృత్తిగా స్వీకరిస్తే..? ఆలోచన వచ్చిన మరుక్షణం ఆచరణలో పెట్టేయాలని నిర్ణయించుకున్నాను. డిస్క్ జాకీగా అవతారం ఎత్తాను.

దేనికీ అడ్డుచెప్పలేదు...

నా అదృష్టం ఏంటంటే... నా నిర్ణయాలకు విలువనిచ్చి, ఎప్పుడూ ప్రోత్సహించే అమ్మానాన్నలు ఉండడం. వారికి నా మీద ఎంతో నమ్మకం. దేనికీ అడ్డుచెప్పరు. మాది ముంబయిలో స్థిరపడిన బెంగాలీ కుటుంబం. నేను పుట్టింది, పెరిగిందీ ముంబయిలోనే. నా అసలు పేరు పరోమా చటర్జీ. డీజేయింగ్ మొదలెట్టాక... డీజే పరోమాగా ఈ ప్రపంచానికి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. దానికి ముందు నాలుగు నెలలు డీజేయింగ్‌లో శిక్షణ తీసుకున్నా. ఆ తరువాత ఏడాది పాటు ఎన్నో కష్టాలు... సవాళ్లు. నా గురించి ఎవరికీ తెలియదు. అలాంటప్పుడు అవకాశాలు ఎలా వస్తాయి? ఎంతో ప్రయత్నిస్తే ఒకటి రెండు ఈవెంట్లు దొరికేవి. అయినా నిరాశపడలేదు. ఎందుకంటే నా సామర్థ్యంపై నాకు నమ్మకం. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేశాను.

ఐపీఎల్‌తో మొదలు...

నాకు బాగా పేరు తెచ్చింది 2014 ఐపీఎల్. దానికి అధికారిక డీజేగా వ్యవహరించాను. అతిథులతో కలిసి నెలన్నర పాటు కెమెరా ముందు కనిపించాను. దాని ద్వారా టెలివిజన్‌లో క్రికెట్ చూసే కోట్ల మందికి నా పేరు తెలిసింది. ఇది నా కెరీర్‌ను అనూహ్య మలుపు తిప్పింది. దీనికి ముందు 'సారేగమా' రెండు సీజన్లకు జ్యూరీగా వ్యవహరించాను. ఒక రకంగా ఈ షోలు నన్ను స్టార్‌ను చేశాయి. విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ తెచ్చిపెట్టాయి. డీజేయింగ్ అంటే సీడీజే (కంపాక్ట్ డిస్క్ జాకీ) సాయంతో విభిన్న సంగీతాన్ని మిక్స్ చేసే కళ. తద్వారా ప్రేక్షకులకు సరికొత్త సంగీతనుభూతిని కల్పించడం, ఉత్తేజితులను చేయడం డీజేల పని. దీని కోసం వివిధ పద్ధతులు, సాధనాలు, సాంకేతికతను ఉపయోగిస్తుంటాం. అందులో నాకంటూ ఒక ప్రత్యేకత సంపాదించుకున్నాను. దీనికి శాస్త్రీయ సంగీతం రావాల్సిన అవసరం లేదు. కానీ నేర్చుకొంటే కెరీర్‌కు ఉపయోగపడుతుంది. ఆ ఉద్దేశంతోనే రెండేళ్లు పియానో నేర్చుకున్నా. మొదట్లో పాటలు కూడా పాడేదాన్ని. కొన్ని సింగిల్ వీడియోలు కూడా విడుదల చేశాను. వాటిని యూట్యూబ్‌లో పెడితే లక్షల్లో వ్యూస్ వచ్చాయి.

అడుగడుగునా సవాళ్లు...

డీజే అనగానే ఇప్పటికీ కళ్లల్లో మెదిలేది మగవారే. వారిని దాటి అవకాశం దక్కించుకోవడమే పెద్ద విషయం. ఆ తరువాత మన ప్రతిభతో ఆకట్టుకోవాలి. నేను ఈ ప్రయాణం ప్రారంభించినప్పుడు మహిళా డీజేలు ఒకరో ఇద్దరో... అంతే! సాధారణంగా డీజే అంటే క్లబ్‌లోనో, పబ్‌ల్లోనో ఉంటాయి. అదీ రాత్రివేళల్లో. అక్కడ పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కొత్త మనుషులు, కొత్త ప్రాంతం. అలాంటిచోట, అంతమంది ముందు ఒక యువతి ప్రదర్శన ఇవ్వడమంటే అడుగడుగునా ఎన్నో సవాళ్లు, సమస్యలు. ఇవన్నీ అధిగమించి, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అక్కడున్నవారిని మెప్పించాలి. మనకంటూ ఒక ప్రత్యేకత ఉండాలి. అప్పుడే ఇక్కడ నిలబడగలుగుతాం. ఇన్నేళ్లల్లో నేను సాధించిందేంటంటే... నమ్మకం... నా మీద, నా సామర్థ్యం మీద. అందుకే ఒక్కసారి ఒక ఈవెంట్‌కు వెళితే... మళ్లీ మళ్లీ నన్ను కావాలని కోరుకొంటారు.

లక్ష్యాలంటూ లేవు...

భవిష్యత్ ప్రణాళికలు, లక్ష్యాలంటూ నాకు ఉండవు. ఇవాళ ఏముందో దాని గురించే ఆలోచిస్తాను. అవకాశం వచ్చినప్పుడు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. నన్ను చూసినవాళ్లు చాలామంది అడుగుతుంటారు... 'ఫ్యాషన్ ట్రెండ్స్‌ను అనుసరిస్తారా' అని! నేను కాస్త భిన్నం. పదిహేనేళ్ల కిందట కొన్న డ్రెస్‌లు ఇంకా నా అలమరాలో ఉన్నాయి. ఇప్పటికీ వాటిని వాడుతుంటాను. స్టయిల్ అనేది మన లోపలి నుంచి రావాలి. మనం వేసే డ్రెస్సులవల్ల కాదనేది నా అభిప్రాయం.



ఆరంభంలో ఎన్నో...

డీజేగా తొలి రోజుల్లో నాకు చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. నైట్ క్లబ్‌లోకో, పబ్‌లోకో వెళ్లినప్పుడు అక్కడి వాతావరణం ఎలా ఉంటుందనేది అస్సలు తెలియదు. ఈ ప్రాంతాల్లో మద్యం సేవించడం సాధారణం. మహిళ అనగానే కొందరు వింతగా ప్రవర్తించేవారు. పిచ్చి చూపులు చూసేవారు. ప్రతిచోటా ఇలాంటివి ఎదురవుతూనే ఉంటాయి. అయితే మనం మన పని మీద మాత్రమే శ్రద్ధ పెడితే చాలా సమస్యల నుంచి తప్పించుకోవచ్చు. మన ప్రవర్తన ఎలావుందనేది కూడా ఎంతో ముఖ్యం. డీజేగా అనుభవం గడించేకొద్దీ ఒక్కొక్కటీ అర్థం చేసుకొంటూ ముందుకు సాగుతున్నాను. ఇప్పుడు ఎలాంటి పరిస్థితిల్లోనైనా నెట్టుకురాగలననే నమ్మకం నాకుంది. ఒకవేళ పరిస్థితి మరీ శ్రుతివించితే... ఎలాగూ బౌన్సర్లు ఉంటారు. ఈ రంగంలో రాణించాలనేకొనే యువతులకు ప్రధానంగా కావల్సింది... కుటుంబ సహకారం, మద్దతు. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని. డీజే అవుతానని చెప్పినప్పుడు మొదట్లో అమ్మానాన్న భయపడ్డారు. కానీ ఇప్పుడు వారు నన్ను చూసి గర్వపడుతున్నారు.

ఇక్కడ అదే ముఖ్యం...

ఇతర డీజేలతో పోల్చినప్పుడు నా ప్రత్యేకత ఏంటని అడుగుతుంటారు. నిజం చెప్పాలంటే అందరిలా నేనూ. వాళ్లు ప్లే చేసిన పాటలే నేనూ ప్లే చేస్తాను. అయితే అక్కడున్నవారితో మన సంగీతంతో మనం ఎంతలా మమేకం అయ్యామన్నది ఇక్కడ ముఖ్యం. అలాగే వేదిక మీద మనం కనిపించే తీరు కూడా.

దేశవిదేశాల్లో ప్రదర్శనలు...

ఈ పద్నాలుగేళ్ల కెరీర్‌లో దేశవిదేశాల్లో కొన్ని వేల ప్రదర్శనలు ఇచ్చివుంటాను. భారత్‌లోని మహానగరాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయ్, సింగపూర్, భూటాన్, నేపాల్ తదితర దేశాల్లో ఎన్నో షోలు ఇచ్చాను. డీజే అంటే క్లబ్‌లు, పబ్‌లకే పరిమితం కాదు. కాలేజీ వార్షికోత్సవాలు, పండుగలు, ఉత్సవాల వంటి ఇతర ఈవెంట్లకు కూడా పిలుస్తుంటారు. ఇవాళ ఢిల్లీలో ఉంటే... రేపు హైదరాబాద్‌లో... ఇలా ప్రస్తుతం వారానికి నాలుగైదు ఈవెంట్లు చేస్తున్నాను. రీమిక్స్‌లతో వీడియో ఆల్బమ్స్ కూడా చాలా ఉన్నాయి. ఒక మహిళగా ఒకరిపై ఆధారపడకుండా ఇంతవరకు రాగలిగినందుకు గర్వపడుతున్నాను. నన్ను చూసి చాలామంది అమ్మాయిలు డీజేయింగ్‌ను కెరీర్‌గా ఎంచుకున్నారు. ఇది నేను సాధించిన పెద్ద విజయంగా భావిస్తున్నాను."

• హనుమా

ఊరించే ఉల్లికాడలు

మనం ఇష్టంగా తినే ఉల్లికాడల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. ఎ, బి, సి విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం, క్రోమియం, పాస్ఫరస్, మాంగనీస్, కాపర్ లాంటి మూలకాలు పుష్కలంగా ఉంటాయి. ఫ్రైడ్ రైస్, నూడుల్స్ వంటి ప్రత్యేక వంటకాలకు రుచిని అందించడంతోపాటు మన ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడడంలో ఉల్లికాడల పాత్ర కీలకమనే చెప్పాలి.

రక్తపోటుకి

ఉల్లికాడల్లో కేమోఫెరాల్ అనే ఫ్లేవనాయిడ్ ఉంటుంది. ఇది రక్తనాళాల్లో ఒత్తిడిని తగ్గిస్తుంది. కొవ్వు సంబంధిత అడ్డంకులను తొలగించి రక్త ప్రసరణ సాఫీగా జరిగేలా చూస్తుంది. ఉల్లికాడలను తరచూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తపోటుకి దూరంగా ఉండవచ్చు.

గుండెకి

ఉల్లికాడల్లో ప్రత్యేకమైన పీచు పదార్థాలు, ఫోలేట్స్ అధికంగా ఉంటాయి. ఇవి గుండె కొట్టుకునే వేగాన్ని నియంత్రిస్తాయి. గుండెకు నిత్యం రక్తం సరఫరా అయ్యేలా చూస్తాయి. గుండె పోటు, గుండెలో మంట తదితర సమస్యలను నివారిస్తాయి. వీటిలో కొవ్వులు, క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. తరచూ ఉల్లికాడలను చిన్న ముక్కలుగా కోసుకుని సలాడ్లలో కలుపుకుని తింటే శరీరానికి అవసరమైన సిలీనియాన్ని సమకూరుస్తాయి.

జీర్ణాశయానికి

ఉల్లికాడలు కడుపులోని ఆహారాన్ని వేగంగా జీర్ణం చేస్తాయి. ఉల్లికాడలను తరచూ తింటూ ఉంటే అజీర్తి,



మలబద్ధకం రావు. ఇవి కడుపులో ఆమ్ల తత్వాన్ని నివారిస్తాయి. ఉల్లికాడల్లోని పెక్టిన్ అనే పదార్థం పేగుల్లోని సున్నితమైన పొరలను రక్షిస్తుంది.

శరీర బరువుకి

ఉల్లికాడలను తిన్నపుడు వాటిలో ఉండే పీచుపదార్థం, ఇతర పోషకాలు కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. ఇవి జీర్ణమవడానికి కూడా సమయం పడుతుంది. దీనితో ఎక్కువగా ఆహారాన్ని తినాలనిపించదు. వీటిలో అత్యల్ప కేలరీలు ఉన్న కారణంగా జీవక్రియల వేగం పెరిగి శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

జలుబుకి

చలికాలంలో ఉల్లికాడలతో సూప్ తయారు చేసుకుని తాగితే జలుబు, దగ్గు, కఫ సమస్యలు తగ్గిపోతాయి. వీటిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు వాతావరణ మార్పుల కారణంగా వచ్చే అంటువ్యాధులను నిరోధిస్తాయి. ఉల్లికాడల్లో ఉండే హిస్టమైన్ కీళ్ల నొప్పులను నివారిస్తుంది.

ఎలా తినాలంటే

ఉల్లికాడలను చిన్న ముక్కలుగా కోసి ఇతర వంటకాలతో లేదా సూప్స్‌లో కలిపి తీసుకోవచ్చు. పెనం మీద ఆమ్లెట్ వేసిన వెంటనే దానిపై కొన్ని ఉల్లికాడల ముక్కలను పరిస్తే ఆమ్లెట్ రుచి పెరుగుతుంది. ఒక కప్పు పెరుగులో చిటికెడు ఉప్పు, చిటికెడు మిరియాలపొడి, కొన్ని ఉల్లికాడల ముక్కలు, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపితే మంచి రైతా సిద్ధమవుతుంది.

చిత్రజ్యోతి
SINCE 1965

వాళ్లకు అనుకూలంగా మార్చుకునే ప్లాన్
- విజయశాంతి



సినిమా పరిశ్రమను నాశనం చేసేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారంటూ బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు ఆరోపణలు చేయడం గర్హనీయమని సినీ నటి, కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి అన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనతో తెలంగాణ ప్రభుత్వం, చిత్ర పరిశ్రమ మధ్య దూరం పెరుగుతుందనే వాదన వినిపిస్తున్న నేపథ్యంలో విజయశాంతి స్పందించారు. 'సినిమా విడుదల సందర్భంగా జరిగిన ఈ సంఘటన దురదృష్టకరం. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో విభజన రేఖలు తెచ్చే వరకూ వెళ్తున్నట్లు ఇటీవల పరిణామాలు, ప్రెస్ మీట్లను బట్టి తెలుస్తోంది. ఈ ఘటనను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆ పార్టీకి చెందిన తెలుగు రాష్ట్రాల నేతల ప్రకటనలు ఉన్నాయి. సినీ పరిశ్రమకు అన్ని ప్రాంతాల ప్రజల ఆదరణ అవసరం. ఇలాంటి ఘటనలు జరగకుండా సినిమా పరిశ్రమ కూడా పరిశీలన చేయాలి...పరిష్కరించుకునే ప్రయత్నం జరగాలి' అని ఆమె అన్నారు.

యువతను మెప్పించే చిత్రం




అనిల్ అర్కా, విహారికా చౌదరి జంటగా తెరకెక్కిన చిత్రం 'వారధి'. శ్రీకృష్ణ దర్శకత్వంలో పెయ్యాల భారతి, ఎమ్.డి.యూనస్ నిర్మించారు. ఈనెల 27న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు శ్రీకృష్ణ మాట్లాడుతూ "ఇది భావోద్వేగాలతో నిండిన సినిమా. చాలా సహజంగా ఉంటుంది. యూత్‌ను ఆకర్షించే రొమాంటిక్ థ్రిల్లర్ ఇది" అని చెప్పారు. "భార్యభర్తల మధ్య ఉన్న బంధాన్ని అందంగా ఆవిష్కరించే చిత్రమిది" అని హీరో అర్కా అన్నారు.

మరపురాని రాజనీతిజ్ఞుడు

భారత రాజకీయాల్లో వాజపేయిది చెరిగిపోని ముద్ర

నైతిక విలువలకు కట్టుబడిన రాజకీయం.. పార్టీలకు అతీతమైన రాజనీతిజ్ఞత.. పార్లమెంటులో ఎంపీలనే కాదు.. విద్యారంగ సదస్సులో విద్యావేత్తల్ని, బహిరంగ సభల్లో సామాన్య ప్రజల్ని సైతం సమ్మోహతుల్ని చేసే ఉపన్యాస ఝరి, భిన్నత్వంలో ఏకత్వమనే భారతీయ వారసత్వ సంపదే ఈ దేశం ఆత్మ అనే తాత్విక అవగాహన.. ఇవన్నీ కలిపితే అటల్ బిహారీ వాజపేయి అవుతారు. రాజకీయ పార్టీల, సిద్ధాంతాల సరిహద్దులకు అతీతంగా గౌరవాభిమానాల్ని పొందిన అజాతశత్రువు ఆయన. వాజపేయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో ఆయన జీవితంలో స్ఫూర్తినిచ్చే ఘట్టాల అవలోకనం.



- మూడుసార్లు ప్రధానిగా దేశ సారథ్యం
- అనైతిక పద్ధతుల్లో అధికారం వద్దన్న నైతికత.. ఐదేళ్లు తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం
- రక్షణరంగం బలోపేతానికి పోఖ్రాన్
- పాక్‌తో మైత్రికి లాహోర్ బస్సు యాత్ర
- కార్గిల్ యుద్ధంతో పాక్‌కు గుణపాఠం

(సెంట్రల్ డెస్క్)

వాజపేయి దేశ ప్రధానిగా మూడు పర్యాయాలు బాధ్యతలు నిర్వర్తించారు. తొలిసారి కేవలం 13 రోజులే ఆ పదవిలో ఉండగా, రెండోదఫాలో 13 నెలలపాటు అధికారంలో ఉండటం విశేషం. మూడోసారి మాత్రం పూర్తి కాలం పాటు ప్రధాని పదవిలో కొనసాగారు. 1996లో జరిగిన సాధారణ ఎన్నికల అనంతరం బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది కానీ మెజారిటీ సమకూరలేదు. రాష్ట్రపతి ఆహ్వానంతో వాజపేయి మే నెలలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే, మెజారిటీ సంపాదించుకోలేకపోవటంతో 13 రోజుల వ్యవధిలోనే ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి బదులిస్తూ.. 'పార్టీలను చీల్చి కొత్త భాగస్వాములతో కలిసి అధికారాన్ని చేపట్టటం నా లక్ష్యం కాదు. ఆ విధంగా దక్కిన అధికారాన్ని నేను కనీసం పట్టకారుతో కూడా తాకటానికి ఇష్టపడను' అంటూ వాజపేయి చేసిన ప్రసంగం ఆయన కట్టుబడిన నైతిక విలువలకు అద్దం పట్టింది. ప్రధానిగా ఆయన తొలిదఫా ప్రభుత్వమిది. అయినప్పటికీ, అనైతికమార్గాల్లో ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవటానికి వాజపేయి ఎంతమాత్రం ప్రయత్నించలేదు. రెండోసారి కూడా అంతే. రెండేళ్ల వ్యవధిలోనే 1998లో మళ్లీ లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కూడా బీజేపీకి మెజారిటీ దక్కనప్పటికీ అతిపెద్ద పార్టీగా నిలిచింది. పలు పార్టీల మద్దతుతో కలిసి వాజపేయి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కానీ, మరుసటి ఏడాదే అన్నాడీఎంకే కూటమి నుంచి వైదొలిగింది. విశ్వాస పరీక్షలో కేవలం ఒక్క ఓటు తేడాతో ప్రభుత్వం ఓడిపోయి.. వాజపేయి రాజీనామా చేశారు. అదే ఏడాది మళ్లీ లోక్‌సభ ఎన్నికలు జరిగాయి (రెండేళ్లలో మూడుసార్లు). ఈ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ 303 సీట్లతో మెజారిటీ సాధించి తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ ప్రభుత్వం 2004 వరకూ కొనసాగింది. కేంద్రంలో కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఐదేళ్లపాటు విజయవంతంగా నడిపించిన తొలి నేత వాజపేయి.

కార్గిల్ విజయం

వాజపేయి హయాంలో జరిగిన కార్గిల్ యుద్ధం.. భారత సైన్యం చరిత్రలో ఒక చరిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. 1999 మే నెలలో పాకిస్థాన్ సైనికులు, మిలిటెంట్లు కార్గిల్ పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల్లో చొరబాట్లు, ఆక్రమణ ప్రారంభించారు. దీనిని తిప్పికొట్టటానికి మే నెల 26న భారత సైన్యం ఆపరేషన్ విజయ్‌ను ప్రారంభించింది. 3 నెలల పాటు జరిగిన యుద్ధంలో 500 మందికిపైగా జవాన్లు అమరులయ్యారు. కార్గిల్ విజయంతో వాజపేయి ప్రతిష్ఠ పెరిగిపోయింది.

పోఖ్రాన్ అణుపరీక్షలు

1998 మే నెలలో వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలోనే భారత్.. రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఎడారి ప్రాంతంలో ఐదు భూగర్భ అణుపరీక్షలు నిర్వహించి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. శత్రుదేశాల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. 1974లో భారత్ తొలి అణుపరీక్ష నిర్వహించగా.. మళ్లీ 24 ఏళ్ల తర్వాత పోఖ్రాన్‌లో ఆ పరీక్షలు జరిపి తన అణ్వాయుధ పాటవాన్ని యావత్ ప్రపంచం ఎదుట చాటిచెప్పింది.

నెహ్రూనే కట్టిపడేసిన ప్రసంగం

వక్తగా వాజపేయి పార్టీలకు అతీతంగా అభిమానుల్ని సంపాదించుకున్నారు. 1957లో ఎంపీగా వాజపేయి లోక్‌సభలో తొలిసారి చేసిన ప్రసంగం నాటి ప్రధాని నెహ్రూను అమితంగా ఆకర్షించింది. ఎంతగానంటే.. అప్పట్లో భారత సందర్శనకు వచ్చిన ఓ విదేశీ నేతకు ఎంపీలను పరిచయం చేస్తూ.. వాజపేయి దగ్గరికి వచ్చేసరికి 'ఈ యువకుడు ఏదో ఒకనాడు భారతదేశ ప్రధానమంత్రి అవుతారు' అని నెహ్రూ చెప్పారట. పార్లమెంటులోని సౌత్‌బ్లాక్ నుంచి నెహ్రూ ఫొటోను తొలగించటంపై వాజపేయి అసంతృప్తి వ్యక్తం చేస్తూ తిరిగి ఆ ఫొటోను అక్కడే ఏర్పాటు చేయించారు. పార్టీలకు అతీతంగా ఆయన వ్యవహరిస్తారనటానికి ఇదొక ఉదాహరణ. వాజపేయి కవి కూడా. స్వయంగా పలు కవితలు రాసిన ఆయన ప్రసంగాల్లోనూ కవితాత్మక ధోరణి కనిపించేది. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో విపక్షనేతగా ఉన్న వాజపేయిని జెనీవాలో జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశాలకు భారత ప్రతినిధిగా పంపించారు. వాజపేయి సామర్థ్యంపై పీవీకి ఉన్న నమ్మకానికి ఇది ఒక నిదర్శనంగా భావిస్తారు. దేశ విభజన జరిగిన భారత్-పాకిస్థాన్‌లుగా విడిపోయిన తర్వాత తొలిసారిగా రెండు దేశాల మధ్య బస్సు సర్వీసును వాజపేయి హయాంలోనే ప్రారంభించారు. ఢిల్లీ-లాహోర్ బస్సును ప్రారంభిస్తూ 1999 ఫిబ్రవరిలో వాజపేయి స్వయంగా పాకిస్థాన్‌కు బస్సులో వెళ్లారు. ఈ బస్సు యాత్ర పాకిస్థాన్‌తో సంబంధాలను మెరుగుపరిచింది. వాజపేయి, నాటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ సంయుక్తంగా లాహోర్ డిక్లరేషన్‌ను ప్రకటించారు.

చర్చలే అత్యుత్తమ మార్గం

వాజపేయి ఉత్తమ పార్లమెంటేరియన్లలో ఒకరిగా పేరుగాంచారు. ఆయన ఎల్లప్పుడూ చర్చలు, ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నాలు చేసేవారు. అధికార పక్షం విపక్షాల గొంతు నొక్కటాన్ని ఆయన సమర్థించేవారు కాదు. అలాగే, విపక్షం పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకుంటూ వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన చేపట్టటాన్నీ ఆమోదించేవారు కాదు. పత్రికా స్వాతంత్ర్యానికి వాజపేయి అమిత ప్రాధాన్యతనిచ్చేవారు. 2003లో ప్రముఖ ఆంగ్ల దినపత్రిక హిందూ 125వ వార్షికోత్సవంలో మాట్లాడుతూ, 'భారత ప్రజాస్వామ్యంలో పత్రికాస్వేచ్ఛ విడదీయరాని భాగం. దానికి రాజ్యాంగం రక్షణ కల్పిస్తోంది. ఈ దేశ సంస్కృతి భావవ్యక్తీకరణ స్వేచ్ఛను గౌరవించటమే కాదు.. స్వయంగా భిన్నాభిప్రాయాలకు అండగా ఉంటుంది. భిన్న వాదనలను ప్రోత్సహిస్తుంది' అని చెప్పారు.

విరాట్.. ఈసారైనా?

బాక్సింగ్‌డే టెస్టు రేపటి నుంచి ఉ.5 గం. నుంచి ప్రత్యక్ష ప్రసారం



మెల్‌బోర్న్: విరాట్ కోహ్లీ ఎలా ఆడుతున్నాడు? అని ఎవరిని అడిగినా.. ఆఫ్ స్టంప్‌నకు అవలగా వెళ్తున్న బంతిని వేటాడి మరీ వికెట్ సమర్పించుకుంటాడని చెబుతుంటారు. అతడి ఈ బలహీనత ఈనాటిది కాదు. చాలా ఏళ్లుగా చూస్తున్నదే. తాజాగా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలోనూ ఇదే రీతిన పెవిలియన్‌కు చేరుతూ అభిమానులను నిరుత్సాహపరుస్తున్నాడు. 25 ఇన్నింగ్స్‌ల తర్వాత పెర్త్ టెస్టులో ఓ శతకం బాది మురిపించినా.. ఆ తర్వాత 7, 11, 3 స్కోర్లతో విఫలమయ్యాడు. విరాట్ ఆడుతున్న తీరుపై కెప్టెన్ రోహిత్‌ను మంగళవారం విలేకరులు అడగ్గా.. అతడు తన సహచరుడికి గట్టి మద్దతే ఇచ్చాడు. ప్రపంచ అత్యుత్తమ క్రికెటర్ తన బలహీనతను ఎలా అధిగమించాలో కూడా తెలుసని తేల్చాడు. అదే సమయాన విరాట్ మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఆఫ్ స్టంప్‌నకు అవలిగా వెళుతున్న బంతులను వదిలేస్తూ, నేరుగా వచ్చే బాల్స్‌ను ఆడడంపై ఎక్కువగా దృష్టి సారించాడు. ప్రాక్టీస్ పదేపదే ఆఫ్ స్టంప్స్ వేసిన లెంగ్త్ బంతులను కోహ్లీ అసలు పట్టించుకోలేదు. ఇలా ఈసారి తన బలహీనతను వంద శాతం అధిగమించేందుకు విరాట్ పట్టుదల చూపాడు. తన బ్యాటింగ్‌లో లోపాన్ని సరిచేసుకునేందుకు యుద్ధం చేస్తున్న ఈ స్టార్ బ్యాటర్ రాబోయే రెండు టెస్టుల్లో ఆసీస్ బౌలర్ల భరతం పట్టాలని కోరుకుంటున్నారు. గతంలో సచిన్ కు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైనప్పటికీ పట్టుదలతో ఆ సమస్యను విజయవంతంగా అధిగమించాడు. ఎస్‌సీజీ పిచ్ బ్యాటింగ్‌కు కూడా సహకరించే అవకాశం ఉండడంతో విరాట్ ఓపిగ్గా క్రీజులో నిలిచి పరుగుల వరద పారించాలని ఆశిద్దాం.

టాప్‌షోతో సిరీస్


హర్లీన్ డియోల్ (115)

హర్లీన్ శతకం
భారత్ రికార్డు స్కోరు
మాథ్యూస్ సెంచరీ వృథా
రెండో వన్డేలో విండీస్ చిత్తు

వడోదరా: భారత మహిళల జట్టు భీకర ఫామ్‌ను కొనసాగిస్తోంది. వెస్టిండీస్‌తో మంగళవారం జరిగిన రెండో వన్డేలోనూ టాపార్డర్ బ్యాటర్లు కదం తొక్కడంతో వన్డేల్లో తమ అత్యధిక స్కోరును నమోదు చేసింది. హర్లీన్ డియోల్ (115) కెరీర్‌లో తొలి శతకం బాదగా, ఓపెనర్లు ప్రతీక రావల్ (76), స్మృతి మంధాన (53), జెమీమా (52) అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో భారత్ 115 పరుగుల తేడాతో నెగ్గి మూడు మ్యాచ్‌లుండగానే సిరీస్‌ను 2-0తో దక్కించుకున్నట్టయింది. ముందుగా భారత్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 358 పరుగులు చేసింది. గతంలో ఐర్లాండ్‌పై కూడా ఇన్నే పరుగులు సాధించి రికార్డు నెలకొల్పింది. ఈ ఫార్మాట్‌లో మహిళల జట్టు 350+ స్కోర్లు చేయడం ఇది రెండోసారి. అద్భుత ఫామ్‌లో ఉన్న మంధాన.. ప్రతీకతో కలిసి తొలి వికెట్‌కు 110 పరుగులు జత చేసింది. ఆ తర్వాత హర్లీన్ సెంచరీతో ఎదురుదాడికి దిగడంతో పాటు జెమీమాతో కలిసి నాలుగో వికెట్‌కు 116 పరుగులు జత చేయడం విశేషం. భారీ ఛేదనలో విండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ (106) సైతం శతకంతో పోరాడినా.. 46.2 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. ప్రియామిశ్రా మూడు, ప్రతీక, దీప్తి, టిటాస్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

సంక్షిప్త స్కోర్లు
భారత్: 50 ఓవర్లలో 358/5 (హర్లీన్ 115, ప్రతీక 76, మంధాన 53, జెమీమా 52, జోసెఫ్ 1/27). వెస్టిండీస్: 46.2 ఓవర్లలో 243 ఆలౌట్ (మాథ్యూస్ 106, క్యాంప్‌బెల్ 38, ప్రియా మిశ్రా 3/49, ప్రతీక 2/37).

షెడ్యూల్ వచ్చేసింది

ఫిబ్రవరి 19 నుంచి చాంపియన్స్ ట్రోఫీ
23న భారత్-పాక్ మ్యాచ్

దుబాయ్: వచ్చే ఏడాది పాకిస్థాన్‌లో జరిగే చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ జరుగనుంది. ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న సీటీలో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయి. వీటిని రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-ఎలో భారత్, పాక్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ ఉండగా.. గ్రూప్-బిలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, అఫ్ఘానిస్థాన్ ఉన్నాయి. ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య పాక్ జట్టు కివీస్‌తో తలపడనుంది. ఇక అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూసే భారత్-పాక్ పోరు ఫిబ్రవరి 23న దుబాయ్‌లో ఆరంభించనుంది. భద్రతా కారణాల రీత్యా భారత జట్టు పాక్‌లో పర్యటించేందుకు ఇష్టపడకపోవడంతో ఈ టోర్నీ హైబ్రిడ్ పద్ధతిన సాగనున్న విషయం తెలిసిందే. ఈమేరకు భారత్ ఆడే గ్రూప్ మ్యాచ్‌లను దుబాయ్‌లో నిర్వహిస్తారు. షెడ్యూల్ ప్రకారం పాక్‌లో జరిగే మ్యాచ్‌లకు లాహోర్, కరాచీ, రావల్పిండి వేదికలు కానున్నాయి. సెమీఫైనల్స్ దుబాయ్, లాహోర్‌లో జరుగుతాయి. ఒకవేళ భారత్ సెమీస్, ఫైనల్‌కు వస్తే ఆ మ్యాచ్‌లను దుబాయ్‌లోనే నిర్వహిస్తారు. మరోవైపు రెండు సెమీస్, ఫైనల్‌కు రిజర్వ్ డేలు ఉంటాయి. మొత్తం 15 మ్యాచ్‌లూ ఫ్లడ్‌లైట్ల వెలుతురులోనే జరుగుతాయి.


భారత్ షెడ్యూల్

ఫిబ్రవరి 20	భారత్ X బంగ్లాదేశ్	దుబాయ్
ఫిబ్రవరి 23	భారత్ X పాక్	దుబాయ్
మార్చి 2	భారత్ X కివీస్	దుబాయ్

అండర్-19 ప్రపంచకప్‌కు త్రిష, షబ్నమ్

న్యూఢిల్లీ: కౌలాలంపూర్‌లో వచ్చేనెల 18 నుంచి జరిగే అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్‌లో పోటీపడే భారత జట్టును మంగళవారం ప్రకటించారు. నిక్కీ ప్రసాద్ సారథ్యంలోని 15 మంది సభ్యుల ఈ జట్టులో తెలుగమ్మాయిలు గొంగిడి త్రిష, షబ్నమ్ షకీల్, కేసరి ధృతి ఎంపికయ్యారు. భద్రాచలంకు చెందిన బ్యాటర్ త్రిష, గతవారం అండర్-19 ఆసియా కప్‌లో భారత యువ జట్టు చాంపియన్‌గా నిలవడంలో కీలకపాత్ర పోషించింది. ఇక, విశాఖపట్నానికి చెందిన షబ్నమ్ ఇప్పటికే జూనియర్ స్థాయిలో వివిధ టోర్నీల్లో సత్తా చాటుకుంది. మొత్తం 16 జట్లు నాలుగు గ్రూపులుగా విడిపోయి తలపడనున్న ఈ ప్రపంచకప్ ఫైనల్ ఫిబ్రవరి రెండున జరుగనుంది. భారత్.. ఆతిథ్య మలేసియా, వెస్టిండీస్, శ్రీలంకతో కలిసి గ్రూప్-ఎ నుంచి బరిలోకి దిగుతోంది.


సింధు రిసెప్షన్‌కు హాజరైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



ఘనంగా సింధు వివాహ రిసెప్షన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, యువ వ్యాపారవేత్త వెంకట దత్తసాయి వివాహ రిసెప్షన్ ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకకు క్రీడా, రాజకీయ, సినీ ప్రముఖులు తరలివచ్చారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే హరీశ్ రావు, సినీ స్టార్లు చిరంజీవి, నాగార్జున, అజిత్, టెన్నిస్ ఏస్ సానియా మీర్జా, చాముండేశ్వర్ నాథ్ తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో సింధు, వెంకట దత్తసాయి వివాహం గత ఆదివారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగిన సంగతి తెలిసిందే.

దరఖాస్తులో తప్పులు దొర్లాయేమో!

'ఖేల్‌రత్న' వివాదంపై మను భాకర్



న్యూఢిల్లీ: జాతీయ క్రీడా అవార్డుల సిఫారసుల్లో ఏస్ షూటర్ మను భాకర్ పేరు లేకపోవడం వివాదాస్పదమైంది. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన మనును ఈసారి ప్రతిష్ఠాత్మక ఖేల్‌రత్న అవార్డుకు ఎంపిక చేస్తారని అందరూ భావించారు. కానీ, ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ఆమె పేరు లేకపోవడం షాక్‌కు గురి చేసింది. క్రీడా వర్గాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నష్టనివారణ చర్యల్లో భాగంగా అవార్డుల తుది జాబితా ఇంకా ఖరారు కాలేదని క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. మరోవైపు ప్రభుత్వ తీరుపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను తగ్గించేందుకు మను స్వయంగా రంగంలోకి దిగినట్టుగా ఉంది. 'నా దరఖాస్తులోనే ఏమైనా లోపాలు ఉండి ఉండవచ్చు' అని అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టింది. తన అవార్డుకు సంబంధించిన ఊహాగానాలను పట్టించుకోవద్దని అందరికీ విజ్ఞప్తి చేసింది. కాగా, హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారాలింపిక్స్ స్వర్ణ పతక విజేత ప్రవీణ్ కుమార్ పేర్లను ఖేల్‌రత్న అవార్డులకు ఎంపిక చేసినట్టు సమాచారం.

సానియాతో షమి పెళ్లంటూ ఫేక్ ప్రచారం



ముంబై: టీమిండియా పేసర్ మహ్మద్ షమి, మాజీ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా పెళ్లి చేసుకున్నారా? వీళ్లిద్దరూ కలిసి పెళ్లి దుస్తుల్లో ఉన్న ఫొటోలు రెండ్రోజులుగా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇప్పుడీ వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. నిజంగానే వీరికి నిఖా జరిగిందా? అంటే అది అబద్ధమని తేలింది. కొందరు ఆకతాయిలు.. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో ఇద్దరి ఫొటోలను ఒకటిగా చేర్చి పెళ్లి చేసేశారు. సానియాతో పెళ్లి వార్తలను షమి గతంలోనే ఖండించాడు. పాక్ క్రికెటర్ షోయబ్ మాలిక్‌తో విడాకుల తర్వాత సానియా తన కుమారుడితో కలిసి దుబాయ్‌లో నివసిస్తోంది. మరోవైపు షమి తన సతీమణి హసీన్ జహాతో విడిపోయి ఒంటరిగా ఉంటున్నాడు. దీంతో వీళ్లిద్దరూ పెళ్లి చేసుకున్నారంటూ కొందరు సోషల్ మీడియాలో వదంతులను వ్యాప్తి చేస్తున్నారు.

నిలకడగా కాంబ్లీ ఆరోగ్యం



థానే: తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన టీమిండియా మాజీ క్రికెటర్ వినోద్‌కాంబ్లీ కోలుకుంటున్నాడు. కాంబ్లీ ఆరోగ్యం నిలకడగా ఉందని, మరో రోజులో ఐసీయూ నుంచి సాధారణ వార్డు కు తరలిస్తామని వైద్యులు మంగళవారం వెల్లడించారు.

పాత కార్లపై జీఎస్‌టీ..

తరుగుదల అనంతర నికర విలువ కంటే అధిక ధరకు విక్రయిస్తేనే..



న్యూఢిల్లీ: పాత లేదా వాడిన కార్లను విక్రయించే సందర్భంలో ఆర్జించిన లాభంపైనే జీఎస్‌టీ వర్తిస్తుందని పన్ను నిపుణులు చెబుతున్నారు. అంటే, వాహన ధరలో తరుగుదల సర్దుబాటు అనంతర నికర విలువ కంటే అధిక మొత్తానికి విక్రయించగా ఆర్జించిన లాభంపై జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. పాత లేదా వాడిన వాహనాల (ఎలక్ట్రిక్ వెహికల్స్ సహా) విక్రయాలపై ఇకపై ఏకరీతిగా 18 శాతం జీఎస్‌టీ విధించాలని గత శనివారం సమావేశమైన జీఎస్‌టీ మండలి నిర్ణయించింది. ఆదాయ పన్ను చట్టం 1961లో సెక్షన్ 32 కింద తరుగుదలను క్లెయిమ్ చేసుకున్న రిజిస్టర్డ్ వ్యక్తులు లేదా విక్రేతలకు మాత్రమే ఇది వర్తిస్తుంది. ఒకవేళ ఒక వ్యక్తి మరో వ్యక్తికి పాత కారును విక్రయించిన సందర్భంలో మాత్రం జీఎస్‌టీ వర్తించదు. కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం..

- రిజిస్టర్డ్ వ్యక్తి లేదా విక్రేత ఎవరైనా తన వాహనాన్ని రూ.15 లక్షలు విక్రయించారని అనుకుందాం. ఆ వాహనం అసలు ఖరీదు రూ.20 లక్షలు. కాగా, ఇప్పటికే కారుపై రూ.8 లక్షల తరుగుదలను క్లెయిమ్ చేశాడనుకుంటే, నికర విలువ రూ.12 లక్షలు అవుతుంది. ఈ సందర్భంలో వాహన విక్రయ ధర (రూ.15 లక్షలు), తరుగుదల అనంతర నికర విలువ (రూ.12 లక్షలు) మధ్య వ్యత్యాసం రూ.3 లక్షలపై 18 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.
- రిజిస్టర్డ్ వ్యక్తి లేదా విక్రేత రూ.20 లక్షల కారుపై ఇప్పటికే రూ.8 లక్షల తరుగుదల క్లెయిమ్ చేసుకోగా రూ.12 లక్షల నికర విలువ చేసే కారును రూ.10 లక్షలకే విక్రయించాడనుకుంటే, ఈ సందర్భంలో నికర విలువ కంటే విక్రయ ధర తక్కువగా ఉంది కాబట్టి ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.

సినిమా థియేటర్లలో విక్రయించే పాప్‌కార్న్‌పై 5 శాతం పన్ను

సినిమా హాళ్ల లేదా ఇతర ప్రాంతాల్లో లూజుగా విక్రయించే పాప్‌కార్న్‌పై 5 శాతం జీఎస్‌టీ వర్తిస్తుందని ప్రభుత్వ వర్గాలు స్పష్టత నిచ్చాయి. ఒకవేళ పాప్‌కార్న్‌ను సినిమా టికెట్‌తో కలిపి విక్రయిస్తే, దాన్ని కాంపోజిట్ సప్లైగా పరిగణించి, అందుకు వర్తించే పన్ను రేటును వసూలు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. పాప్‌కార్న్‌పై వర్తించే పన్ను రేటుపై జీఎస్‌టీ మండలి గత సమావేశంలో స్పష్టత నిచ్చింది. ఉప్పు, మసాలా దినుసులు కలిసిన పాప్‌కార్న్‌ను ప్రస్తుతం నమ్‌కీన్‌గా పరిగణిస్తున్నారు. కాబట్టి ఈ పాప్‌కార్న్ లూజు విక్రయంపై 5 శాతం పన్ను వర్తిస్తుంది. ప్రీ-ప్యాకేజ్డ్, లేబుల్‌తో విక్రయిస్తే మాత్రం 12 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని మండలి స్పష్టం చేసింది. చక్కెర కలిపిన (క్యారమెలైజ్డ్) పాప్‌కార్న్‌పైన 18 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.

కొత్త ఏడాది ఐటీలో నియామకాల జోరు

డేటా సైన్స్, ఏఐ నిపుణులదే హవా

- ద్వితీయ శ్రేణి నగరాల వైపు కంపెనీల చూపు
- 2024లో 7% తగ్గిన నియామకాలు



ఈ సంవత్సరం (2024) దేశీయ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగానికి చేదు అనుభవమే మిగిల్చింది. రాజకీయ, ఆర్థిక అనిశ్చితితో అమెరికా, యూరోపియన్ కంపెనీలు ఐటీ ఖర్చులు తగ్గించేశాయి. దాంతో ఈ దేశాల నుంచి భారత కంపెనీలకు వచ్చే ఐటీ ప్రాజెక్టులు తగ్గిపోయాయి. ఈ దెబ్బతో దేశీయ ఐటీ కంపెనీల్లో గత ఏడాది (2023)తో పోల్చితే ఈ ఏడాది నియామకాలు 7 శాతం తగ్గాయి. ఇది కూడా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ) ఆదుకోబట్టి మాత్రమే సాధ్యమైంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు జరిగిన ఐటీ కొలువుల నియామకాల్లో 52.6 శాతం వాటా జీసీసీలదే. కొత్త ప్రాజెక్టులు పెద్దగా రాకపోవడంతో ఐటీ కంపెనీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు భారీగా తగ్గించాయి. కొన్ని కంపెనీలైతే ఎంపికైన అభ్యర్థులకు ఇచ్చిన ఆఫర్ లెటర్లనే ఏడో ఒక పేరుతో వెనక్కి తీసుకున్నాయి. లేదా ఉలుకూ పలుకూ లేకుండా సస్పెన్స్‌లో పెట్టాయి. దేశీయ ప్రముఖ ఐటీ కంపెనీలు కూడా 2023తో పోలిస్తే ఈ ఏడాది ఫ్రెషర్ల నియామకాలు రెండు నుంచి 15 శాతం మాత్రమే పెంచాయి.

కొందరికే డిమాండ్

ఈ సంవత్సరం ఐటీ రంగంలో నియామకాలు తగ్గినా కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి డొమైన్స్‌లో పట్టున్న నిపుణులకు మాత్రం మంచి అవకాశాలే లభించాయి. ఈ నైపుణ్యాలున్న ఉద్యోగుల నియామకాలు గత ఏడాదితో పోలిస్తే 2024లో 39% పెరిగాయి. ఈ డొమైన్స్‌లో పట్టున్న నిపుణులు దొరక్క చాలా ఐటీ కంపెనీలు ఉన్న ఉద్యోగులకే పెద్దఎత్తున శిక్షణ ఇస్తున్నాయి. ఇక మంచి అనుభవం ఉన్న మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగుల నియామకాలూ గత ఏడాదితో పోలిస్తే 35% పెరిగాయి.

మారిన కంపెనీల వైఖరి

ఐటీ కంపెనీల వైఖరిలోనూ మార్పు కనిపిస్తోంది. గతంలో ఈ కంపెనీలు బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి మెట్రో నగరాలపైనే దృష్టి పెట్టేవి. ఇప్పుడు కంపెనీలు ఇప్పుడు ద్వితీయ శ్రేణి నగరాలపైనా దృష్టి పెడుతున్నాయి. ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు స్థానికంగా నిపుణులైన ఉద్యోగుల షుష్కలంగా దొరకడమూ ఇందుకు కారణం. దీంతో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సెప్టెంబరు త్రైమాసికంలో ద్వితీయ శ్రేణి నగరాల్లోని ఐటీ కంపెనీల నియామకాలు 48 శాతం పెరిగాయి.

ఆశలన్నీ 2025పైనే

భారత ఐటీ కంపెనీలకు 2025 సంవత్సరం మాత్రం ఆశావహంగానే కనిపిస్తోంది. అతిపెద్ద మార్కెట్ అయిన అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు ముగియడం, యూరోపియన్ ఆర్థిక వ్యవస్థలు గాడినపడటం ఇందుకు ప్రధాన కారణం. దీంతో వచ్చే జనవరి నుంచి పెద్ద కంపెనీలకు మళ్లీ ప్రాజెక్టుల రాక పెరుగుతుందని టీమ్ లీజ్ ఎడ్‌టెక్ సీఈఓ జైదీప్ కేవలరమణి తెలిపారు. ఆ తర్వాత చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలకు వచ్చే ప్రాజెక్టులూ పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఐటీ కంపెనీలు ఇప్పటికే డేటా సైన్స్, ఏఐ, ఎంఎల్ నిపుణుల కోసం అన్వేషణ ప్రారంభించాయి. వ్యాపార అవకాశాలను దొరక పుచ్చుకోవాలంటే ఏఐ వంటి అధునాతన టెక్నాలజీలను వేగంగా అందిపుచ్చుకోక తప్పదని విప్రో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీఓ) సంధ్యా అరుణ్ చెప్పడం విశేషం. ఈ విషయంలో ఏ మాత్రం వెనకబడ్డా ఐటీ రంగంలో మనుగడ కష్టమన్నారు. దీంతో ఈ అధునాతన టెక్నాలజీలపై పట్టున్న నిపుణుల నియామకాలు గత ఏడాదితో పోలిస్తే 2025లో 30 నుంచి 35 శాతం వరకు పెరుగుతాయని మార్కెట్ వర్గాల అంచనా. ఐటీ పరిశ్రమ మొత్తంగా చూసినా 2025లో నియామకాలు 15 నుంచి 20 శాతం పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే ఏఐ, ఎంఎల్ టెక్నాలజీల కారణంగా ఐటీ రంగంలో కొన్ని ఉద్యోగాలు మాయమయ్యే ప్రమాదమూ పొంచి ఉంది.

జనవరి 28న విచారణకు రండి

సెబీ చీఫ్‌కు లోక్‌పాల్ నోటీసు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ వ్యవహారంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్, ఆమె భర్తపై వచ్చిన అవినీతి ఆరోపణల విషయంలో వాంగ్మూలం ఇచ్చేందుకు జనవరి 28వ తేదీన తన ముందు హాజరు కావాలని లోక్‌పాల్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆమెపై ఫిర్యాదు చేసిన టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా సహా ఫిర్యాదుదారులకూ హాజరు కావాలంటూ లోక్‌పాల్ కార్యాలయం సమన్లు జారీ చేసింది. లోక్‌సభ సభ్యురాలైన మొయిత్రా, మరో ఇద్దరు దాఖలు చేసిన అవినీతి, ప్రయోజన వైరుధ్యం ఆరోపణలపై నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని నవంబరు 8వ తేదీన బుచ్‌కు లోక్‌పాల్ నోటీసు జారీ చేసింది. దానికి సమాధానంగా డిసెంబరు 7వ తేదీన ఆర్‌పీఎస్ (రెస్పాండెంట్ పబ్లిక్ సర్వెంట్) అఫిడవిట్ రూపంలో సమాధానం ఇచ్చినట్టు లోక్‌పాల్ తెలిపారు. తదుపరి చర్యగా నోటిమాట ద్వారా తమ వాదన వినిపించేందుకు ఆర్‌పీఎస్‌కు, ఫిర్యాదుదారులకు అవకాశం ఇవ్వాలని భావించినట్టు లోక్‌పాల్ ఛైర్‌పర్సన్ జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, ఐదుగురు సభ్యులు డిసెంబరు 19వ తేదీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగానే వాంగ్మూలం ఇచ్చేందుకు జనవరి 28న లోక్‌పాల్ ముందు హాజరు కావాలని తాజా ఉత్తర్వులు జారీ చేశారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	101
వరంగల్	98	గుంటూరు	104
కరీంనగర్	98	ఒంగోలు	104
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	94
కర్నూలు	98	నెల్లూరు	94
విశాఖపట్నం	102	అనంతపురం	94
గోదావరి	101		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25 తేదీ

హైదరాబాద్	585	విజయవాడ	600
వరంగల్	587	గోదావరి	600
చిత్తూరు	603	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,350 ▼	70,900 ▼	99,900 ▲
విజయవాడ	78,500 ▼	72,300 ▼	91,000 ▼
విశాఖపట్నం	76,360 ▼	70,000 ▼	88,940 ▼
రాజమండ్రి	77,350 ▼	70,900 ▼	89,700 ▼
ప్రొద్దుటూరు	78,500 ▼	72,690 ▼	90,030 ▼
ముంబై	75,874 ▼	69,501 ▼	87,511 ▲

ఇంట్రాడే లాభాలు ఆవిరి

సెన్సెక్స్ 67 పాయింట్లు డౌన్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయి. ఇంట్రాడే లాభాలను చేజార్చుకున్న సూచీలు చివరికి స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 67.30 పాయింట్లు కోల్పోయి 78,472.87 వద్ద ముగిసింది. నిఫ్టీ 25.80 పాయింట్లు తగ్గి 23,727.65 వద్ద క్లోజైంది. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగిన నేపథ్యంలో మదుపరులు మెటల్, విద్యుత్ రంగ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో సగం నష్టపోయాయి.

రూపాయి మరింత పతనం: భారత కరెన్సీ సరికొత్త కనిష్ఠానికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 4 పైసలు క్షీణించి రూ.85.15 వద్ద ముగిసింది. ట్రంప్ సుంకాల పెంపు భయాల నేపథ్యంలో దిగుమతిదారుల నుంచి డాలర్‌కు గిరాకీ పెరగడంతో పాటు దేశీయ ఈక్విటీ మార్కెట్లో నష్టాలు ఇందుకు కారణమయ్యాయి.

నేడు మార్కెట్లకు సెలవు

క్రిస్మస్ సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ఈరోజు బుధవారం సెలవు ప్రకటించారు. కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. గురువారం సెలవు యధావిధిగా పనిచేస్తాయి.

గ్రీవ్స్ ఎలక్ట్రిక్ భారీ ఐపీఓ: విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీ సంస్థ గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ భారీ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్ గ్రీవ్స్ కాటన్ సహా ఇతర వాటాదారులకు చెందిన 18.9 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. గ్రీవ్స్ ఎలక్ట్రిక్ 'ఆంపియర్' పేరుతో ఎలక్ట్రిక్ స్కూటర్లతో పాటు గ్రీవ్స్ బ్రాండ్‌నేమ్‌తో త్రిచక్ర వాహనాలను విక్రయిస్తోంది. ఈ కంపెనీ తెలంగాణలోని తూప్రాన్‌తో పాటు తమిళనాడులోని రాణిపేట్, ఉత్తర ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ప్లాంట్లను కలిగి ఉంది.

ఏపీ మార్కెట్లోకి సుందరం హోమ్ ఫైనాన్స్

చెన్నై: సుందరం హోమ్ ఫైనాన్స్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి ప్రవేశించింది. గుంటూరు, తిరుపతి, నెల్లూరు, ఏలూరు, విజయవాడల్లో ఐదు శాఖలు ప్రారంభించింది. మంచి వ్యాపారావకాశాలున్న ఈ విభాగంలో తన ప్రాబల్యం పెంచుకునేందుకు గాను రాష్ట్రంలో 12 నెలల కాలంలో రాష్ట్రంలో 12 కొత్త బ్రాంచీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ప్రారంభించిన శాఖల ద్వారా రూ.75 కోట్ల మేరకు రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ డీ లక్ష్మీనారాయణన్ తెలిపారు. ఏపీ మార్కెట్లో ప్రవేశించేందుకు ఇదే సరైన సమయమని భావించామన్నారు. అవకాశాలు అపారంగా పెరుగుతున్న ఈ మార్కెట్లో చిన్న వ్యాపార రుణాలు, అఫర్డబుల్ హౌసింగ్ రుణాలపై దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు. సుందరం హోమ్ ఫైనాన్స్ ప్రస్తుతం గరిష్ఠంగా రూ.35 లక్షల వరకు గృహ నిర్మాణ రుణాలందిస్తోంది. ఈ కంపెనీ తమిళనాడులో 40 బ్రాంచీలను కలిగి ఉంది.

స్టెర్లింగ్ హాలీడే రిసార్ట్స్, పాలకొల్లు సమీపంలో స్టెర్లింగ్ పాలవెల్లి గోదావరి రిసార్ట్స్‌ను ప్రారంభించినట్టు ప్రకటించింది. గోదావరి నది తీరాన 13 ఎకరాల విస్తీర్ణంలో కొనసీమ నడిబొడ్డున ఈ రివర్ సైడ్ రిట్రీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ రిసార్ట్‌లో రూమ్స్ సూట్స్‌ను జమీందారీ తరహా ఇళ్లు, స్థానిక కళా నైపుణ్యాన్ని ప్రతిబింబించే మండపం లాబీ, అత్యాధునిక ఇంటీరియర్స్‌తో తీర్చిదిద్దినట్టు వెల్లడించారు.



కంటెంట్ కొత్తగా ఉంది

- దర్శకుడు బాబీ కొల్లి



వెన్నెల కిశోర్, రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. నేడు విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన బాబీ కొల్లి మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ చాలా కొత్తగా ఉంది. డైరెక్టర్ మోహన్ సస్పెన్స్‌ని బాగా హ్యాండిల్ చేయగలడని ట్రైలర్‌తోనే అర్థమైంది. ఈ సినిమా కచ్చితంగా ఘన విజయం సాధిస్తుంది" అని చెప్పారు. మోహన్ మాట్లాడుతూ "ఈ సినిమాకి పనిచేసిన అందరూ తమ బెస్ట్ ఇచ్చారు. తప్పకుండా అందరికీ నచ్చే చిత్రమిది" అని చెప్పారు. "దర్శకుడు ఈ సినిమా కథ చెప్పగానే నచ్చింది. కచ్చితంగా సినిమాతో హిట్ కొడుతున్నాం" అని అన్నారు.

వాణిజ్యాంశాలతో పాటు మంచి సందేశం



ధర్మ, ఐశ్వర్య శర్మ జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు లహరిధర్, బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్ నిర్మించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా హీరో ధర్మ మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా కథ వినగానే నచ్చేసింది. ఒక వ్యక్తి జీవితంలో జరిగిన ఆసక్తికరమైన ప్రయాణం ఈ సినిమా. వాస్తవ సంఘటనలకు కాల్పనికతను జోడించి తెరకెక్కించిన ఈ చిత్రం అందరినీ అలరిస్తుంది. దర్శకుడు సినిమాని అద్భుతంగా తీశారు. ఐశ్వర్య శర్మ భాగీ పాత్రలో అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ సినిమాలో నాది డ్రింకర్ పాత్ర. నిజానికి నాకు తాగుడు అలవాటు లేదు. ఈ పాత్ర కోసం చాలా హోంవర్క్ చేశా. యూత్‌ను ఆకట్టుకునే ఈ సినిమాలో వాణిజ్యాంశాలతో పాటు మంచి సందేశమూ ఉంటుంది" అని చెప్పారు.

ప్రతీకారంతో సాగే కథ



గౌరవ్, గోపాలరావు, నందినీ కపూర్, జబర్దస్త్ వినోదిని, రాకింగ్ రాకేశ్ ప్రధాన పాత్రలలో నటించిన చిత్రం 'బ్లడ్'. అవధూత గోపాల్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 27న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శక నిర్మాత అవధూత గోపాల్ మాట్లాడుతూ "ట్రెండ్‌కు తగ్గట్టు తెరకెక్కించిన సినిమా ఇది. హత్యకు గురైన ఓ యువతి దెయ్యంగా మారి తనకు అన్యాయం చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకోవడమే ఈ సినిమా కథ" అని చెప్పారు. "ఈ సినిమాలో అందరికీ గుర్తుండిపోయే పాత్ర చేశాను" అని హీరో గౌరవ్ చెప్పారు.













పులికాట్‌లో విదేశీ విహంగాల సందడి

తుపాను, వానలతో కళకళలాడుతున్న పులికాట్ సరస్సులో విదేశీ వలస పక్షుల సందడి పెరిగింది. ఒకవైపు రొయ్యల వేటలో మత్స్యకారుల పడవలు తిరుగుతూ ఉంటే, మరోవైపు ఫ్లెమింగోలు, పెయింటెడ్ స్టార్క్స్.. గుంపులు గుంపులుగా ఎగిరొచ్చి సరస్సుకు కొత్త అందాన్ని తెచ్చాయి. ఇప్పటికే 50 వేల ఫ్లెమింగోలు పులికాట్‌కు చేరుకున్నట్టు అంచనా. ఇవిగాక నేలపట్టు నుంచి పెలికాన్‌లూ, వెదురుపట్టు నుంచి పెయింటెడ్ స్టార్క్స్ కూడా వేలాదిగా పులికాట్‌లో చేపలవేట సాగిస్తున్నాయి. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే రోడ్డుకు అటూ ఇటూ.. అటకానితిప్ప, వేనాడు దారి, పేర్నాడు రోడ్డు, శ్రీహరికోటకు ఉత్తరం దిక్కున నవాబ్‌పేట ప్రాంతం, పులికాట్ ముఖద్వారాల సమీపంలో వేల సంఖ్యలో వలస పక్షులు సందడి చేస్తున్నాయి. -సూళ్లూరుపేట



జస్టిస్ జి.నరేందర్‌కు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, కార్యవర్గం

జస్టిస్ నరేందర్ న్యాయసేవలు భేష్

▸ బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తికి హైకోర్టు ఘన వీడ్కోలు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీపై వెళ్తున్న జస్టిస్ జి. నరేందర్‌కు హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. మంగళవారం హైకోర్టులో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ జస్టిస్ నరేందర్ ఎన్నో కీలక తీర్పు ఇచ్చారన్నారు. న్యాయ వ్యవస్థ పురోగతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. జస్టిస్ జి.నరేందర్ మాట్లాడుతూ ఏపీ హైకోర్టులో పనిచేసిన 14 నెలల కాలం తన జీవితంలో గుర్తుండిపోతుందన్నారు. కాగా, జస్టిస్ నరేందర్ ఇచ్చిన తీర్పులు న్యాయ సమాజానికి మార్గనిర్దేశికంగా ఉంటాయని అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, డిప్యూటీ సొలిసిటర్ పసల పొన్నారావు కొనియాడారు. జస్టిస్ నరేందర్‌ను న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, కార్యవర్గం సన్మానించింది.

రాజకీయ ప్రేరేపితం.. కేసు కొట్టేయండి

▸ తెల్లకాగితంపై సంతకంతో కేసు పెట్టారు: చెవిరెడ్డి న్యాయవాది

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టం కింద తిరుపతి జిల్లా యర్రావారిపాలెం పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. మైనర్ బాలికపై లైంగికదాడి జరిగిందని చెవిరెడ్డి మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని చెప్పారు. బాలిక తండ్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చి పిటిషనర్‌పై ఫిర్యాదు చేశారన్నారు. సంబంధిత వీడియో ఆధారాలను కోర్టు ముందుంచారు. పిటిషనర్, ఫిర్యాదుదారుడు కూడబలుక్కొని పోలీసులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు బాలికపై అత్యాచారం జరిగిందని తప్పుడు ప్రచారం చేశారన్నారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని, జోక్యం చేసుకోవద్దని అభ్యర్థించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వీరారెడ్డి వాదనలు వినిపిస్తూ 'పిటిషనర్‌పై పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు చెల్లుబాటు కావు. పిటిషనర్‌పై కంప్లైట్ చేయలేదని ఫిర్యాదుదారుడు చెబుతున్నారు. పోలీసుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. బాలికను పరామర్శించేందుకు పిటిషనర్ ఆస్పత్రికి వెళ్లారు. ఆమెపై రేప్ జరిగిందని పిటిషనర్ మీడియాతో మాట్లాడారని తప్పుడు కేసు పెట్టారు. పిటిషనర్ నవంబరు 4న మీడియాతో మాట్లాడితే 19 రోజుల తర్వాత కేసు పెట్టారు. తెల్లకాగితాలపై ఫిర్యాదుదారుడి సంతకాలు తీసుకొని పిటిషనర్‌పై కేసు పెట్టారు. రాజకీయ దురుద్దేశంలో పిటిషనర్‌ను కేసులో ఇరికించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కేసును కొట్టివేయండి' అని వాదనలు వినిపించారు. వాదనలు ముగియడంతో జనవరి 10న నిర్ణయం వెల్లడిస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ప్రకటించారు.

నా ఫిర్యాదుపై కేసు నమోదుకు ఆదేశించండి

▸ హైకోర్టును ఆశ్రయించిన అంబటి రాంబాబు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జగన్‌తో పాటు తనను, తన కుటుంబసభ్యుల ప్రతిష్ఠను దిగజార్చేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలంటూ తాను ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ వైసీపీ నేత అంబటి రాంబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బాధ్యులపై కేసు నమోదు చేసేలా పోలీసులను ఆదేశించాలని అభ్యర్థించారు. స్వయంగా వాదనలు వినిపించేందుకు పార్టీ ఇన్ పర్సన్‌గా వ్యాజ్యం దాఖలు చేశారు.

హైకోర్టులో పిటిషన్ ఉపసంహరించుకున్న పేర్ని నాని

అమరావతి/మచిలీపట్నం టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గోడౌన్ నుంచి రేషన్ బియ్యం మాయం చేసిన వ్యవహారంలో విచారణకు హాజరు కావాలని మచిలీపట్నం పోలీసులు ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ వైసీపీ నేత పేర్ని నాని, ఆయన కుమారుడు సాయి కృష్ణమూర్తి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం ఉపసంహరించుకున్నారు. ఈ వ్యాజ్యంపై న్యాయస్థానం స్పందిస్తూ.. ఈ నెల 22న విచారణకు హాజరు కావాలని పోలీసులు నోటీసులు ఇచ్చారని, ఆ గడువు ముగిసినందున వ్యాజ్యంపై విచారణ అవసరం లేదని అభిప్రాయపడింది. హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది జయంతి వాదనలు వినిపిస్తూ నోటీసుల గడువు ముగిసినందున పిటిషన్‌పై విచారణను కొనసాగించడానికి వీల్లేదన్నారు. పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సి.రఘు తెలిపారు. పోలీసులు తిరిగి నోటీసులు ఇస్తే కోర్టును ఆశ్రయించేందుకు వెసులుబాటు ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు అనుమతిస్తూ న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, రేషన్ బియ్యం స్వాహా కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మచిలీపట్నం తొమ్మిదో అదనపు జిల్లా కోర్టులో పేర్ని జయసుధ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను న్యాయాధికారి సుజాత ఈ నెల 27కు వాయిదా వేశారు.

రాష్ట్రంలో జపనీస్ జెన్ గార్డెన్!

టోయామాతో ఒప్పందం పునరుద్ధరణ

▸ రాష్ట్రానికి వచ్చిన ప్రిఫెక్చర్ గవర్నర్

▸ కీలక రంగాల్లో పెట్టుబడులు, సహకారం

▸ ఏపీ-జపాన్ సంబంధాలు మరింత బలోపేతం

▸ తాజా ఒప్పందంపై ఇరు ప్రభుత్వాల సంతకాలు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్-జపాన్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడే దిశగా మరో ముందడుగు పడింది. జపాన్‌లోని టోయామా ప్రిఫెక్చర్ ప్రాంత గవర్నర్ హచిరో నిట్టా నేతృత్వంలో 14 మంది సభ్యుల ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం మంగళవారం రాష్ట్ర పర్యటనకు వచ్చింది. ఏపీలో టూరిజం, ఔషధ(ఫార్మాస్యూటికల్స్), తయారీ తదితర కీలక రంగాల్లో సహకారం పెంపు లక్ష్యంగా 2015లో చేసుకున్న అవగాహన ఒప్పందాన్ని(ఎంవోయూ) పునరుద్ధరిస్తూ కొత్త ఎంవోయూపై సంతకాలు చేశారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, కళాశాల విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సంస్థ(ఏపీఈడీబీ) సీఈవో సీఎం సాయికాంత్‌వర్మలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. వాణిజ్య, వ్యాపార రంగాలలో పరస్పర సహకారం, సాంస్కృతిక సంబంధాల పెంపు, డిజిటల్ రంగంలో సాంకేతిక సహకారం, ఔషధ రంగంలో సహకారం, విద్యార్థులు, పరిశోధకుల మధ్య అనుసంధానం తదితర అంశాలు ఈ ఒప్పందంలో ఉన్నాయి. 2015 నుంచి ఇరు ప్రాంతాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగుతున్నాయి. అదేవిధంగా టోయామాలో రాష్ట్ర విద్యార్థులకు ఉద్యోగావకాశాలు, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జపనీస్ భాషా కేంద్రం ఏర్పాటు, ఔషధ తయారీ రంగంలో సంయుక్త చర్చా వేదికలు కొనసాగుతున్నాయి. తాజా ఒప్పందంతో జపాన్‌తో రాష్ట్ర బంధం మరింత బలపడనుంది. ఒప్పందంలోని అంశాల అమలు పర్యవేక్షణకు ఇరుపక్షాల ప్రత్యేక కార్యనిర్వహణ బృందాన్ని ఏర్పాటు చేయనున్నాయి.

ఇప్పటికే 25 కంపెనీలు

రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజు మాట్లాడుతూ.. "రాష్ట్రంలో ప్రస్తుతం 25కి పైగా జపాన్ కంపెనీలు ఒకే ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దేశంలోనే అతి పెద్ద జపనీస్ పారిశ్రామిక కేంద్రాల్లో ఇది ఒకటి. ముఖ్యంగా ఔషధ తయారీ రంగంలో జపాన్ పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోంది" అని చెప్పారు. రాష్ట్రంలో జెన్ గార్డెన్‌ను నెలకొల్పాలని, టోయామా ప్రిఫెక్చర్ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయాలని టోయామా ప్రిఫెక్చర్ గవర్నర్ హచిరో నిట్టాను కోరారు. దీనిపై నిట్టా సానుకూలంగా స్పందించారు. రాబోయే నాలుగేళ్లు తానే పదవిలో కొనసాగుతానని, ఏపీలో ఒక జపనీస్ జెన్ గార్డెన్ ఏర్పాటుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఇంకా ఇరు ప్రాంతాల విశ్వవిద్యాలయాల మధ్య సహకారం, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, మార్పిడిపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. పెట్టుబడుల పరంగా కూడా జపాన్ ఫార్మాస్యూటికల్స్, ఇతర పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యమిస్తామన్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధ(ఏఐ), ఔషధ తయారీ రంగాల్లో ఉమ్మడి బృందాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, సృజనాత్మక రంగాల్లో జపాన్ చాలా అభివృద్ధి చెందిందని.. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో జపనీస్ పాఠశాలలను ప్రారంభించాలని సూచించారు.

ఏసుక్రీస్తు యుగకర్త: సీఎం బాబు

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సర్వమానవాళికి శాంతి సందేశాన్నిచ్చిన యుగకర్త ఏసుక్రీస్తు జన్మదినం ప్రపంచానికి పండుగ రోజు అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. 'ప్రేమ మార్గంలో ఎవరి మనసునైనా జయించవచ్చని నిరూపించిన క్రీస్తు మార్గంలో నడుస్తూ, ప్రేమ, కరుణ, సహనం, దయ, త్యాగ గుణాలను అలవాటు చేసుకుని, సర్వమానవాళికి మేలు కలగాలని ప్రభువును ప్రార్థిద్దాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

క్రిస్మస్ ప్రేమ, శాంతిని నింపాలి

▸ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

క్రిస్మస్ పండుగ నేపథ్యంలో ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించే క్రైస్తవులందరికీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, సద్భావన, శాంతి అనేవి క్రీస్తు మానవాళికి అందించిన సుగుణాలని గుర్తుచేశారు. ఈ క్రిస్మస్ మానవాళి జీవితాల్లో ప్రేమ, శాంతి నింపాలని ఆయన ఆకాంక్షించారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు: సత్యకుమార్

ప్రతి క్రైస్తవ కుటుంబంలో క్రిస్మస్ పండుగ సంతోషాన్ని నింపాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. క్రిస్మస్ పండగ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, త్యాగానికి ప్రతీక అయిన క్రీస్తు బోధనలు అందరికీ అనుసరణీయమన్నారు. ప్రేమ, శాంతి, దయాగుణాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని పేర్కొన్నారు.



వెలుగులీనుతున్న విశాఖ సెయింట్ జాన్స్ చర్చి

విద్యుద్దీపాల అలంకరణలో విశాఖ వన్‌టౌన్‌లోని సెయింట్ జాన్స్ చర్చి. సర్ ఆర్థర్ కాటన్ 1844లో దీనిని నిర్మించారు. ఆ తరువాత 1992లో కృష్ణా-గోదావరి ప్రాంత చర్చిల పర్యవేక్షకులు బిషప్ టి.బి.డి. ప్రకాశరావు పునర్నిర్మించారు. అతి పురాతనమైన ఈ చర్చిలో క్రిస్మస్ సంబరాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

రాజ్‌భవన్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

▸ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్ అబ్దుల్ నజీర్

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏసు ప్రేమ, క్షమాపణ, కరుణ బోధనలను ప్రజలు క్రిస్మస్‌గా జరుపుకుంటారని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. మంగళవారం రాజ్‌భవన్‌లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గవర్నర్ మాట్లాడుతూ క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని కోట్లాది మంది ప్రజలు ఆసక్తిగా ఎదురుచూసే పండుగ క్రిస్మస్ అని అన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రైస్తవ మిషన్ల అధిపతులను సన్మానించారు.



రాజ్‌భవన్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మనవడు, మనవరాలితో కలిసి కేక్ కట్ చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు

జగన్ మీడియాకు దోచి పెట్టారు!



నాటి సీఎం జగన్‌తో విజయ్ కుమార్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

మీడియా, వైసీపీ సోషల్ మీడియాలో పనిచేసే వారిని అడ్డగోలుగా నియమించి అధిక వేతనాలు కట్టబెట్టారు. ఆయనే నాటి సమాచార-పౌరసంబంధాల కమిషనర్ తుమ్మా విజయకుమార్‌రెడ్డి. ఆయన నిర్వాకాలపై విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం.. అక్రమాలను ప్రభుత్వానికి నివేదించింది. ఆ నివేదిక ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)ను కూటమి సర్కారు ఆదేశించింది. దీనిపై దర్యాప్తు చేపట్టాలని ఏసీబీ డీజీ.. గుంటూరు ఏసీబీ ఏఎస్పీ మహేంద్రకు ఉత్తర్వులిచ్చారు. విచారణ అనంతరం విజయ్‌కుమార్ రెడ్డి, గుర్తుతెలియని వ్యక్తులపై మహేంద్ర కేసు నమోదు చేశారు. అవినీతి నిరోధక చట్టంలోని 17ఏ సెక్షన్‌ను ఉల్లంఘించి ఆయన క్విడ్ ప్రొ కో, అవినీతి, బంధుప్రీతి, అవకతవకలకు, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఎఫ్ఐఆర్(క్రైం నంబర్ 7/ఆర్‌సీవో-ఏసీబీ-జీఎన్‌టీ/2024)లో ఆరోపించారు. ఆయనపై ఐపీసీ 120బీ, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 7, 13(2) రెడ్ విత్ 13 (1ఏ) లను మోపారు. విజయకుమార్‌రెడ్డిపై ఆరోపణలివీ..

అర్హతలతో పనిలేకుండా..

జగన్ రోత మీడియాలో పనిచేసే వారిని అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఐ అండ్ పీఆర్‌లో వివిధ పోస్టుల్లో నియమించారు. 142 పోస్టుల భర్తీకి విజయకుమార్‌రెడ్డి ప్రతిపాదనలు పంపారు. వారిలో పీఆర్‌వోలుగా 50 మందిని, ఫొటోగ్రాఫర్లు-15, వీడియోగ్రాఫర్లు-15, ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్లు-30, డేటా ఎంట్రీ ఆపరేటర్లు-15, ఆఫీసు సబార్డినేట్లు-10, డ్రైవర్లు-10, సీఎంవో ఆఫీసులో ఇద్దరు ఫొటోగ్రాఫర్లు ఉన్నారు. అవుట్‌సోర్సింగ్ నియామకాల ఏజెన్సీ కోసం టెండర్లు పిలవాల్సి ఉండగా అలా చేయలేదు. 2019 డిసెంబరు 1కే కాంట్రాక్టు కాలపరిమితి ముగిసిపోయిన కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీని 2020 జూలై వరకు పొడిగించారు. తద్వారా 2016లో విడుదలైన జీవో 151ని విజయకుమార్‌రెడ్డి ఉల్లంఘించారు. అంతేకాదు.. ఈ నియామకాల్లో రిజర్వేషన్ నిబంధనలను పాటించలేదు. అడ్డగోలుగా నియామకాలు జరిపేశారు. ఖాళీ అయిన పోస్టులను కాంట్రాక్టు సంస్థ ద్వారా భర్తీ చేయాలి. పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం, తగిన విద్యార్హతలు కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడం.. ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేసి అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వాలి. ఈ నియామక ప్రక్రియ మొత్తం ఆదే చూసుకోవాలి. అయితే విజయకుమార్‌రెడ్డే ఈ నియామకాలన్నీ చేపట్టారు. ఏజెన్సీ మేనేజింగ్ పార్ట్‌నర్ కామేశ్వర్‌ప్రసాద్‌ను పిలిపించి.. నియామక ప్రక్రియలో ఆ సంస్థ జోక్యం చేసుకోవలసిన అవసరం లేదని.. వారిని తామే ఎంపిక చేసి పంపుతామని.. వారి పేర్లతో నియామక పత్రాలు పంపాలని స్పష్టం చేశారు. 2019-20 మధ్య వివిధ తేదీల్లో 142 మంది పేర్లను వివిధ పోస్టులకు పంపి.. వారి పేర్లు, హోదాలతో అపాయింట్‌మెంట్ లెటర్లు ఇప్పించారు. విజయకుమార్‌రెడ్డి, డిజిటల్ కార్పొరేషన్ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి ఆదేశాలతో ఈ నియామకాలు చేపట్టారు. వీరిలో అత్యధికులు సాక్షి మీడియాలో పనిచేస్తున్నవారే. వారి సర్టిఫికెట్లను పరిశీలించలేదు. చాలా మంది రెజ్యూమ్‌లు ఏజెన్సీ వద్ద గానీ, ఐ అండ్ పీఆర్ వద్ద గానీ లేవు. మరో 113 మంది వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు, సాక్షి సిబ్బందిని అక్రమంగా కంటెంట్ డెవలపర్స్, సోషల్ మీడియా అనలిస్ట్స్, డిజిటల్ క్యాంపెయినర్స్ లాంటి పోస్టుల్లో ఆంధ్రప్రదేశ్ అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్) ద్వారా నియమించారు. అలాగే విజయకుమార్‌రెడ్డి నిబంధనలకు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా సాక్షి మీడియాకు వందల కోట్లు చెల్లించారు. 2019-24 నడుమ ఎలక్ట్రానిక్ మీడియాకు మొత్తం 26.718 కోట్ల ప్రకటనలు ఇవ్వగా.. ఇందులో సాక్షి, టీవీ9, ఎన్‌టీవీకి 16.179 కోట్లు చెల్లించారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, టీవీ5, మహాటీవీకి అసలు ప్రకటనలే ఇవ్వలేదు. ఈ చానళ్ల పెండింగ్ బకాయిలను క్లియర్ చేయకుండా వేధించారు. సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ బకాయిలను మాత్రమే క్లియర్ చేశారు. ప్రింట్ మీడియాకు క్లాసిఫైడ్, డిస్‌ప్లే ప్రకటనల కింద 2019-24 నడుమ ప్రభుత్వం మొత్తం రూ.859.298 కోట్లు విడుదల చేయగా.. ఇందులో 43 శాతం అంటే.. రూ.371.124 కోట్లు ఒక్క సాక్షి మీడియాకే ఇచ్చారు. అలాగే ప్రకటన రేటు పెంచాలని సాక్షి మీడియా కోరడం ఆలస్యం.. అడ్డగోలుగా పెంచేశారు. ఆ సంస్థ అడిగినదానికంటే ఎక్కువే పెంచారు. ఆంధ్రప్రదేశ్ మొత్తం తమ పేపర్లో ప్రకటనకు సెంటీమీటరు రూ.2,626కి పెంచాలని అడిగితే.. విజయకుమార్‌రెడ్డి ఏకంగా.. రూ.2,917కి పెంచారు. అంటే రూ.291 అదనంగా ఇచ్చేశారు. తద్వారా 2021-24 నడుమ జగన్ పత్రికకు రూ.19.63 కోట్లు అధికంగా ఇచ్చారు.నాటి కమిషనర్ అధికార దుర్వినియోగంపై మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉంది.

హడ్కో సీఈవోతో నారాయణ భేటీ

న్యూఢిల్లీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురపాలక మంత్రి పి.నారాయణ హడ్కో సీఈవో సంజయ్ కుల్‌శ్రేష్ఠతో మంగళవారమిక్కడ సమావేశమయ్యారు. అమరావతికి రుణ సమీకరణ ప్రక్రియపై చర్చించారు. జిందాల్ సా లిమిటెడ్ చైర్మన్ పృథ్వీరాజ్ జిందాల్‌తోనూ నారాయణ భేటీ అయ్యారు. రాష్ట్రంలో 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్ల ఏర్పాటుపై చర్చించారు.



జిందాల్ సా చైర్మన్ పృథ్వీరాజ్‌తో భేటీ అయిన మంత్రి నారాయణ

విక్రాంత్‌రెడ్డి బెయిల్ కేసులో కేవీ రావు ఇంప్లీడ్‌కు ఓకే

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్‌లోని వాటాల బదిలీ వ్యవహారంలో సీఐడీ కేసులో ముందస్తు బెయిల్ కోసం విక్రాంత్‌రెడ్డి వేసిన పిటిషన్‌లో తనను ప్రతివాదిగా చేర్చుకోవాలని కోరుతూ ఫిర్యాదుదారుడు కేవీ రావు వేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం అనుమతించింది. కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది. విక్రాంత్‌రెడ్డిపై తొందరపాటు చర్యలు వద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను అప్పటివరకు పొడిగించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. డీప్ వాటర్ పోర్ట్, సెజ్‌ల వాటాలను బలవంతంగా అరబిందోకు బదలాయించారన్న కేవీరావు ఫిర్యాదు ఆధారంగా సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏ1గా ఉన్న వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ వేశారు. కేవీరావు తరఫు న్యాయవాది శరత్‌చంద్ర స్పందిస్తూ తమను ప్రతివాదిగా చేర్చాలని అనుబంధ పిటిషన్ వేశామన్నారు.

స్థానికుల్ని తొక్కేద్దాం.. బయట వాళ్లకు ఇచ్చేద్దాం..!

▸ శానిటేషన్ టెండర్ నిబంధనలపై వ్యతిరేకత

▸ ఆరోగ్యశాఖ అధికారుల తీరుపై తీవ్ర ఆరోపణలు

▸ ఈఎండీ తగ్గించాలని లోకల్ కంపెనీలు డిమాండ్

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖలు ఏవైనా టెండర్లు పిలిస్తే ఎక్కువ కంపెనీలు పాల్గొనేలా నిబంధనలు సిద్ధం చేస్తారు. దీనివల్ల కంపెనీల మధ్య పోటీతో పాటు ప్రభుత్వానికి ఆర్థికంగా లాభం ఉంటుంది. ఆరోగ్యశాఖ మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. స్థానిక కాంట్రాక్టర్లను తొక్కేసి.. పక్క రాష్ట్రాల్లోని బడా కాంట్రాక్టర్లకు పెద్దపీట వేసేలా ఉన్నతాధికారులు శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ టెండర్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేశారు. దీనివల్ల స్థానిక కంపెనీలతో పాటు చిన్న కంపెనీలకు టెండర్లల్లో పాల్గొనే అర్హత లభించట్లేదు. ఆరోగ్యశాఖ విడుదల చేసిన డాక్యుమెంట్‌లో ఏదైనా కంపెనీ టెండర్లలో పాల్గొనాలంటే రూ.2 కోట్ల వరకూ ఈఎండీ కట్టాల్సి ఉంటుంది. టెండర్ వచ్చిన తర్వాత మూడేళ్లకు బ్యాంక్ గ్యారెంటీని ప్రభుత్వానికి అందించాలి. ఇలా కోట్లల్లో ఈఎండీ, బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాలంటే రూ.వందల కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలకు మాత్రమే సాధ్యమవుతుంది. కేవలం శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ టెండర్ల కోసం ఈ స్థాయిలో నిబంధనలు పెట్టాల్సిన అవసరం లేదనే వాదన వినిపిస్తోంది. ఈ విషయాన్ని రాష్ట్ర కంపెనీల ప్రతినిధులు ప్రీ బిడ్ మీటింగ్‌లో ప్రశ్నించారు. ఈఎండీ తగ్గించాలని, బ్యాంక్ గ్యారెంటీ ఏడాదికి ఇచ్చేలా నిబంధనలు మార్చాలని కోరారు. రూల్స్ మార్చే ప్రసక్తే లేదని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, ఏపీఎంఎస్ఐడీసీ సీఈ శ్రీనివాస్ తేల్చి చెప్పారు. దీంతో ప్రీ బిడ్ సమావేశానికి హాజరైన 15 కంపెనీలు వెనక్కి వెళ్లిపోయాయి.

పర్సంటేజీలోనే తేడా...

టెండర్లలో ఈసారి సరికొత్త నిబంధన పెట్టారు. శానిటేషన్, సెక్యూరిటీ ఉద్యోగులకు, సూపర్‌వైజర్లకు టెండర్ డాక్యుమెంట్‌లో జీతాలు నిర్ణయించారు. ఆస్పత్రుల్లో శానిటేషన్ పనులు చేసేందుకు అవసరమైన పరికరాలు, కెమికల్స్‌కు కూడా ముందుగానే రేట్లు నిర్ణయించారు. కంపెనీలు కేవలం ఎంత పర్సంటేజ్‌కు శానిటేషన్, సెక్యూరిటీ పనులు చేస్తారన్న దాన్ని మాత్రమే బిడ్‌లో దాఖలు చేస్తే సరిపోతుంది. అది కూడా 3.85 నుంచి 5 శాతం లోపు ఉండాలని నిబంధన పెట్టారు. శానిటేషన్, సెక్యూరిటీ టెండర్లకు పోటీ ఎక్కువ ఉంటుంది. కాబట్టి ప్రతి కంపెనీ 3.85 శాతానికే చేస్తామని బిడ్ దాఖలు చేస్తే ఏం చేస్తారని కంపెనీల ప్రతినిధులు ప్రీ బిడ్ మీటింగ్‌లో ప్రశ్న లేవనెత్తారు. అన్ని కంపెనీలు 3.85 శాతానికే చేస్తామని ముందుకొస్తే ఏ కంపెనీ టర్నోవర్ ఎక్కువ ఉంటుందో దానికే టెండర్ ఇస్తామని అధికారులు చెప్పారు. ఇదేం నిబంధన అని ప్రశ్నిస్తే.. సమాధానం లేదు.

జోన్‌ల వారీ టెండర్లు ఫెయిల్!

శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్‌కు జోన్‌ల వారీగా టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. కొత్త విధానంలో ముంబై, చెన్నై, ఢిల్లీలో ఉండే పెద్ద కంపెనీలు టెండర్లు దక్కించుకునే అవకాశం ఉంది. దీంతో ఆయా సంస్థలతో ఉత్తరప్రత్యుత్తరాల విషయంలో ఆరోగ్యశాఖ అధికారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఏ-1 అనే సంస్థ రాయలసీమ జోన్ శానిటేషన్ పనులు చేస్తుంది. సదరు సంస్థ వల్ల సమస్యలు వస్తున్నాయి. పదేళ్లలో ఇప్పటి వరకూ సంస్థ హెడ్ స్థానికంగా అందుబాటులో ఉండట్లేదు. ప్రతి జోన్ కాంట్రాక్టర్‌తో ఇవే సమస్యలు తలెత్తుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ సమస్యల నుంచి బయటపడడానికి ఆస్పత్రుల వారీగా టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో స్థానిక కాంట్రాక్టర్లకు అవకాశం దక్కేలా రాష్ట్రంలో నిబంధనలు మార్చాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

గతంలో లేని విధంగా నిబంధనలు

శానిటేషన్, సెక్యూరిటీ పాలసీని 2014-19 మధ్యలో టీడీపీ ప్రభుత్వమే తీసుకువచ్చింది. అప్పుడు ఈఎండీ రూ.10-50 లక్షల లోపే ఉండేది. వైసీపీ ప్రభుత్వం కూడా రూ.20 లక్షల లోపే ఈఎండీల నిబంధన పెట్టింది.



ఇప్పుడు ఆకస్మాత్తుగా టెండర్ నిబంధనల్లో మార్పులు చేసి.. ఈఎండీలు ఎందుకు పెంచారన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు ముందుగానే కొన్ని కంపెనీలను నిర్ణయించుకుని, వాళ్లకే టెండర్ దక్కేలా రూల్స్ పెట్టారన్న ఆరోపణలు వస్తున్నాయి. సాధారణంగా ఏ టెండర్లో అయినా బ్యాంక్ గ్యారెంటీ ఏడాదికి మాత్రమే తీసుకుంటారు. తర్వాత ప్రతి ఏటా రెన్యువల్ చేసుకుంటారు. 108, 104 వాహనాలు నిర్వహించే పెద్ద కంపెనీలు కూడా బ్యాంక్ గ్యారెంటీలు ఏడాదికి మాత్రమే ఇస్తాయి.



టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ

ముంపు పరిహారం కొట్టేసిన వైసీపీ నేతలు

- పుంగనూరులో పెద్దిరెడ్డి అనుచరుల అరాచకాలు
- టీడీపీ కార్యాలయంలో బాధితుల ఫిర్యాదులు

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలంలో పోలవరం ముంపు భూముల పరిహారాన్ని వైసీపీ నేతలు అక్రమంగా కాజేశారని టీడీపీ కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదు అందింది. మంగళవారం ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. దేవీపట్నం మండలం గుబ్బలంపాలెం ముంపు గ్రామంలో గిరిజనుల భూములకు కొందరు వైసీపీ నేతలు, దళారులు కలిసి నకిలీ పట్టాలు సృష్టించి, కోట్ల రూపాయలు కొట్టేశారని.. దీనిపై అప్పటి కలెక్టర్ సుమిత్ కుమార్ విచారణ జరిపి దోపిడీ నిజమేనని తేల్చారని దేవీపట్నం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మట్టా మెహర్‌బాబా గౌడ్ ఫిర్యాదు చేశారు. దోచుకొన్న సొమ్ములో కొంత భాగం అప్పటి వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు, వైసీపీ ఎమ్మెల్యే ధనలక్ష్మి, నాటి ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబులకు ముట్టచెప్పి, ఈ వ్యవహారం బయటకు రాకుండా చూశారని, దీనిపై విచారణ జరపాలని కోరారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని మెలిపట్లలో గతంలో తమకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు రికార్డులు మార్చి కబ్జా చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్.షమీవుల్లా విజ్ఞప్తి చేశారు. తమ భూమికి పెద్దిరెడ్డి అనుచరులు అక్రమ డాక్యుమెంట్లు పుట్టించి కాజేశారని, అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని తుంగా రమాదేవి అనే మహిళ ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి తాము షాపు పెట్టుకొని నడుపుకొంటుంటే పెద్దిరెడ్డి అనుచరులు దానిని అక్రమంగా కూల్చారని, కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ మధుసూధన రెడ్డి మరొకరికి ఆ స్థలంలో షాపు నిర్మాణానికి అనుమతి ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రకాశం జిల్లా తెల్లబాడులో భూముల రీసర్వేలో తమ భూమిని వీఆర్వో వేరొకరి పేరుపై మార్చారని, తమకు న్యాయం చేయాలని శంకర్రావు అనే వ్యక్తి విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబుతోనే రైతన్నలకు మేలు: మంత్రి సవిత

- ఏపీఎస్ఏఎం వైస్ చైర్మన్‌గా మర్రెడ్డి ప్రమాణస్వీకారం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలోనే రైతన్నలకు మేలు జరుగుతుందని మంత్రి ఎస్.సవిత అన్నారు. రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్‌గా మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. 'జగన్ వ్యవసాయాన్ని, రైతులను గాలికి వదిలేసి వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించాడు. వ్యవసాయం గిట్టుబాటుకాక ఎందరో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు' అని విమర్శించారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు.



మర్రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

మహిళలకు

ఇంటి నుంచే పని!

- సహకార, పొరుగు సేవల కేంద్రాలు
- శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాల కల్పన
- గృహిణులకు చాన్స్: సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు ఇంటి నుంచే పనికల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా సహకార పని కేంద్రాలు(కో-వర్కింగ్ స్పేస్ సెంటర్లు), పొరుగు సేవల కేంద్రాలు(నైబర్‌హుడ్ వర్కింగ్ స్పేస్ సెంటర్లు) ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా కేంద్రాల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు మంగళవారం సచివాలయంలో సమీక్షించారు. చదువుకున్న మహిళలు గృహిణులుగా మిగిలిపోకూడదని, వారికి అవకాశాలు కల్పించాలని సీఎం అభిప్రాయపడ్డారు. ఇంటి నుంచే పని(వర్క్ ఫ్రం హోమ్), సహకార పని కేంద్రాలతో మహిళలకు విస్తృత అవకాశాలు లభిస్తాయన్నారు. మహిళలను ఇంటికి పరిమితం చేయడం సరికాదని సీఎం అన్నారు. వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే ఆర్థిక వృద్ధి పెరుగుతుందని తెలిపారు. సహకార పని కేంద్రాల ఏర్పాటు ద్వారా 2025, డిసెంబరు చివరి నాటికి 1.50 లక్షల మందికి అవకాశం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు వివరించారు. ప్రభుత్వ ప్రైవేటు భవనాల్లో ఈ వర్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ప్రైవేటు, ప్రభుత్వ భవనాల్లో 22 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని గుర్తించామని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎంత మంది ఇంటి నుంచి పనిచేస్తున్నారు? వారి అవసరాలు ఏమిటి? అనే సమాచారం సేకరించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. అదేవిధంగా ఇప్పటికే నిర్ణయించిన రతన్ టాటా సృజనాత్మక కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో భవనాలను గుర్తించాలని ఆదేశించారు. ఆ ప్రాంతంలోని పరిశ్రమలను, విద్యాసంస్థలను సృజనాత్మక కేంద్రాలకు అనుసంధానం చేయాలని నిర్దేశించారు.



సహకార పని కేంద్రాలు, పొరుగు సేవల కేంద్రాల ఏర్పాటుపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

ఢిల్లీ చేరిన చంద్రబాబు

- నేడు వాజపేయి శతజయంతికి హాజరు
- ఎన్డీయే సీఎంల భేటీకి కూడా..
- మోదీ, షాలతో సమావేశమయ్యే చాన్స్?

అమరావతి/న్యూఢిల్లీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మంగళవారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. బుధవారం ఉదయం దివంగత ప్రధాని వాజపేయి శత జయంతి కార్యక్రమంలో పాల్గొంటారు. ఎన్డీయే నేతలతో కలిసి విజయ్‌ఘాట్‌లోని వాజపేయి మెమోరియల్ వద్ద నివాళులు అర్పిస్తారు. మధ్యాహ్నం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో చంద్రబాబు భేటీ అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రాభివృద్ధికి సంబంధించి పెండింగ్ అంశాలు, వచ్చే కేంద్ర బడ్జెట్‌లో సాయంపై వారితో చర్చించవచ్చని తెలుస్తోంది. అనంతరం ఆయన హైదరాబాద్ వెళ్తారు. గురువారం అక్కడ ప్రైవేటు కార్యక్రమాలకు హాజరవుతారు. శుక్రవారం అమరావతికి తిరిగి వస్తారు.

'మిషన్ కర్మయోగి'తో నైపుణ్యాల పెంపు

- కెపాసిటీ బిల్డింగ్ పాలసీకి సీఎం ఆమోదం

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉద్యోగుల్లో నైపుణ్యాలు పెంచేందుకు నిర్దేశించిన ఏపీ మిషన్ కర్మయోగి కార్యక్రమంపై సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ శిక్షణ కోసం కెపాసిటీ బిల్డింగ్ కమిషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరులో ఒప్పందం చేసుకుంది. కెపాసిటీ బిల్డింగ్ పాలసీపై అధికారులతో సీఎం చర్చించారు. ఆధునిక సాంకేతికతతో నడిచే కంపెనీలు, పరిశ్రమల అవసరాలకు తగినట్టుగా ఉద్యోగులు, యువత నైపుణ్యాలు పెంచుకోవడం అత్యవసరమని, ఇందుకోసం కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ సిఫారసు చేసిన శిక్షణ పాలసీని ఆమోదిస్తున్నట్టు ప్రకటించారు. పోలీస్, రెవెన్యూ, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్- గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్యా, ఆరోగ్య రంగాల్లో నైపుణ్యాలు పెంచేందుకు మిషన్ కర్మయోగి కార్యక్రమాన్ని ఉపయోగిస్తామన్నారు.

బీఎల్‌వోలకు 58 కోట్ల గౌరవ వేతనం విడుదల

- మూడేళ్లుగా వైసీపీ నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వం వచ్చాక సానుకూల చర్యలు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బూత్ లెవల్ ఆఫీసర్లకు(బీఎల్‌వోలకు) మొత్తం రూ.58.62 కోట్లు గౌరవ వేతనం విడుదల చేస్తూ మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. 2021-22 మూడో త్రైమాసికం నుంచి 2023-24 మూడో త్రైమాసికం వరకూ ఈ గౌరవ వేతనం విడుదల చేశారు. కాగా, బీఎల్‌వోలకు గౌరవ వేతనం విడుదలపై ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల బూత్ స్థాయి అధికారులకు మూడేళ్ల గౌరవ వేతనం ఇవ్వలేదన్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి బకాయిల గురించి సీఈవో, రాష్ట్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. గౌరవ వేతనం విడుదల చేసినందుకు సీఎం చంద్రబాబు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీకి రూ.446 కోట్లు

- 15వ ఆర్థిక సంఘం గ్రాంటు విడుదల

న్యూఢిల్లీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి 15వ ఆర్థిక సంఘం గ్రాంటు రూ.446.49 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ గ్రాంట్లలో రెండో వాయిదా కింద రూ.420.99 కోట్లు, ఒకటో వాయిదా కింద ఇవ్వాల్సిన 25.48 కోట్లను కేంద్రం మంగళవారం విడుదల చేసింది. 13,097 పంచాయతీలకు నిధులను కేటాయిస్తారు.

టెన్త్ పరీక్ష ఫీజుకు తత్కాల్ విధానం

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫీజుల చెల్లింపులకు ప్రభుత్వ పరీక్షల విభాగం మరో అవకాశం ఇచ్చింది. తత్కాల్ విధానం పేరుతో ఈ నెల 27 నుంచి జనవరి 10 వరకు ఫీజులు చెల్లించవచ్చని తెలిపింది. తత్కాల్‌లో రూ.వెయ్యి ఫైన్ చెల్లించాలని స్పష్టం చేసింది. గతంలో ఫీజులు చెల్లించనివారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి సూచించారు.

ఫైబర్‌నెట్‌ను ముంచేశారు!

- 410 మంది అనధికార ఉద్యోగుల తొలగింపు
- త్వరలో మరో 200 మందికి కూడా ఉద్వాసన
- మధుసూదనరెడ్డికి నోటీసులు: జీవీ రెడ్డి

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌ను రూ.2,150 కోట్ల మేర గత యాజమాన్యం ముంచేసిందని ఆ సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి ఆరోపించారు. ఈ నిధులు ఏమయ్యాయో .. ఎందు కోసం ఖర్చు చేశారో లెక్కాపత్రం లేదన్నారు. మంగళవారం జీవీరెడ్డి ఫైబర్‌నెట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫైబర్‌నెట్‌లో అరాచకం రాజ్యమేలిందన్నారు. "2014-19 మధ్యకాలంలో కేవలం 108 మంది ఉద్యోగులతో ఫైబర్‌నెట్ ప్రారంభమైంది. 2019-24 నాటికి 1,380 మంది ఉద్యోగులు అక్కడ పనిచేస్తున్నారు. 2019 ముందు నెలకు 40 లక్షల మేర జీతభత్యాలకు చెల్లించారు. 2019 తర్వాత జీతాల పద్దు నాలుగు కోట్లకు చేరింది. ఆనాడు నియమ నిబంధనలు పాటించకుండా .. వైసీపీ నేతలు ఇచ్చిన ఫోన్ ఆదేశాలతోను, వాట్సాప్ మెసేజ్‌లతోను ఉద్యోగాలు ఇచ్చేశారు. చాలామందికి నియామక పత్రాలు కూడా లేవు. అటువంటి వారిలో 410 మందిని గుర్తించి, తొలగించాం. త్వరలో మరో 200 మంది అరాచక ఉద్యోగులను కూడా తొలగించనున్నాం. దీనిపై .. న్యాయపరమైన అంశాలను అధ్యయనం చేస్తున్నాం' అని తెలిపారు. ఫైబర్‌నెట్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక .. సిబ్బంది నియామకాల తీరుపై ఆరా తీస్తే విస్మయపరిచే విషయాలు తెలిశాయన్నారు. అదంతా చూస్తే.. తాను ఏపీఫైబర్‌నెట్ చైర్మన్‌నా లేక వైసీపీ చైర్మన్‌నా అనే సందేహం కలిగిందని వ్యాఖ్యానించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం.. ఎంపీ అవినాశ్‌రెడ్డి సిఫారు. లేదా వైసీపీ ముఖ్యనేతల ఆదేశాలతో ఫైబర్‌నెట్‌లో చేరామని సిబ్బంది చెబుతుంటే తనకు ఆశ్చర్యం వేసిందన్నారు. ఎక్కడా లిఖిత పూర్వక సిఫారసులు లేవని తెలిపారు. ఇలాంటి అనామతు ఉద్యోగులను తొలగించడంతో పాటు.. వారి జీతభత్యాల చెల్లింపుల కోసం కోట్లలో వ్యయం చేసి.. సంస్థకు నష్టం చేకూర్చినందుకు.. మాజీ ఎండీ మధుసూదనరెడ్డికి నోటీసు జారీ చేస్తామని తెలిపారు. అలాగే.. తిరుపతిలో ఆయన హోటల్ నిర్మించారంటూ జరుగుతున్న ప్రచారంపై సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. వ్యూహం సినిమా కోసం దర్శకుడు రాంగోపాల్‌వర్మ బృందానికి పంపిన లీగల్ నోటీసుకు 13 రోజుల్లో స్పందించాల్సి ఉంటుందన్నారు.



అక్కడ ఊడిగం.. ఇక్కడ వేతనం

వైసీపీ పాలించిన ఐదేళ్లూ ఫైబర్‌నెట్‌లో అరాచకం రాజ్యమేలిందనీ, నియామకాల నుంచి వేతనాల నిర్ణయం దాకా అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని జీవీరెడ్డి అన్నారు. "కొందరు సిబ్బంది అప్పట్లో అధికార పార్టీ మంత్రులు, కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీల ఇళ్లలో పనిచేసేవారు. వేతనాలు మాత్రం ఫైబర్‌నెట్ నుంచి అందుకునేవారు. దీంతో ఫైబర్‌నెట్ దివాలా అంచులకు చేరుకుంది" అని తెలిపారు.

సంజయ్‌పై ఏసీబీ కేసు

(మొదటి పేజీ తరువాయి)



సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థలను చేర్చింది. సీఐడీ ఏడీజీగా రూ.1.16 కోట్లు, అగ్నిమాపక శాఖ డీజీగా రూ.59.93లక్షల అవినీతి జరిగినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఐపీసీలోని 409, 420, 477ఏ, రెడ్‌విత్ 120బి కింద నేరపూరిత కుట్ర, మోసం, నేరపూరిత విశ్వాస ఘాతుకం, అకౌంట్ల తారుమారు తదితర సెక్షన్లతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని 13(1)(ఏ) రెడ్ విత్ 13(2), సెక్షన్ 7కింద నేరాభియోగాలు మోపింది. ఈ స్కాంలో రూ.1.76కోట్ల నిధుల మళ్లింపు వ్యవహారాన్ని తేల్చే పని ఏసీబీ అధికారులు మొదలుపెట్టారు.

మింగేశారు ఇలా...

వైసీపీ ప్రభుత్వంలో సీఐడీ ఏడీజీగా పనిచేసిన సంజయ్ దళితుల పేరుతో సర్కారీ సొమ్ము దండుకున్నారు. ప్రభుత్వం వంద రూపాయలు ఇస్తే, రెండు శాతం ఖర్చు చేసి 98శాతం మింగేశారు. రాష్ట్ర వ్యాప్తంగా షెడ్యూల్డ్ కులాలు, తెగల వారికి అట్రాసిటీ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామంటూ రూ.1.16కోట్లు బిల్లు ప్రభుత్వం నుంచి తీసుకున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగంలోకి దిగి విచారణ జరిపించడంతో దోపిడీ బట్టబయలైంది. ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు హడావుడిగా ప్రైవేటు ఏజెన్సీతో కాంట్రాక్టు కుదుర్చుకున్నారు. కార్యక్రమ నిర్వహణకు అవసరమైన వాటిని అద్దెకు తీసుకోవడం, కుర్చీలు వగైరా సమకూర్చడం, అతిథులకు టీ, స్నాక్స్ ఏర్పాటు చేయడం ఆ ఏజెన్సీ చూసుకోవాలి. అందుకుగాను కోటికి పైగా బిల్లు చెల్లించేశారు. తీరా విచారణ జరిపితే ఒక్కటి మినహా మిగతా 24చోట్లా ఈ కార్యక్రమాలు ప్రభుత్వ భవనాల్లో జరిగాయి. ప్రభుత్వ ఫర్నిచరే వాడారు. పోలీసుల కార్యక్రమం కదా అని టీ, స్నాక్స్ ఎవరెవరో సమకూర్చారు. ఒక ప్రైవేటు భవనం కూడా....పోలీసులతో ఎందుకని ఉచితంగానే ఇచ్చేశారు. అంటే...సీఐడీ అధికారుల జేబు నుంచి ఒక్క పైసా ఖర్చు చేయలేదన్నమాట. కానీ సంజయ్ మాత్రం రూ.1.16కోట్లు ప్రభుత్వ నిధులు తినేశారు.

ఆ సంస్థలపై ఆరోపణలు..

సంజయ్ అధిపతిగా ఉన్నప్పుడు ఏపీ సీఐడీ పిలిచిన టెండర్లకు హైదరాబాద్‌లో ఉంటున్న క్రిత్వాప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, సౌత్రిక టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, మెటా పాయింట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థలు పాల్గొన్నాయి. ఈ సంస్థలపై ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రంగంలోకి దిగిన విజిలెన్స్ బృందాలు హైదరాబాద్‌కు వెళ్లి పై మూడు ఏజెన్సీల చిరునామాల్లో విచారించాయి. అయితే, క్రిత్వాప్ అనే సంస్థ పేరుతో బిడ్డర్ లేనే లేరని తేలింది. సౌత్రికా టెక్నాలజీస్ విజయవాడలోనే ఉందని, రెండూ ఒక్కరివేనని వెల్లడైంది.

ఇది మరీ విచిత్రం..

టెండర్ దక్కించుకున్న ఏ సంస్థయినా ఎంవోయూ కుదుర్చుకుని వర్క్ ఆర్డర్ తీసుకున్నాకే పని మొదలు పెడుతుంది. సీఐడీలో మాత్రం అలా జరగలేదని విజిలెన్స్ విచారణలో తేలింది. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. ఆ నివేదికను అనుసరించి... టెండర్లలో ముగ్గురు బిడ్డర్లు అర్హత సాధించారు. క్రిత్వాప్ టెక్నాలజీస్ రూ.59,52,500లతో ఎస్టీ సభల కోసం ఎల్-1గా, ఎస్సీల సభల కోసం 59,51,100తో ఎల్-1గా నిలిచింది. ఇందులో అసలు ట్విస్ట్ ఏంటంటే అవగాహనా సదస్సులు పూర్తయ్యాక జనవరి 30న ఒప్పందం చేసుకొన్నారు.

ఫైర్‌లో 59.93లక్షలు స్వాహా

అగ్నిమాపక శాఖలో ఎన్‌వోసీల జారీ ఇతరత్రా అనుమతులకు సంబంధించి అగ్ని పోర్టల్ ఎన్‌వోసీ టెండర్లలో డీజీ హోదాలో సంజయ్ అక్రమాలకు పాల్పడినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తేల్చింది. బిడ్ రిగ్గింగ్, టెండర్లు కట్టబెట్టడంలో పక్షపాత నిర్ణయాలు తీసుకున్నట్లు గుర్తించింది. పనుల్లో పురోగతి లేకుండానే ముందస్తు అడ్వాన్సులు నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టినట్లు పసిగట్టింది. అగ్ని పోర్టల్‌తో పాటు హార్డ్‌వేర్ సరఫరా కోసం సౌత్రికా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో రూ.2.29కోట్ల ఒప్పందాన్ని 2023 ఫిబ్రవరి 23న సంజయ్ చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం ముందస్తుగా 59.93లక్షలు ప్రైవేటు సంస్థకు ముందుగా చెల్లించేశారు. అయితే 14శాతం పని మాత్రమే పూర్తి చేసిన సౌత్రికా టెక్నాలజీస్ ఆ తర్వాత ఆపేసింది. మరోవైపు మొబైల్ యాప్ నిర్వహణ, మైక్రోసాఫ్ట్ ల్యాప్‌టాప్‌లు, యాపిల్ ఐ ప్యాడ్‌ల కొనుగోలుకు రూ.17.89లక్షలు అదనంగా చెల్లించినట్లు విజిలెన్స్ గుర్తించింది. గత నెలలో విజిలెన్స్ విభాగం ఇచ్చిన నివేదికను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3న సంజయ్‌ను సస్పెండ్ చేసింది. తాజాగా ఏసీబీ విచారణకు ఆదేశించడంతో కేసు నమోదైంది.

బిల్లులన్నీ డొల్లే

అవగాహన సదస్సుల్లో పాల్గొన్న వందలాది మంది కోసం భోజనాల బిల్లు, హాల్ అద్దె, వీడియోగ్రఫీ చార్జీ, ఫర్నీచర్ అద్దె ఇతరత్రా ఇన్వాయిస్‌లన్నీ డొల్లేనని విజిలెన్స్ తేల్చింది. నిజానికి, ప్రభుత్వ హైస్కూళ్లు, బాలుర వసతి గృహాలు, ఆంజనేయ స్వామి ఆలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు, గిరిజన గురుకులాలు, వెలుగు కార్యాలయాలు, సామాజిక భవనాల్లో ఈ సదస్సులు జరిగాయి. సీఐడీ అధికారులు వీడియో గ్రఫీ తమ సెల్ ఫోన్లతో తీశారు. అయినప్పటికీ సమావేశ మందిరాలకు రెండు నుంచి మూడు లక్షల చొప్పున అద్దెలు చెల్లించినట్లు బిల్లులు సృష్టించారు. వీడియో గ్రాఫర్ బిల్లులు ఎక్కడికక్కడ లక్షలాది రూపాయలు చెల్లించేసి 1.19కోట్లు ప్రైవేటు ఏజెన్సీకి ఇచ్చేశారు. కానీ, ఈ బిల్లులు బోగస్ అని విజిలెన్స్ తేల్చింది. సమావేశ మందిరానికి మూడు లక్షలు చెల్లించామని చెప్పిన చోట.. అది ఎంపీడీవో కార్యాలయం అని తేలింది. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, కర్నూలు, గుంటూరు, తిరుపతి పరిధిలో ఎక్కడ విచారించినా పది వేల నుంచి పాతిక వేల లోపు టీ, బిస్కెట్స్ లంచ్ కోసం తీసుకున్నామని చెప్పారు. అదంతా లెక్కిస్తే 2.66లక్షలు మాత్రమేనని తేలింది. ఇతర ఖర్చులన్నీ కలిపితే మొత్తం మీద 3.10లక్షలు ఖర్చు చేసిన సీఐడీ బాస్... ఏకంగా 1.19కోట్లు డ్రా చేసుకున్నారు. అందులో చేసిన ఖర్చు పోను మాజీ సీఐడీ బాస్, ఆయన బృందం నుంచి 1,15,93,600 రికవరీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఫారసు చేసింది. ఈ కుంభకోణంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై చర్య తీసుకోవాలని, సంబంధిత ఏజెన్సీ(క్రిత్వాప్)పైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. దీంతో ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.

సంక్రాంతికి 'సహకార'

పోస్టుల భర్తీ!

- వ్యవసాయ మార్కెట్ కమిటీల పదవులు కూడా..
- కూటమి నేతలకు కొత్త సంవత్సరం బహుమతి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కూటమి పార్టీల నేతలకు కొత్త సంవత్సరం ఆరంభంలోనే నామినేటెడ్ పదవుల బహుమతి లభించనుంది. సహకార సంస్థలు, మార్కెట్ కమిటీల పదవులను జనవరిలో భర్తీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ దాదాపు 10వేల పదవులు క్షేత్రస్థాయి నేతలకు దక్కనున్నాయి. వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేలోపు వాటికి నామినేటెడ్ పాలక వర్గాలను నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 2,300 వ్యవసాయ సహకార సొసైటీలు ఉన్నాయి. వీటిలో ఒక్కోదానికి చైర్మన్‌తో పాటు ఇద్దరు సభ్యులను నామినేట్ చేయడం ద్వారా మొత్తం 6,900 మందికి అవకాశం లభించనుంది. వీటిలో ప్రత్యేకించి రిజర్వేషన్లు లేకపోయినా స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సామాజిక న్యాయం పాటించాలని సర్కారు సూచించింది. ఎమ్మెల్యేలు ఇచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి ఖరారు చేసే బాధ్యతను ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు. సంక్రాంతి నాటికి ఈ పదవులు భర్తీ చేయాలన్న యోచనలో ఉన్నారు. రెండోదశలో జిల్లా సహకార బ్యాంకులు, జిల్లా మార్కెటింగ్ సంస్థలకు కూడా ముగ్గురు సభ్యుల పాలక వర్గాలను నియమిస్తారు. తర్వాత రాష్ట్ర సహకార బ్యాంకు పాలక మండలిని ఖరారు చేసి నామినేట్ చేస్తారు. జిల్లా స్థాయి పదవులు ఆశిస్తున్న నేతలు ఇప్పటికే తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. సహకార సంస్థల్లో వ్యవసాయేతర సంఘాల పదవులు కూడా భర్తీచేసే యోచనలో ప్రభుత్వం ఉంది. వందల సంఖ్యలో మత్స్యకార సొసైటీలకు కూడా నామినేటెడ్ పాలక వర్గాలు నియమించే కసరత్తును సహకార శాఖ చేపట్టింది. వీటినీ జనవరిలోనే భర్తీ చేసే అవకాశం ఉంది. గొర్రెల పెంపకం దారుల సొసైటీల పాలక వర్గాల నియామకంపైనా ప్రతిపాదనలు స్వీకరిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలక వర్గాల నియామక కసరత్తు ప్రభుత్వ స్థాయిలో జరుగుతోంది. వీటికి ఎన్నికలు ఉండవు. రెండేళ్ల కాల పరిమితితో నామినేటెడ్ పాలక వర్గాలను నియమిస్తారు. రాష్ట్రంలో 222 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఒక్కో కమిటీలో చైర్మన్‌తో కలిపి 15 మంది సభ్యులను నియమిస్తారు. ఈ కమిటీల చైర్మన్ పదవుల్లో సగం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రిజర్వు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రొటేషన్‌లో భాగంగా రెండేళ్ల తర్వాత ఇప్పుడు రిజర్వేషన్‌లో ఉన్న చైర్మన్ పదవులు జనరల్ అవుతాయి. ఇప్పుడు జనరల్‌లో ఉన్నవి రిజర్వేషన్‌లోకి వస్తాయి.

చట్టమంటే ఏమిటో తెలిసేలా చేస్తా

- జగన్ పత్రికపై రిటైర్డ్ ఐపీఎస్ ఏబీవీ ఫైర్



అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'నికార్సైన పోలీసుగా పనిచేశా.. చట్టంపై నమ్మకంతో చెబుతున్నా.. అబద్ధాన్ని పదేపదే ప్రచారం చేసి నిజం చేయాలనే విష సంస్కృతికి పాల్పడుతోన్న జగన్ పత్రిక, మరో యూట్యూబ్ చానల్‌కు చట్టమంటే ఏమిటో తెలిసేలా చేస్తా' అని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. ఏబీవీపై గత వైసీపీ ప్రభుత్వం బనాయించిన తప్పుడు కేసులను ఇటీవల కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో జగన్ సొంత మీడియా విషం చిమ్ముతూ ఫోన్ ట్యాపింగ్ కేసులంటూ రోత రాతలు రాసింది. మరో యూట్యూబ్ చానల్ కూడా ఇదే విధంగా ప్రసారం చేయడంతో ఏబీవీ పరువు నష్టం దావాకు సిద్ధమయ్యారు. అబద్ధాన్ని పదేపదే ప్రచారం చేయాలనే విష సంస్కృతి, వికృత ఆలోచనల నుంచి కొన్ని మీడియా సంస్థలు బయటికి రాలేదని, అది వారి జీవన విధానం, బతుకుతెరువని ఎద్దేవా చేశారు. తనపై వైసీపీ ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసుల్లో ఫోన్ ట్యాపింగ్ అంశమే లేదని స్పష్టం చేశారు. ఆరోపణలకు, కేసుకు, విచారణకు తేడా తెలియకుండా తనపై బురద చల్లుతున్న జగన్ పత్రికకు చట్టం అంటే ఏమిటో తెలిసేలా చేస్తానని మంగళవారం 'ఎక్స్'లో ఏబీవీ హెచ్చరించారు.

అదానీ ఒప్పందాన్ని రద్దు చేసేవరకు పోరాటం

- అమిత్‌షా రాజీనామా డిమాండ్‌తో 30న నిరసనలు: రామకృష్ణ

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అదానీ సంస్థలతో జగన్ ప్రభుత్వం చేసుకున్న సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేసేవరకు వామపక్షాల పోరాటం కొనసాగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మంగళవారం విజయవాడలోని దాసరి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న అంశాలకే స్పందించే సీఎం చంద్రబాబు ఇంత పెద్ద కుంభకోణంపై స్పందించడానికి భయపడుతున్నారని విమర్శించారు. అంబేడ్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 30న రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ శత వార్షికోత్సవాల పోస్టర్‌ను రామకృష్ణ ఆవిష్కరించారు.

బీజేపీలోకి విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి

- పురందేశ్వరి సమక్షంలో నేడు రాజమహేంద్రవరంలో చేరిక



విశాఖపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ బీజేపీలో చేరబోతున్నారు. బుధవారం రాజమహేంద్రవరంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో చేరుతున్నారు. మాజీ ప్రధాని వాజపేయి శతజయంతి సందర్భంగా అక్కడ బీజేపీ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. అక్కడ ఆనంద్‌కుమార్ పార్టీ సభ్యత్వం తీసుకుంటారు. అభిమానులు, అనుచరులు రాజమహేంద్రవరం రావాలని వాట్సాప్ ద్వారా ఆయన ఆహ్వానించారు. ఇటీవల ఆయన వైసీపీకి రాజీనామా చేసిన ఆయన్ను చేర్చుకునేందుకు టీడీపీ నేతలు సుముఖత చూపలేదు. పైగా కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖ డెయిరీలో అక్రమాలపై దృష్టిపెట్టింది. డెయిరీ ఆస్తులను ఆనంద్ స్వాహా చేశారని.. అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టాలని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు పెద్దఎత్తున డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ అంశంపై ఇటీవల అసెంబ్లీ సభాసంఘం కూడా ఏర్పాటుచేశారు. అది విచారణ కూడా ప్రారంభించింది. ఇంకోవైపు... ఆనంద్ టీడీపీలో చేరేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఆ పార్టీ నేతలు అడ్డుకోవడంతో బీజేపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. అయితే ఢిల్లీ స్థాయిలో మంతనాలు జరిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను నేరుగా కలిసి బీజేపీలో చేరేందుకు సంసిద్ధత తెలియజేశారు. అక్కడ భరోసా లభించడంతో రాష్ట్రానికి వచ్చి ఆ పార్టీ నేతలను కలిశారు. ఇదే సమయంలో సభాసంఘం విచారణకు రావడంతో ఆయన తొలుత వైసీపీకి రాజీనామా చేశారు. బీజేపీలో చేరడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఢిల్లీ పెద్దల ఆదేశంతో రాష్ట్ర నేతలు ఆయన్ను పార్టీలో చేర్చుకుంటున్నారు.

నామినేషన్‌పై మైనర్ మినరల్స్!

- ప్రభుత్వ పనులకు వేలం ప్రక్రియ తొలగింపు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): చిన్న తరహా ఖనిజాల(మైనర్ మినరల్స్) విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ రంగ, అనుబంధ విభాగాలు చేపట్టే పనులకు అవసర మైన మైనర్ మినరల్స్‌ను నేరుగా నామినేషన్ పద్ధతిలో ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు మైనరల్ మినరల్స్ కన్సిషన్ రూల్స్11(1)(1)లో సవరణలు చేస్తూ గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా ఉత్తర్వులు(జీఓ-96) జారీ చేశారు. ఈ మేరకు గతంలో ఇచ్చిన ఉత్తర్వుల(జీఓ-25)కు సవరణ చేశారు. మైనర్ మినరల్స్‌లో ప్రధానంగా గ్రావెల్(మట్టి), రోడ్‌మెటల్, బిల్డింగ్ స్టోన్, సాధారణ ఇసుక ఉంటాయి. గతంలో వీటిని ప్రభుత్వ లేదా ప్రైవేటు కంపెనీలకు ఇవ్వాలనుకున్నప్పుడు వేలం ప్రక్రియ ద్వారా అప్పగించేవారు. ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్న కారణంతో ఆ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ సంస్థలు, లేదా ఏజెన్సీలు, వాటి పరిధిలో మౌలిక వనరుల ప్రాజెక్టులు చేపట్టాలనుకుంటే అవి కూడా ఈ మైనర్ మినరల్స్ కోసం వేలంలో పాల్గొనేవి. అయితే, ఇప్పుడు ప్రభుత్వమే భారీగా వేల కోట్లతో మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపడుతున్నందున ప్రభుత్వ రంగ సంస్థల వర్క్‌లు చేపట్టే ఏజెన్సీలకు వేలం ప్రక్రియ తప్పించి నేరుగా నామినేషన్ పద్ధతిలో మినరల్స్ అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉదాహరణకు అమరావతి పరిధిలో రహదారి, భవన నిర్మాణ ప్రాజెక్టులు సీఆర్‌డీఏ చేపడుతోంది. ఆ పనులను దక్కించుకున్న సంస్థలకు భారీగా ఇసుక, మట్టి, రోడ్‌మెటల్, బిల్డింగ్ స్టోన్ తదితరాలు అవసరమవుతాయి. ఆ పనులు చేపట్టే ఏజెన్సీలు నేరుగా నామినేషన్ పద్ధతిన వాటిని పొందుతాయి. వేలంలో పాల్గొనాల్సిన అవసరం ఇక ఉండదు. దీని వల్ల సమయం, నిధులు ఆదా అవుతాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.



మనాలీపై మంచు దుప్పటి

మనాలీ, డిసెంబరు 24: హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీని మంచు దుప్పటి కప్పేసింది. రహదారులపై అడుగు మేర మంచు గడ్డకట్టింది. దీంతో.. సోలాంగ్-రోహతంగ్ రహదారిపై వెయ్యికి పైగా వాహనాలు స్తంభించిపోయాయి. 700 మందికి పైగా పర్యాటకులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నెహ్రూకుండ్ నుంచి సోలాంగ్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. ముందు జాగ్రత్తగా అటల్ టన్నెల్‌కు వెళ్లడాన్ని నిషేధించారు. డిసెంబరు-ఫిబ్రవరి కాలంలో మనాలీకి పర్యాటకులు పోటెత్తుతారు. సోమవారం నుంచి భారీగా మంచు కురుస్తుండడంతో జనజీవనం స్తంభించిపోయింది. కోట్టిలో 48, రోహ్రూలో 27 ప్రధాన రహదారులు మంచుతో నిండిపోయి, రాకపోకలు జరగడం లేదు.

లోయలో పడిన ఆర్మీ వాహనం

- ఐదుగురు జవాన్ల మృతి, మరో ఐదుగురికి గాయాలు

జమ్మూ, డిసెంబరు 24: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో మంగళవారం ఘోర ప్రమాదం జరిగింది. జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం 350 అడుగుల లోయలో పడి ఐదుగురు మృతి చెందగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. భద్రతా చర్యల్లో భాగంగా జవాన్లు బాల్‌నోయ్ చెక్‌పోస్టుకు వెళ్తుండగా ఘరోవా ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఉగ్రవాదుల ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎక్స్ వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు

- మిజోరాంకు జనరల్ వీకే సింగ్
- కేరళ, బిహార్ గవర్నర్ల పరస్పర బదిలీ
- ఐదు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం

న్యూఢిల్లీ/అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన కంభంపాటి హరిబాబు ఒడిశా నూతన గవర్నర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన మిజోరాం గవర్నర్‌గా ఉన్నారు. ఐదు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఒడిశా గవర్నర్ పదవికి రఘుబర్ దాస్ చేసిన రాజీనామాను ఆమోదించిన రాష్ట్రపతి ఆయన స్థానంలో హరిబాబును నియమించారు. కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌ను బిహార్‌కు, బిహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కేరళకు బదిలీ చేశారు. మణిపూర్ గవర్నర్‌గా కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లాను, మిజోరాం గవర్నర్‌గా జనరల్ విజయ్‌కుమార్ సింగ్‌ను నియమించారు. కాగా, ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు నియమితులు కావడం సంతోషకరమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆయన నియామకంతో ఏపీ, ఒడిశా సరిహద్దు సమస్యలతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి, ఇరు రాష్ట్రాల అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

‘అంబేడ్కరే’ 2025 ఎజెండా!

రేపటి బెళగావి వర్కింగ్ కమిటీ భేటీలో కాంగ్రెస్ కార్యాచరణ.. అమిత్‌షా రాజీనామా కోసం ఉద్యమం!

- సమావేశానికి ‘నవ సత్యాగ్రహ బైఠక్’గా నామకరణం


ప్రయాగ్‌రాజ్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళనలు

న్యూఢిల్లీ, డిసెంబరు 24: అంబేడ్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజ్యసభలో అవమానించారంటూ పెద్దఎత్తున ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ అంశాన్నే ప్రధాన ఎజెండాగా చేసుకుని 2025లో ఉద్యమించడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని గురువారం బెళగావిలో జరిగే వర్కింగ్ కమిటీ సమావేశంలో తీర్మానించనుంది. 1924లో మహాత్మా గాంధీ అధ్యక్షతన కర్ణాటకలోని బెళగావిలో జాతీయ కాంగ్రెస్ సదస్సు జరిగి వందేళ్లు గడచిన సందర్భంగా వర్కింగ్ కమిటీ భేటీని అక్కడ ఏర్పాటు చేశారు. అంబేడ్కర్‌కు జరిగిన అవమానాన్ని గట్టిగా జనంలోకి తీసుకెళ్లి ఉద్యమిస్తామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, మీడియా-పబ్లిసిటీ విభాగం అధిపతి పవన్ ఖేరా మంగళవారమిక్కడ విలేకరులకు తెలిపారు. గురువారంనాటి సమావేశానికి ‘నవ సత్యాగ్రహ బైఠక్’ అని నామకరణం చేసినట్లు జైరాం వెల్లడించారు. తమ పార్టీ ఈ వారాన్ని ‘అంబేడ్కర్ సమ్మాన్ సప్తాహ్’గా పాటిస్తున్నట్లు తెలిపారు. అమిత్‌షాను హోం మంత్రిగా తొలగించడం.. ఆయన తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పడమే ఈ సమస్యకు ఏకైక పరిష్కారమన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని ప్రధాని మోదీ, బీజేపీ భావిస్తున్నారని.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అంబేడ్కర్‌కు జరిగిన అవమానంపై ఏం చేయాలి.. భవిష్యత్‌లో ఎలాంటి కార్యాచరణ చేపట్టాలో వర్కింగ్ కమిటీ భేటీలో లోతుగా చర్చిస్తామని వేణుగోపాల్ చెప్పారు. అమిత్‌షా రాజీనామాను డిమాండ్ చేస్తూ.. మంగళవారం దేశవ్యాప్తంగా జిల్లా కాంగ్రెస్ కమిటీలు ప్రదర్శనలు నిర్వహించి కలెక్టర్ల ద్వారా రాష్ట్రపతికి మెమోరాండం సమర్పించాయన్నారు. గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు నవ సత్యాగ్రహ బైఠక్ ప్రారంభమవుతుందన్నారు. మర్నాడు 27న బెళగావిలోనే ‘జై బాపు, జై భీమ్, జై సంవిధాన్’ ర్యాలీ జరుగుతుందని.. ఇందులో లక్షలమంది కార్యకర్తలు, ఎంపీలు, ఏఐసీసీ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

ఎన్నికల నిబంధనల్లో మార్పులపై ‘సుప్రీం’కు కాంగ్రెస్

న్యూఢిల్లీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనల్లో మార్పులు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 93(2)(ఏ)ను కేంద్రం సవరించడంపై సర్వోన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ వేసింది. ప్రభుత్వ చర్యలతో ఎన్నికల ప్రక్రియ సమగ్రతకు భంగం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని జైరాం రమేశ్ మంగళవారం ఎక్స్ ద్వారా వెల్లడించారు. కాగా, ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో ఎన్నికల సంఘం ఇటీవల మార్పులు చేసింది. పోలింగ్ సీసీ టీవీ ఫుటేజీ, వెబ్ క్యాస్టింగ్ రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 93(2) (ఏ)ను కేంద్ర న్యాయశాఖ సవరించింది. ఈ నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరించడం, కీలకమైన చట్టాన్ని కేంద్రం సవరించడం సరికాదని జైరాం రమేశ్ అన్నారు.

నేడు ఎన్డీయే నేతల కీలక భేటీ

న్యూఢిల్లీ, డిసెంబరు 24: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భాగస్వామ్య పక్షాలు బుధవారం భేటీ కానున్నాయి. ఢిల్లీలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో ఈ కీలక సమావేశం జరగనుంది. దివంగత నేత, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ శత జయంతి వేడుకల నేపథ్యంలో ఎన్డీయే నేతలు ఆయనకు ఘనంగా నివాళులర్పించనున్నారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు నడ్డా నివాసంలో నేతలు భేటీ కానున్నట్లు సమాచారం. దేశంలో తాజా రాజకీయ పరిస్థితులు, ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో చోటుచేసుకున్న ఘటనలు, తదుపరి కార్యాచరణపై చర్చించే అవకాశం ఉంది. ఏపీ సీఎం చంద్రబాబు సహా ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు పాల్గొననున్నారు. అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలతో తీవ్ర రాజకీయ దుమారం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ అంశంలో కాంగ్రెస్‌కు గట్టిగా సమాధానం చెప్పే విషయంపైనా నేతలు చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కెనడాలో శాశ్వత నివాసం కష్టమే!

- జాబ్ ఆఫర్ పాయింట్లు ఎత్తివేత
- ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ విధానంలో మార్పు
- భారతీయులపై భారీ ప్రభావం

టొరంటో, డిసెంబరు 24: కెనడాలో శాశ్వత నివాసం ఉండాలనుకునే విదేశీయులకు భారీ షాక్ తగిలింది. “నాకు ఉద్యోగ అవకాశం వచ్చింది. ఇక ఇక్కడే ఉండిపోతాను” అంటే కుదరదని కెనడా తేల్చి చెప్పింది. ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ విధానం ద్వారా సంపాయించుకునే జాబ్ ఆఫర్ పాయింట్లను ఎత్తివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025 నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుందని తెలిపింది. తద్వారా జాబ్ ఆఫర్ పాయింట్లను ఆధారంగా చేసుకుని శాశ్వత నివాసం కోరేందుకు అవకాశం లేకుండా పోతుంది. ఈ మేరకు ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ విధానంలో కెనడా ప్రభుత్వం మార్పులు చేసింది. ప్రస్తుతం తాత్కాలిక పద్ధతిలో ఉద్యోగం చేస్తున్న వారికి కూడా ఈ మార్పులు వర్తిస్తాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. “అభ్యర్థులు ఉద్యోగం పొందినా.. అదనపు పాయింట్లు జోడించినా.. శాశ్వత నివాసం కోసం అభ్యర్థించలేరు” అని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఇప్పటి వరకు శాశ్వత నివాసం కోసం కనీసం 50 పాయింట్లు రావాలి. కొన్నికొన్నిసార్లు అభ్యర్థుల మధ్య ఈ పాయింట్ల విషయంలో వ్యత్యాసం ఉంటోంది. అయితే, ఈ విషయంలో మోసాలు జరుగుతున్నాయని గుర్తించిన కెనడా ప్రభుత్వం పూర్తిగా ఈ వ్యవస్థను ఎత్తివేసింది. ఈ మేరకు రిఫ్యూజీస్, సిటిజన్ షిప్ కెనడా(ఐఆర్‌సీసీ) సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే, ఇప్పటికే దరఖాస్తులు పరిశీలనలో ఉన్నవారిపై ఎలాంటి ప్రభావం ఉండదని ఐఆర్‌సీసీ పేర్కొంది. కెనడాలో స్థిరపడాలనుకునే భారతీయులకు ప్రస్తుత నిర్ణయం శరాఘాతమేనని నిపుణులు చెబుతున్నారు. కెనడాలో ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ విధానం ద్వారా ఉపాధి, ఉద్యోగాలు పొందుతున్న విదేశీయుల్లో భారతీయులే ఎక్కువగా ఉంటున్నారని తెలిపారు. తాజా నిర్ణయంతో వారంతా శాశ్వత నివాస అర్హత కోల్పోయినట్టేనని పేర్కొన్నారు. 2023 లెక్కల ప్రకారం 85,760 మంది విదేశీయులు ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ విధానం ద్వారా కెనడాలో ఉద్యోగాలు పొందితే.. వారిలో 40,775 మంది భారతీయులే ఉన్నారు.

ఆస్పత్రి నుంచి జూనియర్ ఎన్టీఆర్ అభిమాని కౌశిక్ డిశ్చార్జ

- చెన్నైకు అభిమాన సంఘం నేతలను పంపిన నటుడు
- డిశ్చార్జ్‌కు ఏర్పాట్లు.. యోగక్షేమాలు ఆరా
- కౌశిక్ తల్లి ఆరోపణలు సరికాదన్న హీరో అభిమాన సంఘం నేతలు

తిరుపతి, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతూ చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమాని, తిరుపతికి చెందిన కౌశిక్ మంగళవారం డిశ్చార్జ్ అయ్యారు. ఎన్టీఆర్ సూచనల మేరకు ఆయన అభిమాన సంఘం నాయకుడు కృష్ణ యాదవ్ అపోలో ఆస్పత్రికి వెళ్లి కౌశిక్ డిశ్చార్జ్ ఏర్పాట్లు చూశారు. తన కుమారుడికి అవసరమైన ఖర్చు భరిస్తానంటూ హామీ ఇచ్చిన జూనియర్ ఎన్టీఆర్ ముందుకురావాలంటూ కౌశిక్ తల్లి సోమవారం మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న జూ.ఎన్టీఆర్ తన అభిమాన సంఘం నాయకులను చెన్నైకు పంపి కౌశిక్ యోగక్షేమాలు తెలుసుకున్నారు. డిశ్చార్జ్‌కు ఏర్పాట్లు చేశారు. అయితే మీడియా సమావేశంలో కౌశిక్ తల్లి ఎన్టీఆర్‌పై ఆరోపణలు చేయడాన్ని ఆయన అభిమానులు ఖండించారు. జూ.ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకుడు కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. కౌశిక్ వైద్యం కోసం టీటీడీ రూ. 40 లక్షలు, ప్రభుత్వం రూ. 11 లక్షలు ఇచ్చిందని, ఎన్టీఆర్ అభిమానులు కూడా సుమారు రూ. 10 లక్షల వరకు విరాళంగా అందించారన్నారు. ఏదైనా అవసరముంటే తమను నేరుగా అడిగి ఉంటే సహాయం చేసేవారమని, అనవసరంగా తమ హీరోపై నిందలు వేయడం సరికాదని చెప్పారు. కౌశిక్ కుటుంబసభ్యుల అకౌంట్‌లో ఎన్టీఆర్ అభిమానులు పెద్దమొత్తంలో జమ చేసినప్పటికీ వారు రూ. 2 లక్షలు మాత్రమే ఆస్పత్రికి చెల్లించారన్నారు.

అమెరికాలో స్మగ్లర్ సునీల్ యాదవ్ కాల్చివేత

న్యూఢిల్లీ, డిసెంబరు 24: కరుడుగట్టిన మాదక ద్రవ్యాల స్మగ్లర్ సునీల్ యాదవ్ అమెరికాలో హత్యకు గురయ్యాడు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌కి అనుచరుడిగా ఉన్న రోహిత్ గొదారా అతడిపై తుపాకీతో కాల్పులు జరిపాడు. ప్రతీకారంతోనే ఈ హత్య చేసినట్టు తెలిపాడు. కాలిఫోర్నియా రాష్ట్రం స్టాక్‌టన్ సిటీలో ఈ ఘటన జరిగింది. పంజాబ్‌లోని ఫజిల్కా జిల్లాకు చెందిన సునీల్‌పై రాజస్థాన్‌లో పలు స్మగ్లింగ్ కేసులు నమోదయ్యాయి. రెండేళ్ల క్రితం అతడు అమెరికా వెళ్లాడు. లారెన్స్ ముఠాలో పనిచేసినప్పుడు సునీల్, రోహిత్ మధ్య స్నేహం ఉండేది. అయితే పంజాబ్ పోలీసులతో కలిసి తనకు సోదరుడులాంటి అంకిత్ భాదును ఎన్‌కౌంటర్ చేయించాడన్న కారణంతో సునీల్‌పై రోహిత్ కక్ష పెట్టుకున్నాడు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.